అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

www.navatelangana.com

14 పేజీలు వెల: 6.50

సోమవారం 16-12-2024

సంపుటి: 10 సంచిక: 347

Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar





బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో రాజ్యాంగం విధ్వంసం

జమిలీతో నష్టపోయేది బీఆర్ఎస్, టీడీపీ వంటి ప్రాంతీయ పార్టీలే

ప్రజల కోసం పోరాడేది కమ్యూనిస్టులే

సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు

యాదాద్రి భువనగిరి జిల్లా మహాసభల సందర్భంగా చౌటుప్పల్‌లో బహిరంగసభ

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

ప్రాంతీయ పార్టీల సహకారంతో కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానాల వల్ల పదేండ్లుగా రాజ్యాంగం విధ్వంసం అవుతున్నదని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు విమర్శించారు. 75 ఏండ్లు పూర్తి చేసుకున్న భారత రాజ్యాంగాన్ని రక్షించాలంటే ఈ ప్రభుత్వాన్ని తప్పించడమే మార్గమని, అందుకు పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) యాదాద్రి భువనగిరి జిల్లా 3వ మహాసభల సందర్భంగా ఆదివారం చౌటుప్పల్ పట్టణంలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించారు. స్థానిక వలిగొండ రోడ్డు నుంచి బహిరంగ సభ ప్రాంతం వరకు కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అధ్యక్షతన జరిగిన సభలో రాఘవులు మాట్లాడారు. కుల, మత విశ్వాసాలను పెంచి పోషించి మరింత కాలం రాజకీయ పబ్బం గడుపుకోవడానికే బీజేపీ, ఆర్ఎస్ఎస్ సనాతనధర్మాన్ని ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. చావు దప్పి కన్నులొట్టపోయిన చందంగా అధికారంలోకి వచ్చిన మోడీ తన వైఖరిని మార్చుకోలేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడు, బీహార్‌లో నితీశ్‌కుమార్ తమకు డబ్బులు వస్తే చాలు అనే విధంగా మోడీకి ఊడిగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్టుబడిదారుల కబంధహస్తాల్లో ఇరుక్కుపోయిన మోడీ.. అన్ని వర్గాలపై దాడులు పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందన్నారు. బీజేపీ నల్లచట్టాలు, విద్యుత్ చట్టం తీసుకొచ్చిందన్నారు. రాష్ట్రంలో ఉచిత విద్యుత్తు ఇస్తుంటే బీజేపీ మీటర్లు పెట్టమని ఒత్తిడి తెస్తున్నదని, పెట్టకపోతే.. రాష్ట్రాలకు రావాల్సిన డబ్బులు ఇవ్వమని బెదిరిస్తున్నదని తెలిపారు. రైతుల హక్కులను కాలరాసే విధానాల్ని అమలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. చౌటుప్పల్ శివారులో నూతనంగా నిర్మిస్తున్న ట్రిబుల్ ఆర్ నిర్మాణంలో రైతులకు అన్యాయం చేస్తూ 40 కిలోమీటర్ల దూరంలో వేయాల్సిన రహదారులను 28 కిలోమీటర్ల దూరంలోనే నిర్మాణానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కోట్ల విలువ చేసే భూములను రూ.పది లక్షలకు, 20 లక్షలకు తీసుకొని నష్టం చేస్తున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వానికి రైతులు ముఖ్యమా, పరిశ్రమల యజమానులు ముఖ్యమా సమాధానం చెప్పాలన్నారు. భువనగిరి జిల్లా శివారులో అనేక పరిశ్రమలు ఉన్నాయని, ఈ పరిశ్రమలు వ్యర్థ పదార్థాలు వెదజల్లుతూ ప్రజల ప్రాణానికి హాని కలిగిస్తున్నాయని ఆగ్రహం ...13లో

దొడ్డి తోవ..

మళ్ళీ మూడు నల్లచట్టాల అమలుకు మోడీ సర్కార్ యత్నం

చారిత్రాత్మక రైతు ఉద్యమంతో మూడు వ్యవసాయ నల్ల చట్టాలు అమలుపై వెనక్కి తగ్గి, బహిరంగంగా క్షమాపణలు చెప్పిన మోడీసర్కార్, ఇప్పుడు మళ్ళీ అవే చట్టాల్ని పేరు మార్చి అమల్లోకి తెచ్చే ప్రయత్నం చేస్తుంది. దీనికి సంబంధించి వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధానం అంటూ పేరు మార్చి, రద్దయిన నల్లచట్టాల్లోని అంశాలనే దానిలో పొందుపర్చి, ముసాయిదా ప్రతిని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. దీనిపై దేశరైతాంగం మరోసారి భగ్గుమంటున్నది.



- వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధానం అంటూ పేరు మార్పు
- రద్దు చేసిన చట్టాల్లోని అంశాలతోనే ముసాయిదా విడుదల
- కేంద్రంపై రైతు సంఘాల ఆగ్రహం
- మరో రైతాంగ ఉద్యమానికి శ్రీకారం

న్యూఢిల్లీ: గతనెల 25న విడుదలయిన వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధానం ముసాయిదాను రైతు సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. దేశవ్యాప్తంగా దీనిపై చర్చ తీవ్రమైంది. చారిత్రాత్మక రైతాంగ పోరాటం తర్వాత 2021 నవంబర్‌లో ప్రధానమంత్రి మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. సరిగ్గా మూడేండ్ల తరువాత అవే చట్టాలకు పేరు మార్చి మరోసారి అమల్లోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే శంభులోని పంజాబ్-హర్యానా సరిహద్దులో రైతులు తమ నిరసనలను కొనసాగిస్తున్నారు. ఢిల్లీకి పాదయాత్రగా వెళ్తున్న రైతాంగ ప్రయత్నాలను బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. ఈ మేరకు కేంద్రం కూడా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది. గత అనుభవాల దృష్ట్యా ఆందోళనకారులు ఢిల్లీకి రాకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలను హెచ్చరించింది. పేరు మార్చి విడుదల చేసిన ముసాయిదా ప్రతిలో రాష్ట్రాల పరిధిలోని అంశాల్లో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటూ క్లాజులు ఉన్నాయి. రద్దయిన నల్లచట్టాల్లోనూ ఇవే అంశాలు ఉండటం గమనార్హం. ఏకీకృత జాతీయ విధానం, రాజ్యాంగ ప్రాతిపదిక, రాష్ట్రాల స్వయంప్రతిపత్తి, రైతు సంక్షేమం అంశాల్లో కేంద్రం జోక్యం చేసుకుంటున్నది. వ్యవసాయం, వ్యవసాయ మార్కెటింగ్ వ్యవహారాలు రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర జాబితాలోని అంశాలు. వ్యవసాయ పరిశోధన మాత్రం కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశం. కానీ ముసాయిదా బిల్లులో అన్ని అంశాల్లోనూ కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటూ ప్రతిపాదనలు చేసింది. జీఎస్టీ కౌన్సిల్ తరహాలో ప్రత్యేక కమిటీ ద్వారా మార్కెటింగ్ సంస్కరణలు ప్రతిపాదించాలనీ, దానికి రాష్ట్ర వ్యవసాయ మంత్రులు ప్రాతినిధ్యం వహించాలని పేర్కొంది. వ్యవసాయ వాణిజ్య ప్రక్రియల ఆటోమేషన్, డిజిటలైజేషన్ చేయాలనీ, ఫీజులు, లైసెన్సులు, నిబంధనల హేతుబద్ధీకరణ ద్వారా వ్యవసాయ వాణిజ్యాన్ని సులభతరం చేయాలని ముసాయిదాలో పేర్కొన్నారు. అలాగే దేశవ్యాప్తంగా మార్కెట్ వ్యవస్థలన్నింటినీ ఒకే గొడుగుకు కిందకు తీసుకొస్తామని ముసాయిదాలో తెలిపారు. ఆయా రాష్ట్రాల్లోని ప్రత్యేక పరిస్థితులు, పంటల సరళి, వాతావరణ మార్పులను పరిగణనలోకి తీసుకోకుండా వ్యవస్థలన్నింటినీ ఒకే గొడుగు కిందికి తేవడం నల్ల చట్టాల అమల్లో భాగమే కావడం గమనార్హం. ఇలాంటి చర్యలు సమాఖ్య నిర్మాణాన్ని బలహీనపరుస్తాయని ...13లో



తబలా మాస్ట్రో ఇక లేరు

శాన్‌ఫ్రాన్సిస్కోలో అనారోగ్యంతో జాకీర్ హుస్సేన్ కన్నుమూత

న్యూఢిల్లీ : ప్రముఖ తబలా వాయిద్యకారుడు ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ (73) కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయన ఆదివారం రాత్రి తుది శ్వాస విడిచారు. హృదయ సంబంధిత సమస్యలతో అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో గల ఒక ఆస్పత్రిలో చేరారు. ఆయన ఆరోగ్య పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో ఐసీయూలో చికిత్స అందించారు. అయితే, పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి ఆయన తుది శ్వాస విడిచారు. జాకీర్ హుస్సేన్ మరణంతో దేశ, విదేశాల్లోని సంగీత అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. జాకీర్ హుస్సేన్ 1951, మార్చి 9న ముంబయిలోని ...6లో

భూమిలేని పేదలకు రూ.12వేలు

ఏడాదికి రెండు విడతలుగా అమలు..

- డిసెంబర్ 28న రూ.6వేలు జమ
- కేసీఆర్ పదేండ్ల అప్పులపై చర్చకు సిద్ధమా..?
- జిల్లాలను అనుసంధానిస్తూ రీజినల్ రింగ్ రోడ్డు
- ఉపముఖ్యమంత్రి, మల్లు భట్టి విక్రమార్క



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇస్తామన్న రూ.12వేల హామీని ఈనెల 28వ తేదీ నుంచి అమలు చేస్తామని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధనవనరుల శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఏడాదికి రెండు విడతలుగా ఈ నగదును జమ చేస్తామని తెలిపారు. సంక్రాంతి నుంచి రైతుభరోసా డబ్బులు కూడా ఇస్తామని పునరుద్ఘాటించారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భట్టి మాట్లాడారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు వ్యవసాయానికి నేరుగా రూ.50,953 కోట్లు ఖర్చు చేసిందన్నారు. పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఒరగబెట్టిందేమీ లేదని తెలిపారు. ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టు భ్రమలు ...13లో

నేటి నుంచి మళ్లీ అసెంబ్లీ

వారంరోజులు కొనసాగే అవకాశం

నేడు బీఏసీలో నిర్ణయం

మధ్యాహ్నం 2 గంటలకు క్యాబినెట్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



అసెంబ్లీ సమావేశాలు మళ్లీ సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 9న అసెంబ్లీ సమావేశాల్ని ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆరోజు కొన్ని బిల్లుల్ని శాసనసభలో ప్రవేశపెట్టి, సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా ఆమెకు ధన్యవాదాలు తెలిపి, సభను ఈనెల 16వ తేదీకి వాయిదా వేసిన విషయం తెలిసిందే. 9వ తేదీనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి సచివాలయ ప్రాంగణంలో ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మళ్లీ వారం తర్వాత శాసనసభ, శాసనమండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం పది గంటలకు ప్రశ్నోత్తరాలతో సమావేశాలు ప్రారంభమవుతాయని ...13లో

హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యం

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం అందించాల్సిందే

సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు

తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్ సీఐటీయూ) ఆధ్వర్యంలో బస్సు జాత నిర్మల్ జిల్లాలో ప్రారంభం



నవతెలంగాణ- నిర్మల్

హక్కుల సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచుతామని సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు అన్నారు. ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం అందించాల్సిందేనని, లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఫిబ్రవరి బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం ఫిక్స్‌డ్ ...13లో

మట్టినీ మింగుతుండ్రు

ఖమ్మం జిల్లాలో విచ్చలవిడిగా మట్టి దందా సాగుతోంది. ముఖ్యంగా రఘునాథపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లో గుట్టలు గుట్టల మట్టి తరలిపోతోంది. గత ప్రభుత్వ హయాం నుంచి కొనసాగుతున్న ఈ మట్టి దందా కారణంగా ప్రకృతి సంపద దెబ్బతింటోంది. ప్రభుత్వానికి ఏమైనా ఆదాయం వస్తుందా..? అంటే అది కూడా ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకే వెళ్తోంది. నాటి నుంచి నేటి వరకు ఈ మట్టి మాఫియాకు చెక్ పడట్లేదు. జాతీయ రహదారులు, ప్రభుత్వ నిర్మాణాల పేరుతో అనుమతులు తీసుకొని అక్రమమార్గాల్లో మట్టి తరలిస్తున్నా భూగర్భగనులు, పోలీసు, రెవెన్యూ అధికారులకు పట్టడం లేదు. తాజాగా రఘునాథపాలెం మండలం జింకలగూడెం రెవెన్యూలో స్వామినారాయణ పాఠశాల నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన స్థలంలోని గుట్టల ప్రాంతం నుంచి మట్టి అక్రమంగా తరలిస్తున్నారు. ట్రిప్పుకు కొంత అధికారులకు ముట్టజెప్పి యథేచ్ఛగా ఈ వ్యవహారం సాగిస్తున్నారు.

ప్రభుత్వ నిర్మాణాల పేరుతో అనుమతి | నిబంధనలకు విరుద్ధంగా ప్రయివేటు అమ్మకాలు




- అధికారులకు లంచాలు ముట్టజెప్పి యథేచ్ఛగా తరలింపు
- పోలీస్, మైనింగ్ అధికారులకు ట్రిప్పునకు రూ.500
- రఘునాథపాలెం మండలం జింకలగూడెంలో దందా
- స్వామినారాయణ స్కూల్ కాంట్రాక్టర్ నిర్వాకం
- రోజుకు రూ.3లక్షల విలువైన మట్టి అక్రమంగా రవాణా

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ ఖమ్మం

రఘునాథపాలెం మండలం జింకలతండా రెవెన్యూ పరిధిలో స్వామినారాయణ స్కూల్ నిర్మాణం కోసం ప్రభుత్వం 30 ఎకరాలు కేటాయించింది. గత ప్రభుత్వ హయాంలో మట్టి అక్రమాలు చోటు చేసుకోవడంతో ఈ ప్రాంతంలో ఉన్న రూ.కోట్ల విలువైన మట్టిని తరలించారు. గుట్టలు, మట్టి తరలించగా ఏర్పడిన గోతులున్న ప్రాంతాన్ని ఈ పాఠశాల నిర్మాణానికి కేటాయించారు. గుట్టను చదును చేసి, గోతులు పూడ్చివేత పేరుతో అనుమతులు తీసుకున్న కాంట్రాక్టర్ ఒకటి, రెండు టిప్పర్ల గుట్టమట్టిని గోతులు పూడ్చడానికి



ఉపయోగించి.. రోజుకు వంద ట్రిప్పుల మట్టిని బయటకు తరలిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. స్కూల్ నిర్మాణం పేరుతో అనుమతులు తీసుకొని బయటకు తరలించడం ఏంటని ఎవరైనా ప్రశ్నిస్తే.. అధికారులే తమ చేతిలో ఉన్నారు.. ఏవరేమీ చేయలేరనే రీతిలో బాహాటంగా మాట్లాడటం గమనార్హం. గుట్టమట్టిని కేవలం స్కూల్ నిర్మాణానికే వినియోగించాలనే నిబంధన ...13లో



జమిలీ బిల్లులపై వెనక్కి తగ్గిన కేంద్రం

న్యూఢిల్లీ : జమిలీ ఎన్నికలకు సంబంధించి లోక్‌సభలో సోమవారం రెండు బిల్లులు ప్రవేశపెట్టాలని నిర్ణయించిన నరేంద్ర మోడీ ప్రభుత్వం గంటల వ్యవధిలోనే వెనక్కి తగ్గింది. ఈ వారం చివరలో ఈ బిల్లులు సభ ముందుకు వచ్చే అవకాశం ఉన్నదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇతర కార్యక్రమాలు చేపట్టడానికి ముందు గ్రాంట్లకు సంబంధించిన తొలి అనుబంధ డిమాండ్లకు సభ ఆమోదం పొందాలని ప్రభుత్వం భావిస్తోందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నదని ఆ వర్గాలు వివరించాయి. ఈ నెల 20న పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ముగుస్తాయి. లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న ప్రతిపాదనను అనేక ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. బిల్లులను ప్రవేశపెట్టే దశలోనే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయాలని ఆ పార్టీలు యోచిస్తున్నాయి.

సోమవారం చేపట్టబోయే సభా కార్యక్రమాలను లోక్‌సభ వెబ్‌సైటులో ప్రచురించారు. దీని ప్రకారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ 129వ రాజ్యాంగ సవరణ బిల్లును, కేంద్ర పాలిత ...13లో

జమిలీకి నో

వద్దంటున్న జమ్మూకాశ్మీర్ నేతలు

సమాఖ్య వ్యవస్థకు విఘాతం : మెహబూబా, తరిగామి, మసూది 3లో

గ్రూప్ -2 పరీక్షలు ప్రశాంతం

పేపర్-1లో 46.75, పేపర్-2లో 46.30 శాతం హాజరు

వికారాబాద్ పరీక్షా కేంద్రంలో సెల్‌ఫోన్‌తో చిక్కిన అభ్యర్థి 13లో



మేము దేశంలో భాగం కాదా?

ప్రజలకు ప్రధాని ఎందుకు సమాధానం చెప్పలేదు? : లోక్‌సభలో మణిపూర్ ఎంపీ ప్రశ్నలు 3లో





దేశ సమగ్రత, సమైక్యతకు పటేల్ కృషి

సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ : దేశ సమగ్రత, సమైక్యతకు సర్దార్ పటేల్ కృషి చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.భారత తొలి ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా ఆదివారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ఆయన చిత్రపటానికి సీఎం రేవంత్‌రెడ్డి పుష్పాంజలి ఘటించారు. పటేల్‌కు నివాళులు అర్పించిన వారిలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఉన్నారు.



వ్యవస్థల వైఫల్యంతోనే 'సాయిబాబా' మృతి

- ఇష్టానుసారంగా ఉపా, రాజద్రోహం కేసులు : సదస్సులో విశ్రాంత ప్రొఫెసర్ హరగోపాల్

కడప : దేశం ఫాసిజానికి దగ్గరవుతోందని, అభ్యుదయవాదులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందని ప్రముఖ విశ్రాంత అధ్యాపకులు, పౌరహక్కుల వేత్త హరగోపాల్ పేర్కొన్నారు. కడపలోని హరిత్ హోటల్‌లో వామపక్ష ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రముఖ న్యాయవాది బొగ్గుల గుర్రప్ప అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన 'ప్రొఫెసర్ జి ఎన్ సాయిబాబా స్మృతి.. చట్టం అందరికీ సమానమేనా ' అంశంపై హరగోపాల్ ప్రధాన వక్తగా హాజరై మాట్లాడారు. దేశంలో స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం ప్రమాదంలో పడ్డాయన్నారు. రాజ్య స్వభావం మారేకొద్దీ పోరాటాలు పెరుగుతాయనే సంగతిని గుర్తించుకోవాలన్నారు. నిరాధారమైన ఆరోపణలతో ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాను పదేండ్ల పాటు జైలులో పెట్టి, ఆయన విలువైన సమయాన్ని బలి తీసుకున్నారని అన్నారు. విశ్వవిద్యాలయ, న్యాయ వ్యవస్థ, జైలు వ్యవస్థల వైఫల్యం కారణంగా సాయిబాబా మృతి చెందారని విమర్శించారు. సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్ మాట్లాడుతూ ఇటీవల ఢిల్లీలో మణిపూర్‌కు చెందిన ఎనిమిది మంది బీజేపీ కుకీ ఎమ్మెల్యేలు నిరసన ర్యాలీ నిర్వహించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందన్నారు. మోడీ పదేండ్ల పాలనలో 548 మందిపై రాజద్రోహం కేసులు నమోదు చేసిన ఘనత ప్రపంచ దేశాల్లో ఎక్కడా చోటుచేసుకోలేదని పేర్కొన్నారు. హత్రాస్ ఘటన కవరేజికి వెళ్లిన సిద్ధిఖ్‌కప్పన్ జర్నలిస్టును 712 రోజులు జైలులో నిర్బంధించారన్నారు. అంతకు ముందు సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, రవి ప్రసంగించారు. చివరగా పిహెచ్‌డి స్కాలర్ మల్లెల భాస్కర్ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, బుద్ధిస్ట్ కల్చరల్ సొసైటీ నాయకులు కుళాయిస్వామిరెడ్డి, ప్రముఖ వైద్య నిపుణులు ఓబుల్‌రెడ్డి, రాజావెంగల్‌రెడ్డి మహేశ్వరరెడ్డి, ప్రజా సంఘాలు, ఎల్ఐసీ యూనియన్ నాయకులు, మేధావులు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు పాల్గొన్నారు.



పెండ్లికి రండి

- ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌ను ఆహ్వానించిన పీవీ సింధు

అమరావతి: తన వివాహానికి రావాల్సిందిగా ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ను బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ఆహ్వానించింది. ఆదివారం సాయంత్రం ఉండవల్లిలోని నివాసంలో చంద్రబాబుకు, మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎంను తండ్రి రమణతో కలిసి వివాహ ఆహ్వాన పత్రిక అందజేసింది. ఈ నెల 22న వెంకట దత్త సాయిని సింధు పెండ్లి చేసుకోబోతున్న సంగతి తెలిసిందే. మరోవైపు అత్యంత సన్నిహితుల సమక్షంలో కాబోయే ఈ దంపతులు నిశ్చితార్థం చేసుకున్న విషయం తెలిసిందే.

కులగణనతో సామాజిక,ఆర్థిక మార్పులు

- మాజీ రాష్ట్రపతి కెఆర్.నారాయణన్ ఓఎస్‌డీ ఎస్ఎన్ సాహు



అనంతపురం : దేశంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక స్థితిగతుల్లో మార్పు జరగాలంటే కులగణన అవశ్యమని మాజీ రాష్ట్రపతి కెఆర్.నారాయణన్ ఓఎస్‌డీ ఎస్ఎన్.సాహు తెలిపారు. అనంతపురంలో రెండు రోజులుగా జరుగుతున్న మానవ హక్కుల వేదిక 10వ రాష్ట్ర మహాసభ ఆదివారంతో ముగిసింది. యాపిల్ ఫంక్షన్ హాలులో జరిగిన ఈ మహాసభలో రెండో రోజు మూడు అంశాలపై సదస్సు జరిగింది. 'కుల గణన ఎందుకు అవసరం' అన్న అంశంపై సాహు ప్రసంగిస్తూ దేశంలో ఇప్పటికీ వివక్ష పూరిత సమాజం ఉందని తెలిపారు. మాజీ రాష్ట్రపతి కెఆర్.నారాయణన్ వంటి వారు కూడా ఈ వివక్షను ఎదుర్కొన్న వారేనన్నారు. ఈ కులవివక్ష రూపాలను సరిగా అర్థం చేసుకోవాలంటే కులగణన జరగాల్సిన అవసరముందని పేర్కొన్నారు. మొదటిసారి కేరళలో ముఖ్యమంత్రిగా నంబూద్రీపాద్ బాధ్యతలు చేపట్టాక అక్కడ కులగణన చేయించారని గుర్తు చేశారు. వివక్ష అన్నది ఒక్క హిందూమతంలోనే కాదని, ఇతర మతాల్లోనూ ఉందని ఆ సర్వేలో స్పష్టమైందన్నారు. 'బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘన' అంశంపై స్వతంత్ర జర్నలిస్టు మాలిని సుబ్రమణ్యం మాట్లాడుతూ బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘన యధేచ్చగా సాగుతోందని విచారం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం బడా కార్పొరేట్ కంపెనీలకు అడవుల్లో ఉన్న విలువైన ఖనిజాన్ని కట్టబెట్టేందుకు ఆదివాసీలను అడవుల నుంచి వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. గత నెల నవంబరులో 47 మంది అమాయక గిరిజన మహిళలను ఎటువంటి కారణం లేకుండా వారం రోజులపాటు భద్రతా బలగాలు నిర్బంధంలో ఉంచాయని తెలిపారు. ఇక్కడి విషయాలు బయటకు పొక్కకుండా మీడియాను నియంత్రించే ప్రయత్నాలు సాగుతు న్నాయని వివరించారు. నూతన విద్యా విధానంపై రచయిత కొప్పర్తి వెంకట రమణమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం ప్రయివేటీకరణను ప్రోత్సహించేదిగా ఉందని తెలిపారు. అదే విధంగా పాఠ్యాంశాలను మార్చి కాషాయీకరణ చేసే చర్యలు అందులో ఉన్నాయని పేర్కొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మానవ హక్కుల వేదిక తెలంగాణ కమిటీ అధ్యక్షులుగా భుజంగరావు, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ తిరుపతి, రెండు రాష్ట్రాల సమన్వయకర్తలుగా ఎస్.జీవన్‌కుమార్, వసంతలక్ష్మి, ఎ.చంద్రశేఖర్, విఎస్.కృష్ణ, ఏపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కెవి.జగన్నాథరావు, ప్రధాన కార్యదర్శిగా వై.రాజేష్, ఉపాధ్యక్షులుగా యుజి.శ్రీనివాసులు, ఎ.రవి, జి.శివనాగేశ్వరరావు, ఎస్.అబ్దుల్ రసూల్, ఎం.శరత్, కార్యదర్శులుగా యుఎం.దేవేంద్రబాబు, బిఎస్.సుబ్బన్న, జి.రోహిత్‌ను ఎన్నుకున్నారు.

ఏపీలో పట్టు కోసం పాట్లు

- పెరుగుతున్న లోకేశ్ జోక్యం
- బీజేపీ నేతలతో పవన్ మంతనాలు





అమరావతి :ప్రభుత్వంలో, కూటమిలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ జోక్యాన్ని తగ్గించేందుకు, ఆయన ప్రమేయాన్ని కట్టడి వేయించేందుకు ఉప ముఖ్యమంత్రి, జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ కేంద్రంలోని బీజేపీ పెద్దల శరణుజొచ్చినట్లు తెలుస్తోంది. పవన్ ఇటీవలి ఢిల్లీ పర్యటన అజెండాలో ఈ అంశమే ప్రధానంగా ఉందని కూటమి పార్టీల్లో చర్చ జరుగుతోంది. క్యాబినెట్ మంత్రిగా ఉన్న లోకేశ్ తతిమ్మా మంత్రులు నిర్వహిస్తున్న శాఖల్లో వేలు పెడుతున్నారని, మంత్రుల కార్యాలయాల్లో సిబ్బందిని నియమించే విషయంలో కూడా తాను చెప్పిన వారినే వేసుకోవాలనే వరకు లోకేశ్ జోక్యం వెళ్లిందని పవన్, కొందరు జనసేన ముఖ్య నేతలు అసంతృప్తిగా ఉన్నారు. పవన్ నిర్వహిస్తున్న పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణ శాఖలు మినహా తతిమ్మా అన్నింటిలోనూ లోకేశ్ తన ముద్ర ఉండాలని ప్రయత్నిస్తున్నారని ఆంటున్నారు. లోకేశ్ జోక్యం మితిమీరుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు అదుపు చేయడం లేదన్న భావన జనసేన చీఫ్‌లో ఉందని చెబుతున్నారు. దీంతో బీజేపీ కేంద్ర పెద్దల సహాయాన్ని కోరినట్లు సమాచారం. కాగా పవన్ అప్పీల్‌పై కేంద్ర బీజేపీ పెద్దలు ఆలకించినప్పటికీ ఆచితూచి అడుగేయాలని యోచిస్తున్నట్లు తెలిసింది.

ఆది నుంచీ!

ఎన్నికల్లో కూటమి అసాధారణ విజయం అనంతరం క్యాబినెట్ కూర్పు సమయంలోనే పవన్‌కు కేటాయించాల్సిన శాఖ, ఇవ్వాల్సిన హోదాపై టీడీపీ లో చర్చ జరిగిందని చెబుతారు. కేబినెట్‌లో లోకేశ్‌కు, పవన్‌కు ఒకే హోదా ఇవ్వాలని టీడీపీ నేతల్లో చాలామంది కోరుకున్నారని సమాచారం. అప్పటి పరిస్థితులు, బీజేపీ సూచనల మేరకు పవన్‌కు డిప్యూటి సీఎం హోదా ఇచ్చారు. లోకేష్‌ను క్యాబినెట్ మంత్రిని చేశారు. కాగా, లోకేశ్ నేరుగా ప్రజల నుంచి టీడీపీ కార్యాలయంలో వినతులు స్వీకరించడం మొదలు పెట్టాక పోటీగా పవన్ కూడా జనసేన కార్యాలయంలో ప్రజల నుంచి వినతిపత్రాల స్వీకరణ ప్రారంభించారు. అనంతరం ఇతర మంత్రులూ ఈ పని చేస్తున్నారు. మంత్రుల కార్యాలయాల్లో కాకుండా పార్టీ కార్యాలయాల్లో ప్రజా దర్బారులు నిర్వహించడంపై విమర్శలొచ్చాయి. ఇదిలా ఉండగా అన్ని శాఖల్లోనూ లోకేశ్ నేరుగా జోక్యం చేసుకోవడంపై పవన్ పలు సందర్భాల్లో సన్నిహితుల వద్ద అసహనం వ్యక్తం చేశారని సమాచారం.

'రాజ్యసభ'తో మరింతగా...

రాజ్యసభ సభ్యుల ఎంపికలో పవన్ సోదరుడు నాగబాబుకు నో చెప్పి లోకేశ్ తన ప్రధాన అనుచరుడు సతీష్‌కు ఇప్పించుకోవడంతో వ్యవహారం ముదిరింది. నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకుంటున్నట్లు టీడీపీ చేసిన ప్రకటన వెనుక పవన్ పట్టుదల, బీజేపీ డైరెక్షన్ ఉందని చెబుతున్నారు. లోకేశ్ నిర్వహిస్తున్న విద్యాశాఖ సలహాదారుగా ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు నియామకం వెనుక బీజేపీ, పవన్ పాత్ర ఉందని సమా చారం. చంద్రబాబే పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటారని ఇటీవల అసెంబ్లీలో, తనకు బాబు ప్రాధాన్యత ఇస్తున్నారంటూ విజన్ - 2047 డాక్యుమెంట్ విడుదల సందర్భంగా పవన్ వ్యాఖ్యలు పరోక్షంగా లోకేశ్ పట్ల తన అసంతృప్తిని వ్యక్తం చేయడానికేనని కూటమి పార్టీల్లోని సీనియర్లు విశ్లేషిస్తున్నారు.

డ్రగ్స్‌తో ఉన్న పాక్ డ్రోన్ స్వాధీనం



జమ్మూ : జమ్మూకాశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకున్నాయని, అక్కడ ఉగ్రవాద కార్యక్రమాలను నిరోధించామని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చెబుతున్నా, అక్కడి పరిస్థితులు మాత్రం వేరుగా ఉన్నాయి. తాజాగా సుమారు 500 గ్రాముల హై-గ్రేడ్ నార్కోటిక్ డ్రగ్స్‌ను మోసుకెళతున్న పాకిస్థాన్ డ్రోన్‌ను జమ్మూకాశ్మీర్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వద్ద బిఎస్ఎఫ్ సిబ్బంది స్వాధీనం చేసుకోవడం కలకలం సృష్టిస్తోంది. ఆర్నియా సెక్టార్‌లోని చైనాజ్ బోర్డర్ అవుట్‌పోస్టు ప్రాంతంలో శనివారం అర్థరాత్రి సరిహద్దు దాటి భారత్‌లో ప్రవేశించిన డ్రోన్‌ను బిఎస్ఎఫ్ దళాలు గుర్తించి, స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు ఆదివారం తెలిపారు. 495 గ్రాముల డ్రగ్స్‌తో ఉన్న డ్రోన్‌ను అడ్డుకోవడం ద్వారా పాక్ స్మగ్లింగ్ ప్రయత్నాన్ని బిఎస్ఎఫ్ విఫలం చేసిందని తెలిపారు. దేశ వ్యతిరేకుల దుర్మార్గపు ప్రణాళికను బిఎస్ఎఫ్ సిబ్బంది యొక్క అంకితభావం, జాగరూకత మరోసారి ఓడించిందని, దేశ భద్రత పట్ల బిఎస్ఎఫ్ సిబ్బంది అచంచలమైన నిబద్ధతను ఈ ఘటన చాటి చెప్పిందని పేర్కొన్నారు.

ఈవీఎంలను ప్రశ్నించడం తప్పు

- జమ్మూకాశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా



శ్రీనగర్: జమ్మూకాశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రానప్పుడు మాత్రమే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్స్ (ఈవీఎం)పై ప్రశ్నించడం తప్పని అన్నారు. ఓటింగ్ యంత్రాంగంపై నమ్మకం లేని పార్టీలు ఎన్నికల్లో పోటీ చేయకూడదని సూచించారు. ఈవీఎంలపై ఆరోపణలు చేస్తున్న 'ఇండియా' బ్లాక్ పార్టీలకు తన వ్యాఖ్యలతో షాక్ ఇచ్చారు. బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్‌కు డిమాండ్ చేస్తున్న ప్రతిపక్ష కూటమిలో భాగమైన ఒమర్ అబ్దుల్లా పీటీఐ వార్తా సంస్థకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఓటింగ్ పద్ధతిని ప్రశ్నించడంలో 'స్థిరంగా' ఉండాలని తెలిపారు. గెలిచినప్పుడు ఒక విధంగా, ఓడినప్పుడు మరో విధంగా మాట్లాడకూడదని హితవు పలికారు. కాగా, ఫలితాలు అంచనాలకు అందనప్పుడు మాత్రమే ఈవీఎంలను ప్రశ్నించడం తప్పు అని కాంగ్రెస్‌కు ఒమర్ అబ్దుల్లా చురక వేశారు. 'అవే ఈవీఎంలతో మీరు (కాంగ్రెస్) వంద మందికి పైగా పార్లమెంటు సభ్యులను పొందారు. మీ పార్టీ విజయంగా దానిని సెలబ్రేట్ చేసుకున్నారు. కొన్ని నెలల తర్వాత ఆశించిన విధంగా ఫలితాలు రానప్పుడు ఈవీఎంలకు వ్యతిరేకంగా మాట్లాడకూడదు. ఓటింగ్ యంత్రాంగంపై నమ్మకం లేని పార్టీలు ఎన్నికల్లో పోటీ చేయకూడదు' అని అన్నారు.

మరోవైపు ఓటర్లు ఒకసారి ఎన్నుకుంటారని, మరోసారి ఎన్నుకోరని ఒమర్ అబ్దుల్లా తెలిపారు. దీనికి తానే ఉదాహరణ అని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిన తాను అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచినట్టు చెప్పారు.

వ్యవసాయ కమతాలపై కేంద్రం సర్వే

- పైలట్ ప్రాజెక్టుగా ఏపీ ఎంపిక
- రైతుల వ్యక్తిగత సమాచారం, మార్కెటింగ్ అంశాలపైనా దృష్టి



గుంటూరు :వ్యవసాయ కమతాలపై కేంద్ర ప్రభుత్వం సర్వే ప్రారంభించింది. ఈ సర్వేలో రాష్ట్రాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. దేశంలో వ్యవసాయ కమతాల తీరు, సామర్థ్యం, సేద్యంలో ఎవరు నేరుగా లబ్దిపొందుతున్నారనే విషయాలను సేకరిస్తున్నారు. కుటుంబాన్ని, సర్వే నెంబరును యూనిట్‌గా తీసుకుని సర్వే చేస్తున్నారు. సాగు చేసే వ్యక్తి, ఆయనకు వ్యవసాయం ద్వారానే ఆదాయం వస్తుందా? ఇతర వ్యాపార, ఉద్యోగ కార్యకలాపాలు ఉన్నాయా? మహిళలా? పురుషులా? పూర్తి స్థాయిలో సేద్యంపై ఆధారపడి ఉన్నారా? పార్టుటైంగా సమయం కేటాయిస్తున్నారా? కుటుంబంలో18 ఏళ్లు నిండిన వారు ఎంతమంది ఉన్నారు? భూ యజమానికి ఉన్న ప్రధాన ఆదాయం వనరు ఏమిటి? స్వయం ఉపాధి, ఉద్యోగం, లేక స్థిరమైన ఆదాయం, కార్మికుడిగా పనిచేస్తున్నారా? ఇతర మార్గాల్లో ఆదాయం వస్తోందా? అనే వివరాలు సేకరిస్తున్నారు. వ్యవసాయం, పశుపోషణ, వ్యవసాయేతర రంగాల్లో ప్రవేశం, ఆదాయం, రిటైర్డు ఉద్యోగిగా పింఛను పొందుతున్నారా? ఏ రంగంలో స్థిరపడ్డారో వివరాలు తీసుకోవాలని ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. పండించిన వ్యవసాయ ఉత్పత్తులను వ్యక్తిగతంగా వినియోగించుకుంటున్నారా? అమ్ముకుం టున్నారా? కొంత అమ్ముకుని, కొంత సొంతానికి వినియోగించుకుంటున్నారా అనే అంశంపై వివరాలు సేకరించాలని నిర్ణయించారు. వ్యవసాయ ఉత్పత్తుల విక్రయానికి ఉన్న అవకాశాలు, ప్రైవేటు వ్యాపారులు, ప్రభుత్వ సంస్థలు, మార్కెట్ యార్డులు, ప్రత్యేక కొనుగోలు కేంద్రాలు, ఉత్పత్తిదారుల అసోసియేషన్ల పాత్ర తదితర వివరాలు కూడా తీసుకుంటున్నారు. కాంట్రాక్టు వ్యవసాయానికి పెట్టుబడిదారులు, కంపెనీల వివరాలు, ఇతర వివరాలు సేకరిస్తున్నారు. భూమి సాంద్రత, సామర్థ్యం, ఏయే పంటలు పండడానికి అవకాశాలు ఉన్నాయి? నీటి వనరుల వివరాలు కూడా తీసుకుంటున్నారు. రైతుల విద్యార్హతలు, సేద్యానికి లభిస్తున్న ప్రభుత్వం తోడ్పాటు, విత్తన సరఫరా నుంచి విక్రయం వరకు ఎదురవుతున్న అంశాలపై కూడా సమాచారం తెలుసుకుంటున్నారు. సేద్యంలో మెళకువలపై అందుతున్న శిక్షణ, ప్రభుత్వ ఏజెన్సీల ప్రోత్సాహాన్ని కూడా సర్వేలో పొందుపరుస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, పెట్టుబడి సాయం, బీమా, పంట రుణాలు, కనీస మద్దతు ధర, స్వయం సహాయక సంఘాల నుంచి రైతులకు అందుతున్న సహకారం, సాంకేతిక పరిజ్ఞానం వివరాలు తీసుకుంటున్నారు. ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపుతున్నారా? సహకార సంఘాలు, బ్యాంకుల నుంచి అందుతున్న తోడ్పాటు, ఎరువులు, పురుగు మందుల వినియోగం, ఇంటిగ్రేటెడ్ పెస్టు మేనేజ్‌మెంట్, భూసారం, వాతావరణ పరిస్థితులు, సేద్యంలో ఇబ్బందులు, యాంత్రీకరణ, ప్రభుత్వ సహకారం, నీటి వసతికి వినియోగిస్తున్న పరికరాలు, పంపుసెట్లకు వినియోగిస్తున్న విద్యుత్ సరఫరాకు ఉన్న అవకాశాలు, నీటి వసతి ఉన్న భూములు, వర్షాధారంపై ఆధారపడిన భూములు తదితర వివరాలు సేకరించి గ్రామాల వారీగా వివరాలు పంపాలని కేంద్రం కోరింది. ఇప్పటికే భూ కమతాలపై రెండుసార్లు సర్వే జరిగిందని, మూడో విడత మరింత లోతుగా సమాచారం తీసుకుని విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి డేటాను సేకరిస్తున్నారని అధికారులు తెలిపారు. ఈ సర్వేను ఈ నెల 31వ తేదీలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం అన్ని జిల్లాల అధికారులనూ ఆదేశించింది. రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ సర్వేలో రెవెన్యూ శాఖతోపాటు వ్యవసాయ అనుబంధ శాఖలు కూడా భాగస్వామ్యం అవుతున్నాయి.

మేము దేశంలో భాగం కాదా?

ప్రజలకు ప్రధాని ఎందుకు సమాధానం చెప్పలేదు?

లోక్‌సభలో మణిపూర్ ఎంపీ ప్రశ్నలు



న్యూఢిల్లీ : లోక్‌సభలో రాజ్యాంగం చర్చ సందర్భంగా మణిపూర్ కాంగ్రెస్ ఎంపీ ఆల్ఫ్రెడ్ కన్నగమ్ ఆర్థర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మేము దేశంలో భాగం కాదా? అని ప్రశ్నించారు. భారత రాజ్యాంగంపై జరిగిన రెండ్రోజుల చర్చలో భాగంగా ఔటర్ మణిపూర్ ఎంపీ ఆల్ఫ్రెడ్ లోక్‌సభలో మాట్లాడారు. మణిపూర్‌లో నెలకొని ఉన్న హింసాత్మక పరిస్థితులు, నాగాలాండ్‌లో 2021లో జరిగిన ఓటింగ్ మారణకాండను పేర్కొన్న ఆయన.. రాజ్యాంగం పట్ల ప్రభుత్వ నిబద్ధతను ప్రశ్నించారు. 2021, డిసెంబర్ 4న భారత ఆర్మీ చేతిలో నాగాలాండ్‌లోని మోన్ జిల్లా ఓటింగ్ గ్రామానికి చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు.

ఆ తర్వాత జరిగిన హింసలో మరో ఎనిమిది మంది పౌరులు, ఒక సైనికుడు మృతి చెందారు. "ఓటింగ్ మారణహోమం జరిగినప్పుడు రాజ్యాంగం ఎక్కడున్నది? ప్రజల ఆందోళనలను తగ్గించటానికి బీజేపీ ఓటింగ్ నుంచి రాజ్యసభకు ఒక ఎంపీని పంపితే సరిపోతుందా? మణిపూర్‌లో 19 నెలలుగా కొనసాగుతున్న సంక్షోభాన్ని ఎవరూ గుర్తు చేయాల్సి నవసరం లేదు. మేము ఈ దేశంలో భాగం కాదా? దీనిపై ప్రధాని ఇప్పటి వరకూ మణిపూర్ ప్రజలకు ఎందుకు సమాధానం చెప్పలేదు?" అని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగంపై చర్చ సందర్భంగా ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీ రామ్) ఎంపీ చంద్రశేఖర్ "ఆజాద్" మాట్లాడారు.

భారత రాజ్యాంగాన్ని, దాని రూపకర్తలను కొనియాడారు. చాలా అణగారిన వర్గాలు ఎంతో కొంత పురోగతి సాధించాయంటే అది రాజ్యాంగం కారణంగానేనని అన్నారు. రాజ్యాంగంలో నిర్దేశించిన మత స్వేచ్ఛ దళితులు, ముస్లింలు, జైనులు, క్రైస్తవులు, బుద్ధులకు ఎక్కడున్నదని ఆయన ప్రశ్నించారు. ఛత్తీస్‌గఢ్‌లో సత్నామీ పంత్ స్మారక చిహ్నం ధ్వంసం విషయంలో అశాంతి, యూపీలోని సంభాల్‌లో హింసను ఆయన లేవనెత్తారు.

'ప్రయివేటీకరణ రిజర్వేషన్‌పై దాడి'

బంగ్లాదేశీల చొరబాట్ల విషయంలో బీజేపీ చేసిన ప్రచారంపై జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) ఎంపీ విజయ్ కుమార్ హన్స్‌డాక్ మాట్లాడారు. భారత రాజ్యాంగం, రాజ్యాంగబద్ధత మీద ప్రపంచ దృక్కోణంపై అధికార సభ్యులు చాలా చర్చించారనీ, ఈ సభ్యులే జార్ఖండ్‌కు వచ్చి బంగ్లాదేశీయుల గురించి మాట్లాడారని అన్నారు. అయితే, హరించుకుపోతున్న మా వనరుల, భూముల గురించి మాత్రం వారికి పట్టింపు లేదని చెప్పారు. ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా చంద్రశేఖర్, విజయ్ కుమార్‌లు గళం వినిపించారు. దీనిని రిజర్వేషన్‌పై 'బ్యాక్‌డోర్ దాడి'గా వారు అభివర్ణించారు.

సంభాల్‌లో దేవాలయాన్ని తెరిచిన అధికారులు

- మత ఘర్షణల నేపథ్యంలో 1978 నుండి దానికి తాళం



లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ పట్టణంలో 1978 నుండి మూసి ఉన్న భస్మ శంకర్ దేవాలయాన్ని అధికారులు తెరిచారు. షాహీ జామా మసీదు సమీపంలో ఉన్న ఈ దేవాలయాన్ని ఆక్రమణల తొలగింపు సందర్భంగా గుర్తించి దానికి వేసి ఉన్న తాళాన్ని తీశారు. దేవాలయంలో హనుమంతుడి విగ్రహం, శివలింగం ఉన్నాయి. సంభాల్ పట్టణంలో 1978లో మత ఘర్షణలు చెలరేగడంతో దేవాలయాన్ని మూసేసి తాళం వేశారు. కాగా నాటి ఘర్షణల కారణంగా హిందూ సమాజానికి చెందిన స్థానికులు నిరాశ్రయులయ్యారని స్థానికులు చెప్పారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న విద్యుత్ చౌర్యానికి వ్యతిరేకంగా సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ వందనా మిశ్రా ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు ప్రచారం నిర్వహిస్తుండగా దేవాలయానికి తాళం వేసి ఉండడాన్ని గమనించారు. 'మూతపడిన దేవాలయాన్ని గుర్తించగానే వెంటనే జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చాను. దేవాలయాన్ని తిరిగి తెరవాలని మేమంతా నిర్ణయించాం' అని చెప్పారు. దేవాలయానికి సమీపంలో ఉన్న బావిని కూడా తిరిగి వాడకంలోకి తెచ్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. 'మత ఘర్షణలు జరిగిన తర్వాత దేవాలయాన్ని మూసేశారు. మేమంతా నిరాశ్రయులమై వలస పోయాము. మా కుల గురువుకు అంకితం చేసిన దేవాలయం అప్పటి నుండీ మూతపడే ఉంది' అని నగర హిందూ మహాసభకు చెందిన విష్ణు శంకర్ రస్తోగీ తెలిపారు. షాహీ జామా మసీదును సర్వే చేయాలని కోర్టు ఆదేశించిన తర్వాత సంభాల్‌లో గత నెల 24న హింస చెలరేగి నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో మసీదు పరిసరాలలో ఆక్రమణలు, విద్యుత్ చౌర్యంపై ప్రజలకు నచ్చచెప్పేందుకు అధికారులు ప్రచారం చేపట్టారు. ఇదిలావుండగా సంభాల్‌లోని అనార్ వలీ మసీదు ఇమామ్‌కు అధికారులు రెండు లక్షల రూపాయల జరిమానా విధించారు. అధిక శబ్దంతో లౌడ్ స్పీకర్ పెట్టినందుకు ఆయన ఈ జరిమానాకు గురయ్యారు. ఆరు నెలల పాటు లౌడ్ స్పీకర్‌ను ఉపయోగించరాదని ఇమామ్‌కు సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేశారు.

పెరిగిన బొగ్గు దిగుమతులు



న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-అక్టోబర్ మధ్యకాలంలో దేశంలో బొగ్గు దిగుమతులు పెరిగాయి. గత సంవత్సరం ఇదే కాలంలో 155.87 మెట్రిక్ టన్నుల బొగ్గు దిగుమతి కాగా ఈ ఏడాది 4.2 శాతం అధికంగా అంటే 162.45 మెట్రిక్ టన్నుల దిగుమతి జరిగింది. అయితే గత సంవత్సరం అక్టోబర్‌తో పోలిస్తే ఈ ఏడాది అదే నెలలో బొగ్గు దిగుమతులు 14.4 శాతం మేర తగ్గాయి. 2023లో అక్టోబర్‌లో 25.54 మెట్రిక్ టన్నుల బొగ్గు దిగుమతి కాగా ఈ ఏడాది ఆ నెలలో 21.84 మెట్రిక్ టన్నులు జరిగింది. బొగ్గులో కోకింగ్, నాన్-కోకింగ్ అనే రకాలు ఉంటాయి. నాన్-కోకింగ్ బొగ్గును థర్మల్ బొగ్గుగా వినియోగిస్తారు. ఇందులో బూడిద అధికంగా ఉంటుంది. ఇది విద్యుదుత్పత్తికి ప్రయోజనకరంగా ఉంటుంది. సిమెంట్, ఎరువులు, గాజు, సిరామిక్, కాగితం, రసాయన, ఇటుకల తయారీ పరిశ్రమల్లో కూడా దీనిని వాడతారు. ఇక కోకింగ్ బొగ్గును మెటలర్జికల్ బొగ్గు అని పిలుస్తారు. దీనిని వేడి చేసినప్పుడు కోక్‌గా మారుతుంది. గత సంవత్సరం అక్టోబర్‌తో పోలిస్తే ఈ అక్టోబర్‌లో నాన్-కోకింగ్ బొగ్గు దిగుమతులు తగ్గాయి. అదే సమయంలో కోకింగ్ బొగ్గు దిగుమతులు పెరిగాయి. బొగ్గు దిగుమతులపై ఎక్కువగా ఆధారపడవద్దని, సాంకేతిక పరిజ్ఞానంలో అవసరమైన మార్పులు చేసుకోవాలని బొగ్గు, ఖనిజ శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ఇటీవల ఉక్కు పరిశ్రమను కోరారు. బొగ్గు దిగుమతులను దశల వారీగా తగ్గించుకోవాలని ఆయన సూచించారు. కాగా ఉక్కు పరిశ్రమ కోకింగ్ బొగ్గును ఉపయోగిస్తుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1,080 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అంటూ దీనిని సాధించగలమన్న విశ్వాసాన్ని కిషన్‌రెడ్డి వ్యక్తం చేశారు.

పెట్టుబడిదారీ వ్యవస్థకు కమ్యూనిజమే ప్రత్యామ్నాయం

ఉద్యమాల ద్వారానే రైతు చట్టాలు వెనక్కి

- పాకిస్థాన్‌ను బూచిగా చూపి ఎన్నికల్లో లబ్ధి పొందుతున్న బీజేపీ
- ఇజ్రాయిల్ దురహంకారానికి అమెరికా మద్దతు
- ఐక్య ఉద్యమాల ద్వారా రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, టి.సాగర్
- అచ్చంపేటలో నాగర్‌కర్నూల్ జిల్లా సీపీఐ(ఎం) మహాసభలు ప్రారంభం



నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

పెట్టుబడిదారీ వ్యవస్థకు కమ్యూనిజమే ప్రత్యామ్నాయమని ఇప్పటికే అనేక దేశాల్లో రుజువయిందని, ఇటీవల జరిగిన శ్రీలంక, ఫ్రాన్స్ దేశాల ఎన్నికల ఫలితాలు ఈ విషయాన్ని రుజువు చేస్తున్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, టి.సాగర్ అన్నారు. ఉద్యమాల ద్వారానే రైతు వ్యతిరేక నల్ల చట్టాలను వెనక్కి పంపగలిగామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను సైతం ఐక్య ఉద్యమాలతోనే ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా సీపీఐ(ఎం) మహాసభలు అచ్చంపేట పట్టణంలోని లోటస్ మినీ ఫంక్షన్ హాల్‌లో జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులు శరవేగంగా మారుతూ సోషలిస్టు వ్యవస్థకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం వల్ల భారతదేశంలో నూనె, పప్పులు, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని తెలిపారు. ఇజ్రాయిల్, పాలస్తీనా దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం వెనుక అమెరికా హస్తం ఉందని, ఇది ఇజ్రాయిల్ దురహంకారానికి నిదర్శనమన్నారు. పాఠశాలలు ఆస్పత్రులపై దాడులు చేయడం, బాంబులు వేయడం అత్యంత దుర్మార్గమన్నారు. అమెరికా ఉత్పత్తి చేస్తున్న ఆయుధాలను మార్కెట్‌లో అమ్ముకోవడానికి యుద్ధాలను ప్రేరేపిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం లేదన్న సమయంలో ప్రతిఘటన ఎదురు కావడం మంచి పరిణామన్నారు. ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనాతో పెట్టుబడిదారీ దేశాలు కకావికలమయితే కమ్యూనిస్టు దేశాలు ధైర్యంగా నిలబడి ప్రజల ఆరోగ్యాలను కాపాడిన చరిత్ర ఉందన్నారు. సేంద్రియ ఎరువులు వాడితే దిగుబడి రాదని శ్రీలంక లాంటి దేశాల్లో రుజువైందని, అందుకే అక్కడ ఆహార సంక్షోభం ఏర్పడిందన్నారు. భారతదేశంలో సైతం పోరాటాలు ఉధృతం అయ్యాయని అన్నారు. రైతు చట్టాలకు వ్యతిరేకంగా 13 నెలల పాటు పోరాటం చేసి కేంద్ర ప్రభుత్వం నల్లచట్టాలను వెనక్కు తీసుకునేలా మెడలు వచ్చిందని గుర్తుచేశారు. నిత్యనిర్బంధాలు ప్రజా స్వేచ్ఛను హరించలేవని అనేకసార్లు ఉద్యమాలు రుజువు చేశాయన్నారు. ఉద్యమాల వల్ల ఎలాంటి ఫలితాలు వస్తాయో అయోధ్యలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఓటమిపాలు కావడమే నిదర్శనమని తెలిపారు. మజీదులు తవ్వడం, మతహింస ప్రేరేపణ చేయడం వంటి విధ్వంసకరమైన కార్యక్రమాలు చేపట్టి ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా బీజేపీ వ్యవహరిస్తుందని అన్నారు. బీజేపీ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి సొంత ఎజెండాను అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిపూర్ లాంటి రాష్ట్రాల్లో జరుగుతున్న అల్లర్లను ఆపడం బీజేపీకి సాధ్యం కాదా అని ప్రశ్నించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగాలను ప్రయివేటుపరం చేస్తూ ఉపాధి రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఆదానీని అరెస్టు చేయడం చేతకాదు కానీ ఉద్యమాలు చేస్తున్న రైతులను జైలుకు పంపడం మాత్రం సాధ్యమయిందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఏడవ గ్యారంటీ అయిన ప్రజాస్వామ్యాన్ని అధికారంలోకి రాగానే తుంగలో తొక్కారని అన్నారు.

లగచర్లలో నిర్మించాలనుకున్న ఫార్మాను అక్కడి రైతులు వ్యతిరేకిస్తే, వారిని జైలుకు పంపిన చరిత్ర ఈ రాష్ట్ర ప్రభుత్వానికి దక్కిందన్నారు. రుణమాఫీ, రైతు భరోసా, ఖాళీల భర్తీ, ఉచిత గ్యాస్, విద్యుత్ వంటి హామీలను అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేస్తామని, ఎర్రజెండా అండతో ప్రజలు ఐక్యంగా కలిసిరావాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్రాములు, భూపాల్, ధర్మానాయక్, జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసులు, గీత, దేశ్యా నాయక్, ఆంజనేయులు, బి.ఆంజనేయులు, కిల్లె గోపాల్, శంకర్ నాయక్, నరసింహ, రామ్ చందర్, అబ్దుల్లా ఖాన్, మల్లేష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవటం తక్షణ కర్తవ్యం

- దానికి ప్రమాదం వచ్చిపడింది
- మతాధారిత రాజ్యాంగం తప్పు
- అది దేశ ఐక్యతకు విఘాతం : ఎం.ఎ.కె దత్ వర్ధంతి సభలో బీవీ రాఘవులు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


రాజ్యాంగాన్ని రక్షించుకోవటమే తక్షణ కర్తవ్యమని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) సీనియర్ నాయకుడు ఎం.ఎ.కె దత్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి చావ రవి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రాఘవులు స్మారకోపన్యాసం చేశారు. రాజ్యాంగానికి ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మతాధారిత రాజ్యాంగం తప్పని చెప్పారు. దాంతో దేశ ఐక్యతకు విఘాతమేర్పడుతుందని వివరించారు. ఎవరి మత విశ్వాసాలు వారికున్నాయనీ, ఒక మతం మరో మతాన్ని తక్కువ చేయటం తగదన్నారు. భారతీయులు విశ్వమానవులనీ, వారిని ఒక్కటిగా ఉంచగలిగేది రాజ్యాంగమేనన్నారు. ఎం.ఎ.కె దత్ విశ్వమానవుడని కొనియాడారు. లౌకికవాది, మానవతావాది, సమతావాది. కులం, మతం, ప్రాంతం, రంగులకు అతీతంగా సమానత్వం కోరుకు న్నారన్నారు. వారు విశ్వమానవులు కనుకనే ఆయన అస్తిత్వం విశ్వమానవ లక్షణంతో ఉందని గుర్తు చేశారు. మన అస్తిత్వం భారతీయతని చెప్పారు. భారతీయులందరికీ సమాన మైన హక్కులుండాలన్నారు. రాజ్యాంగంపై పార్లమెం టులో చర్చ జరుగుతున్న నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడితే, బీజేపీ రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నదని చెప్పారు. ప్రపంచంలో ఎలక్టోరల్ డిక్టేటర్ షిప్ అనే కొత్త సంస్కృతి తెరపైకి వచ్చిందనీ, అది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. ఒకే దేశం-ఒకే ఎన్నిక కూడా నియంతృ త్వానికి దారి తీస్తుందని చెప్పారు. రాజ్యాంగ లక్ష్యాలైన ప్రజా స్వామ్యం, లౌకికవాదం, సమాఖ్య వాదం, సామాజిక న్యాయం, సామ్యవాదం కాపాడటమే తక్షణ కర్తవ్యమన్నారు. మతం వ్యక్తిగతమనీ, దానిలో రాజ్యం జోక్యం ఉండకూడదన్నారు.

పెట్టు బడిదారీ సమాజంలో అసమానతలు పెరిగాయనీ, ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థపట్ల వ్యతిరేకత పెరుగుతున్నదని వివరించారు. సామ్య వాద భావనకు మద్దతు పెరుగుతుందని తెలిపారు. తొలుత దత్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్, సీఐటీయూ ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య, టీఎస్ యూటీఎఫ్ సీనియర్ నాయకులు పి మాణిక్ రెడ్డి, ఎం నరహరి, సి కమల కుమారి, రాష్ట్ర నాయకులు సింహాచలం, కొండలరావు, పౌరస్పందన వేదిక కార్యదర్శి రాధేశ్యామ్, పద్మశ్రీ , టీఎస్ యూటీఎఫ్ జిల్లాల నాయకు లు పలువురు ఉపాధ్యాయులు, దత్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జమిలీకి నో

- వద్దంటున్న జమ్మూకాశ్మీర్ నేతలు
- సమాఖ్య వ్యవస్థకు విఘాతం : మెహబూబా, తరిగామి, మసూది





న్యూఢిల్లీ : దేశంలో లోక్‌సభ, అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలను నిర్వహించే విషయంలో కేంద్రం ముందుకెళు తున్నది. దీనిపై లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టటానికి సిద్ధమైంది. మోడీ సర్కారు చర్యపై ఇప్పటికే ప్రతిపక్షాల నుంచి వ్యతిరేకత వచ్చింది. జమ్మూకాశ్మీర్‌లోని నేతలు సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. 'వన్ నేషన్, వన్ పార్టీ' జమిలీ లక్ష్యమని వారు ఆరోపిస్తున్నారు. బీజేపీ భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నదని జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ (పీడీపీ) అధినేత్రి మెహబూబా ముఫ్తీ ఆరోపించారు. "భారత్ ఒక సమాఖ్య దేశం. శ్రీనగర్‌లో సమాఖ్య నిర్మాణం ఉన్నది. 'వన్ నేషన్, వన్ ఎలక్షన్' అనేది సమాఖ్య నిర్మాణాన్ని దెబ్బతీస్తుంది. వారు(బీజేపీ) మనల్ని నియంతృత్వం వైపు తీసుకెళ్లాలని చూస్తున్నారు" అని పార్టీ కార్యక్రమంలో ఆమె అన్నారు. సీపీఐ(ఎం) నేత, జమ్మూ కాశ్మీర్ శాసనసభ సభ్యుడు ఎం.వై తరిగామి కూడా జమిలీ ఎన్నికల ప్రతిపాదనను వ్యతిరేకించారు. "ఇది భారత ఆలోచన, దాని సమాఖ్య నిర్మాణానికి విరుద్ధం. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా లేవనెత్తే అంశాలు పూర్తిగా వేరు. ఈ ప్రతిపాదన ఫెడరల్, ప్రజాస్వామ్య వ్యవస్థ బీటలు వారటానికి కారణమవుతుంది. నియంతృత్వాన్ని బలోపేతం చేస్తుంది" అని ఆయన అన్నారు. దేశంలో ఏకపార్టీ వ్యవస్థకు మార్గం సుగమం చేసే చర్యగా ఈ ప్రతిపాదన కనిపిస్తున్నదని నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు, మాజీ ఎంపీ హస్నైన్ మసూదీ తెలిపారు. "భారత్ ఒక యూనియన్ ఆఫ్ స్టేట్స్ అన్నది రాజ్యాంగం స్పష్టం చేస్తున్నది. 'వన్ నేషన్, వన్ ఎలక్షన్' ప్రతిపాదన ఫెడరల్ నిర్మాణానికి వ్యతిరేకం, రాజ్యాంగానికి విరుద్ధం" అని మసూదీ అన్నారు.

ఆయుధాలు వీడండి

- లేకపోతే కఠిన చర్యలు తప్పవు : మావోయిస్టులకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పిలుపు



న్యూఢిల్లీ : మావోయిస్టులు ఆయుధాలు వీడి, జనజీవన స్రవంతిలో కలవాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. మావోయిస్టులను కోరారు. లేకపోతే.. భద్రతా దళాలతో కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని చెప్పారు. లొంగిపోయే మావోయిస్టుల పునరావాస బాధ్యత ప్రభుత్వాని దేనన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని జగ్‌దళ్ పూర్‌లో నిర్వహించిన 'బస్తర్ ఒలంపిక్స్' ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. 2026 మార్చి నాటికి దేశాన్ని మావోయిస్టు రహితంగా మారుస్తామని తెలిపారు. "నేను మావోయిస్టులకు విజ్ఞప్తి చేస్తున్నాను, మీరు ముందుకు రండి. ఆయుధాలు వీడి, లొంగిపోయి, జనజీవన స్రవంతిలో కలవండి. మీ పునరావాస బాధ్యత మాది" అని ఆయన అన్నారు. ఒకవేళ మావోయిస్టులు ఈ విజ్ఞప్తిని వినకుంటే, వారు భద్రతా బలగాల చేతిలో అణచివేయబడతారు అని తెలిపారు. 2026, మార్చి 31 నాటికి భారత్‌ను మావోయిస్టు రహితంగా మార్చాలన్న ప్రధాని మోడీ సంకల్పాన్ని నెరవేర్చేలా ఛత్తీస్‌గఢ్ పోలీసులు నిబద్ధతతో ఉన్నారని తెలిపారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ పునరావాస విధానం దేశంలోనే అత్యుత్తమమని అన్నారు. "మీరు(మావోయిస్టులు) లొంగిపోయి, ప్రధానస్రవంతిలో కలిస్తే, మీరు ఛత్తీస్‌గఢ్, భారత అభివృద్ధిలో భాగస్వాములవుతారు" అని తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ అధికారంలోకి రావటానికి ముందున్న కాంగ్రెస్ పాలనలో మావోయిస్టులకు వ్యతిరేకంగా చర్యలు నెమ్మదించాయని కేంద్ర మంత్రి ఆరోపించారు. అయితే, రాష్ట్రంలో తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత చర్యలు వేగవంతమయ్యాయనీ, ఏడాదిలో 287 మంది మావోయిస్టులు హతమ య్యారని తెలిపారు. 992 మంది మావోయిస్టులు అరెస్ట్ కాగా.. 836 మంది లొంగిపోయారని చెప్పారు. బస్తర్ (ఛత్తీస్‌గఢ్)లో నక్సలిజం అంతమైతే, ఇక్కడున్న ప్రకృతి అందం కారణంగా ఛత్తీస్‌గఢ్.. కాశ్మీర్ కంటే ఎక్కువ మంది పర్యాటకులను ఆకర్షిస్తుందని తెలిపారు.

లేఖ కేసీఆర్‌కు కాదు... రేవంత్‌కు రాయండి

బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర పరిస్థితితులపై లేఖ రాయాల్సి వస్తే కేసీఆర్‌కు కాకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాయాలని పీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద సూచించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో పని చేసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సీఎం పని తీరు బాగా లేకుంటే బహిరంగంగా చెప్పేవారని గుర్తు చేశారు. ప్రస్తుత అధ్యక్షులు మాత్రం సీఎంకు పప్పెట్‌లా మారారని ఎద్దేవా చేశారు. పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చింది కేసీఆర్ అని మహేష్ తెలుసుకోవాలని సూచించారు. ఆర్థిక రంగంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్న వారు ఆర్‌బీఐ హ్యాండ్ బుక్‌ను చదువుకోవాలని హితవు పలికారు. రుణమాఫీ ఇంకా పూర్తి కాలేదని పేర్కొన్నారు. కొన్ని బ్యాంకుల్లో ఒక్కరికి కూడా మాఫీ కాని సంఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా అనేకం ఉన్నాయని తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక రాజకీయాలను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు.

సినీ నటులు అల్లు అర్జున్ అరెస్ట్ అందులో బాగమేనని అన్నారు. ఉద్యమంలోంచి పుట్టిన తెలంగాణ తల్లిని కాదని రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ తల్లిని తీసుకొచ్చారని విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల బాధితులకు రూ.33.27 కోట్లు వాపస్

- మెగా లోక్ అదాలత్ ద్వారా పరిష్కారం : సీఎస్‌బీ డీజీపీ షికా గోయెల్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి



సైబర్ నేరస్థుల నుంచి స్వాధీనపర్చుకున్న రూ.33.27 కోట్లను బాధితులకు వాపస్ చేయటం జరిగిందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) డీజీపీ షికా గోయెల్ ఆదివారం తెలిపారు. ఈ మొత్తం కూడా ఈనెలలో సైబర్ నేరస్థుల మోసాలకు లోనైన బాధితులకు సంబంధించినవని ఆమె చెప్పారు.

గత నెలలో రూ.27 కోట్లను సైబర్ నేరాలకు గురైన బాధితులను గుర్తించి అప్పగించటం జరిగిందన్నారు. కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు సైబర్ నేరగాళ్ల మోసాలకు గురైన దాదాపు 17 వేల మందికి పైగా బాధితులకు నేరస్థుల నుంచి స్వాధీనపర్చుకున్న రూ.155 కోట్లను వాపస్ చేయటం జరిగిందని ఆమె తెలిపారు. ఇక ఈనెల 14న జరిగిన మెగా లోక్ అదాలత్ ద్వారా లక్షా యాభైవేల కేసులలో పరస్పర పరిష్కారాన్ని వారి అంగీకారం ద్వారా చూపెట్టటం జరిగిందనీ, ఇందులో విభిన్న కేసులున్నాయని చెప్పారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుండిగల్ యాదగిరి హెచ్చరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సమ్మె శిబిరంలో పాల్గొని ప్రసంగించారు. ఉద్యోగులను రెగ్యులర్ చెయ్యాలనీ, తక్షణమే పే స్కెల్ అమలు చెయ్యాలనీ, రీ ఎంగేజ్ విధానం తొలగించి ఉద్యోగ భద్రత కల్పించాలనీ, ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజ్ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కారం చేస్తామని అసెంబ్లీలో ప్రకటన చేయ్యాలని కోరారు. కాగా వీరి సమ్మె ఆదివారానికి 6వ రోజుకు చేరింది.

వేములవాడ ఆలయంలో రూ.2కోట్ల పక్కదారి

- బీఆర్ఎస్ నేత రాకేష్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో రూ.2కోట్ల నిధులు పక్కదారి పట్టాయని బీఆర్ఎస్ నేత రాకేష్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అనుచరులు కోడేల కేటాయింపు నుంచి మొదలుకుని అన్నింటా తల దూర్చుతున్నారని విమర్శించారు. ఫలితంగా ఆలయ పవిత్రత దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రి అనుచరులు ఇప్పటి వరకు ఆలయానికి చెందిన 60కి పైగా కోడెలను కబేళాలకు తరలించారని ఆరోపించారు. వేములవాడలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

నవతెలంగాణ దర్వాజ

సోమవారం 16-12-2024 || హైదరాబాద్

వేగు చుక్క

పిలుపందిందో లేదో
అప్పటి యవ్వనాన్ని
హడావిడిగా పులుముకున్నాం
హృదయంలోనే కాదు
తల మీద నెరసిన జుట్టుకు కూడా!

సడలిన కీళ్ళకు ఉత్సాహపు మలాముసు రుద్ది
వడి వడిగా ప్రాంగణాన్ని చేరుకున్నాం
జ్ఞాపకాల దొంతరలను చీల్చి
ఆనవాళ్ళు పోల్చుకున్నాం
ఆలింగనాలూ, రెడ్ శాల్యూట్ లు
కరచాలనాలు, కవ్వింతల కబుర్లూ
ఒకటా రెండా... ఎన్నెన్ని ప్రవాహాలో...

మున్నేట్లో మునకలేసినట్లు
తల్లి గోదాట్లో ఈదులాడినట్లు

అప్పటి గాయాల మచ్చల్ని తడిమే వారొకరు
గేయాల నాదాల్ని శృతి చేసే వారింకొకరు
రోడ్డుపై నినాదమై మోగిన కంఠాల్ని
జైలు ఊచల వెనుక చెలరేగిన
ఉద్విఘ్న భావాల్ని
ఎన్ని మందారాల్ని పరచారని
ఎన్నెన్ని తూర్పు రేకల్ని విప్పి చూపారని

అప్పట్లో పోస్టరై గోడ మీద వెలిగిన వాడొకడు
ఇప్పుడు కవిత్వపు కుప్పై తారసపడ్డాడు
జాజి రంగై గోడపై మెరిసినవాడు
ఆర్టిస్ట్‌గా లోకానికి రంగులద్దుతున్నాడు
కరపత్రాల కత్తులు దూసిన వాళ్ళు
అక్షరాల మాంత్రికులై
పత్రికలను శాసిస్తున్నారు
కంజర పట్టుకు పాటకు దరువేసిన వాడు
వాగ్గేయకారుడై జనం ఘోషను
గేయంగా ఆలపిస్తున్నాడు
అప్పటి కూనిరాగాల కోకిలమ్మ
సినీ రాగాల కల్పవల్లిగా
హృదయాల్ని మీటుతోంది

అప్పటి మరకతాలన్నీ
ఎన్ని మాణిక్యాలుగా మెరిశాయో
జీవితమంతా జనం గొంతుకలుగా
నిలిచిన వాళ్లు
అరుణ పతాకలై పోరుబాటలో నడచిన వాళ్లు
బతుకు పయనంలో సాగుతూనే
ఆశయాల జెండా నొదలని వాళ్ళు
ఇప్పటికీ జ్ఞాన ప్రవాహాలే
రగులుతున్న నిప్పు కణికలే


ఎన్ని సంగమాల కూడలి ఇదని
ఎన్ని ప్రతినల, మరెన్ని పిడికిళ్ళ
మండే గుండెల, రగిలే మెదళ్ళ
జ్వాజలా మానపు నెగడు ఇదని

అంటే
అధ్యయనాన్ని, పోరాటాన్ని కలగలిపి
నడిపించిన తారక కదా!
బతుకు మార్గం చూపిన వేగు చుక్క సదా!

(ఉమ్మడి ఖమ్మం జిల్లా పూర్వ విద్యార్థుల సమ్మేళనం పంచిన జ్ఞాపకాలమాల)

- వి.ఆర్. తూములూరి

స్త్రీ అంతరంగ తరంగాలు ఈ కథలు




డాక్టర్ కొత్వాలు అమరేంద్ర
9177732414

మూడు దశాబ్దాలుగా రచనారంగంలో అనుభవం గడించిన శైలజామిత్ర దాదాపు అన్ని సాహిత్య ప్రక్రియలూ చేపట్టి కథారచనలోనూ తన సత్తా చాటుకుంటున్నారు. కవయిత్రిగా 8 కవితా సంపుటాలను వెలువరించిన ఈ రచయిత్రి గతంలో తరంగాలు, అడ్డా, ఆధునిక పంచ్ తంత్ర కథలు (బాలలకు ఉద్దేశించినవి) అనే కథా సంపుటాలను వెలువరించారు. తన అనుభవాల నేపథ్యంలో మన చుట్టూ కనిపించేవారినే పాత్రలుగా మలచి వాస్తవిక జీవన చిత్రణకు ప్రాధాన్యతనిచ్చే ఈ రచయిత్రి ఈ సంపుటిలోని ఎక్కువ భాగం కథల్లో స్త్రీ జీవితంలోని వివిధ పార్శ్వాలను స్పృశించారు. ముఖ్యంగా ఆ పాత్రల మనస్తత్వవిశ్లేషణతో సాగే కథనపద్ధతి ద్వారా ఆ పాత్రల అతరంగతరంగాలను ఆవిష్కరించి వాటిని పాఠకులకు దగ్గరచేసే టెక్నిక్ కనిపిస్తుంది. ఇందులోని 25 కథల్లోనూ విభిన్న మానసిక, సామాజిక సంఘర్షణలు కనిపిస్తాయి. మనుషుల చిత్రవిచిత్ర ప్రవృత్తులు జీవితాల మీద ఎంత ప్రభావాన్ని చూపుతాయో ఈ కథలు తెలియజేస్తాయి. ఆత్మీయతల్ని కాలరాసే దూరపుకొండల నునుపులూ వీటిలో కనిపిస్తాయి. కథల శీర్షికలు కూడా ఆకట్టుకుంటాయి. విదేశీప్రయాణాలు పెద్దవాళ్లకు తాము ఆశించే ఆత్మీయతల్ని దూరం చేసి వారిని ఎంత ఒంటరితనానికి గురిచేస్తాయో స్నేహితురాలి మాటల్లో తెలుసుకొని అప్రమత్తమయ్యే ఒక తల్లి, తమ పెంపకం కోసం రాత్రింబవళ్లు శ్రమించే తల్లిదండ్రులకు అవసానదశలో వారికి అండగా వుండడానికి వెనుకంజ వేసే ఒక కొడుకు, తన అత్తగారు తనను మాటలతో వేధిస్తుందన్న అనుమానంతో తనకు భాష రాదని ఆమెతో అబద్ధం చెప్పి ఆ తరువాత ఆమె అంతరంగం తెలుసుకొని అబద్ధం చెప్పినందుకు పశ్చాత్తాపపడే ఒక కోడలు, తాను పెనుతుఫానులో చిక్కుకొని ఆస్పత్రిలో ట్రీట్మెంట్ తీసుకోవడంలో ఎన్నో ఇబ్బందులు పడినట్టు కలగని, తాను కోడల్ని బాధించడం వల్లే ఆ కల వచ్చిందన్న ఆత్మన్యూనతాభావానికి లోనై కోడల్ని ప్రేమగా చూసుకునే ఒక అత్త, సైనికుల్లో ఉత్సాహాన్నీ, ఆత్మస్థైర్యాన్నీ పెంపొందించడానికి వారికి లేఖల రూపంలో మెయిల్స్ పంపే డైరెక్టర్ జనరల్, తన భార్య చిన్నతనంలో ఆమె ప్రమేయం లేకుండా జరిగిన సంఘటనను తీవ్రంగా భావించి ఆమెపై అయిష్టాన్ని పెంచుకునే ఒక భర్త,... వీళ్లంతా ఈ కథల్లో పాత్రలు. కేవలం ఫ్యాషన్ కోసం, కాలక్షేపం కోసం తన క్లాస్ మేట్ అయిన అమ్మాయి వెంట పడే అబ్బాయి అవకాశవాదప్రేమ, నకిలీగొలుసు చోరీకి గురైతే రికవరీలో తనకు అసలు గొలుసు వస్తుందని పోలీసులకు ఫిర్యాదు చేసే గృహిణి దురాశ, రాత్రిపూట ఒక ఆటోడ్రైవర్ బారినుంచి తప్పించునే ఒంటరి యువతి సమయస్ఫూర్తి, భార్య చనిపోతే ఆసరా కోసం అమెరికాలోని తన కొడుకు దగ్గరికెళ్లినా అక్కడి వాతావరణం అనుకూలించక గుండెపోటుతో మరణించే భర్త ఒంటరితనం... ఇవన్నీ ఈ కథలకు వస్తువులయ్యాయి.

మనుషుల్ని మానసిక సంఘర్షణకు గురిచేస్తూ మనకు నిత్యజీవితంలో కనిపించే విచిత్ర మనస్తత్వాలున్న పాత్రలు కూడా ఈ కథల్లో చోటుచేసుకున్నాయి. 'ముఖంలేని చెట్టు' కథ. 'ఆడపిల్లా!' కథలల్లో ఆడపిల్లల బాధలూ, మనస్తత్వాలు, సంబంధాలూ ప్రతిబింబించాయి.

జీవితం కల్పించే అనిశ్చితిలో, ఒంటరితనంలో మహిళ పడే వేదనను ఆవిష్కరించిన 'వష్టి' కథ ఒంటరి మహిళలకు సందేశాన్నిస్తుంది. ఈ కథలో ప్రధాన పాత్ర పేరే వష్టి. తన తల్లిదండ్రులు తనకు పర్షియన్ మహారాణి పేరు పెట్టినా భర్తకు దూరమై సమస్యలజడితో తన వేదనామయ జీవితంలో చెలరేగే అలజడిని తట్టుకోలేక వష్టి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నిస్తే పక్కింటి యువతి అనారోగ్యానికి గురైందన్న వార్త ఆ ప్రయత్నాన్ని ఆపుతుంది. ఆ తరువాత భర్తకు దూరమైన ఆ యువతికి వష్టి స్నేహితురాలై వారి స్నేహం పర్యవసానంగా ఒంటరి తనంలోనూ సింహంలా బతకాలని నిర్ణయించుకుంటుంది. ఈ కథకు వష్టి అని పేరు పెట్టడమే ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. వష్టి అంటే అనిశ్చిత అనే అర్థం ప్రకారం సమాజంలో అనేక సమస్యలను ఎదుర్కొనే ఒంటరి మహిళ అనిశ్చిత స్థితిని సూచించడమే ఈ శీర్షిక ఉద్దేశంగా కనిపిస్తుంది. అదే సమయంలో మరో అర్థం మేరకు కొన్నేళ్లపాటు ఎన్నో సమస్యలనెదుర్కొంటూ పరిపాలించిన పర్షియన్ మహారాణి వష్టిలా ఒంటరి మహిళ పరిస్థితుల్ని ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు దూసుకుపోవాలన్నది రచయిత్రి ఆకాంక్షగా భావించవచ్చు.



తనను ప్రేమించి పెళ్లిచేసుకున్న భర్త వున్నట్టుండి ఆత్మహత్య చేసుకున్నా తన గుండెలోని ఒక అంచులో అతని పట్ల ప్రేమను పెంచుకునే యువతి ఆ తరువాత అతడు తన స్నేహితురాలి విషయంలో తప్పటడుగు వేసిన కారణంగానే ఆత్మహత్య చేసుకున్నాడని తన కొడుకు ద్వారా తెలుసుకొని తన గుండెలోని ఇంకో అంచులో ఆశ్చర్యపోవడం 'రెండంచుల గుండె' కథలో చూస్తాం. ప్రపంచీకరణతో మారుతున్న కాలం రెండు తరాల మధ్య అనుబంధాల్ని, ఆత్మీయతల్ని ఎలా విచ్ఛిన్నం చేస్తుందో విడమరచి చెప్పిన కథ 'కుదిరితే కప్పు కాఫీ'. ఇద్దరు కొడుకులు తమ తల్లిదండ్రుల పోషణను కూడా విభజించుకొని ఒకరు తల్లిని, మరొకరు తండ్రిని పోషించడానికి పూనుకుంటే ఆ తరువాత విచ్ఛిన్నమైన అనుబంధం వారి కళ్లు తెరిపించి మళ్లీ ఆ తల్లిదండ్రుల్ని ఒకే చోట వుండనివ్వడం ఆ కథలో కనిపిస్తుంది. అనుకోని అదృష్టం, ఐశ్వర్యం మనిషిని ఎలా ఆవహిస్తుందో తెలిపే కథ 'శివోహం'. శివాలయం ముందు భిక్షమెత్తుకునే ఒక వ్యక్తి ఆ ఆలయ జీర్ణోద్ధారణ అనంతరం అక్కడే స్వామిగా అవతారమెత్తి, ఆ తరువాత మరణించినా విగ్రహమై ప్రజల పూజలందుకోవడం ఈ కథలో చూస్తాం. స్వాతంత్ర దినోత్సవం నాడు హక్కుల విషయమై పిల్లలు తనను వేసిన ప్రశ్నలతో కనువిప్పుకు గురైన టీచర్ భర్తతో గొడవపడి పుట్టింటికి వచ్చిన తన కుమార్తెను హక్కులు సాధించుకోమంటూ తిరిగి మెట్టినింటికి పంపడం 'కొండగాలి' కథలో కనిపిస్తుంది.

'అగ్ని పేదల గుడిసెల్ని చుట్టుకుంటుంది. అహం పెద్దల మనసుల్ని మండిస్తుంది. ఈ రెంటికీ పెద్ద తేడా లేదు'(ముఖంలేని చెట్టు), 'దట్టమైన మేఘాలు కమ్ముకుని ఆకాశంపై అక్కడక్కడా తెల్లమచ్చల్లా ఆకాశపు తునకలు కనిపిస్తున్నాయి. ఆకాశపు పరిస్థితి గమనించి భూదేవి తనపై పడే కుంభవృష్టిని తట్టుకునేందుకు సిద్ధమవుతోంది'(కొండగాలి) వంటి వర్ణనలు ఈ కథల్ని పరిపుష్టం చేశాయి. ఈ కథల్లో సాగే రచయిత్రి కథాసంవిధానం, పాత్రల చిత్రణ, శైలి ఈ కథల్ని మన మనసులకు హత్తుకునేలా చేస్తాయి.

మన చుట్టూ కనిపించేవారినే పాత్రలుగా మలచి వాస్తవిక జీవన చిత్రణకు ప్రాధాన్యతనిచ్చే ఈ రచయిత్రి ఈ సంపుటిలోని ఎక్కువ భాగం కథల్లో స్త్రీ జీవితంలోని వివిధ పార్శ్వాలను స్పృశించారు. ముఖ్యంగా ఆ పాత్రల మనస్తత్వవిశ్లేషణతో సాగే కథనపద్ధతి ద్వారా ఆ పాత్రల అతరంగతరంగాలను ఆవిష్కరించి వాటిని పాఠకులకు దగ్గరచేసే టెక్నిక్ కనిపిస్తుంది. ఇందులోని 25 కథల్లోనూ విభిన్న మానసిక, సామాజిక సంఘర్షణలు కనిపిస్తాయి. మనుషుల చిత్రవిచిత్ర ప్రవృత్తులు జీవితాల మీద ఎంత ప్రభావాన్ని చూపుతాయో ఈ కథలు తెలియజేస్తాయి. ఆత్మీయతల్ని కాలరాసే దూరపుకొండల నునుపులూ వీటిలో కనిపిస్తాయి.

సాహితీ వార్తలు

17న 'తెలంగాణ తొలితరం కథకులు - కథన రీతులు' ఆవిష్కరణ

ఈ నెల 17న కె.పి. అశోక్‌కుమార్ రచించిన తెలంగాణ తొలితరం కథకులు - కథన రీతులు పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు. మంగళవారం సాయంత్రం 5:30 గంటలకు రవీంద్రభారతి మినీ హాల్‌లో కె.ఆనందాచారి అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా, పుస్తక ఆవిష్కర్తగా నందిని సిధారెడ్డి రానున్నారు. విశిష్ట అతిథిగా మామిడి హరికృష్ణ, వక్తలుగా ఎస్.వేణుగోపాల్, ఎస్. రఘు, ఎ.కె. ప్రభాకర్ తదితరులు హాజరు కానున్నారు.

21న 'కరచాలనం'

కేంద్ర సాహిత్య అకాడెమి అనువాద పురస్కార గ్రహీత, కవి, సినీ విమర్శకులు వారాల ఆనంద్ రచించిన కవులూ కళాకారులతో 'కరచాలనం' పుస్తకాన్ని పోయెట్రీ ఫోరం ఆధ్వర్యంలో డిసెంబర్ 21 శనివారం ఆవిష్కరించనున్నారు. కరీంనగర్ ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాల ఆవరణలో నిర్వహించే ఈ కార్యక్రమంలో విద్యావేత్త పూర్వ ప్రిన్సిపాల్ బి. రాంచందర్ రావు పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. ఈ కార్యక్రమానికి పలువురు మాజీ ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, వైద్యులు, సాహితీవేత్తలు ఆత్మీయులు హాజరవుతారు.

21న 'మాట్లాడటానికో మనిషి కావాలి'

శీలా వీర్రాజు చేతి వ్రాతతో రూపొందిన 'తెలుగు ఫాంట్' ను ఈ నెల 21న శనివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో సాయంత్రం 6:00 గం॥లకు శీలావీ సాహిత్య చిత్ర కళా వేదిక అధ్వర్యంలో ప్రారంభించడంతో పాటు, శీలా సుభద్రాదేవి కవితా సంపుటి 'మాట్లాడటానికో మనిషి కావాలి' ఆవిష్కరణను నిర్వహించనున్నారు. సభలో నందిని సిధారెడ్డి, సుధామ, డా.అమృతలత, పుప్పాల శ్రీరామ్, శీలా సుభద్రాదేవి పాల్గొననున్నారు.

26న 'శ్రీ శూద్రగంగ' ఆవిష్కరణ

డా॥ సుద్దాల అశోక్‌తేజ రచించిన 'శ్రీ శూద్రగంగ' ఆవిష్కరణ కార్యక్రమం ఈ నెల 26న గురువారం సాయంత్రం 6 గంటలకు ఎన్‌టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. యోగ వేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ప్రొఫెసర్ వినోదిని మాదాసు అధ్యక్షతన ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క వచ్చి పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు. ఆత్మీయ అతిథులుగా అంతర్జాతీయ చిత్రకారులు ఏలే లక్ష్మణ్, ప్రముఖ చిత్రకారులు బంగారు బ్రహ్మం, వక్తలుగా ప్రొఫెసర్ కాశీం, కవి అందెశ్రీ, ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే, ప్రముఖ కవి బెల్లి యాదయ్య రానున్నారు. ప్రముఖ కవి కోయి కోటేశ్వరరావు పుస్తక సమీక్ష చేయనున్నారు.

గుండె కొట్టుకుంటుందంటే ప్రశ్నలు బతికున్నట్టే

గుండె కొట్టుకుంటుందంటే
ప్రశ్నలు బతికున్నట్టే !

ఎటువంటి స్వప్నాల్లో కూడా,
ఎవడో సంకెళ్ళు పట్టుకొని
వెనక వస్తుంటాడు

నేను ఎవరి ఆస్తులు అడగలేదు
నవ్వడానికి స్వేచ్ఛ అడిగాను
దానికి ఎన్ని నేరాలు మోపుతున్నారు

కరువులో కడుపు నిండదు కానీ,
ఆయుష్షు పెరిగినట్టు
ఆశ్చర్యమేస్తుంది

ఆశయాలు సతాయిస్తుంటాయి
నమ్మకాలు హింసిస్తుంటాయి
నిప్పంటించి కాల్చేయక పోతే
ఈ దారిలో చెత్త పెరిగి,
కుప్పలవుతుంది

కోపమంటే అరవడం కాదు
కళ్ళు పెద్దగ జేసి
పళ్ల కొరకడం కాదు
నీడనివ్వని గోడలను
ధ్వంసం చేయడం
సాగనివ్వని మెట్లను
సమూలంగా కూల్చడం
ఆగమైన మనిషిని ప్రేమించడం

మీరు నిరాయుధులనుకుంటున్నారు

భ్రమలు, భయాలు, బలహీనతలు
మనిషిని అద్దంలో
కళ్ళను చూసుకోనివ్వవు

ఒకసారి లేచి నిలబడండి
ఆకాశం మీ తలకు తగులుతుంది

- ఆశారాజు,
9392302245

నిశ్శబ్ద విప్లవం 'రాత్రి సింఫని' కవిత్వం



బోల యాదయ్య
9912206427

డా. బాణాల శ్రీనివాసరావు సామాన్య విశ్వకర్మ కుటుంబంలో జన్మించి అమెరికన్ బీట్ కవులు, తెలుగులో దిగంబర కవులను ఆదర్శంగా తీసుకొని సాహిత్యం వైపు అడుగులు వేశాడు. ముఖ్యంగా అలెన్ గిన్స్ బర్గ్ ప్రేరణతో అస్తిత్వవాద సాహిత్య సృజన చేశాడు.

వర్యాయంవదం, ఆచూకీ, రాత్రి సింఫని కుంపటి (దీర్ఘకవిత్వం) రచనలు వెలువ రించాడు. వేటికవే ప్రత్యేకమైనవి. కుంపటి దీర్ఘ కవిత్వం తన కుటుంబ వృత్తిని నేపథ్యంగా తీసుకొని రాసిన టంవంటి అస్తిత్వవాద దీర్ఘ కవిత.

రాత్రి సింఫని కవితాసంపుటిలో ఏ కవితను తడిమిన, ఏ పాదాన్ని ముట్టుకున్న ఏదో ఒక ఆచరణాత్మకమైన సందేశాన్ని ఇస్తుంది. "వ్యూహ గామి" కవితలో

భూమిని చీల్చే నాగలి కర్రునడుగు
చెమట చుక్కలతో సేద్యం చేస్తున్న
రైతు విషాద జీవితాన్ని
ఎన్ని కథలుగా చెబుతుందో.. (పేజీ-19)

ఏ మనిషైనా జన్మనిచ్చిన తల్లిని, బువ్వ బెట్టే అన్నదాతను యాది జేసుకోకుండా కవి కాలేడు. లోకానికి బువ్వ బెట్టె అన్నదాత దుస్థితిని నాలుగు పాదాల్లో చెప్పాడు కవి. రైతుకు నష్టం వొచ్చినా, కరువు వొచ్చినా వరదొచ్చిన అరక దున్నడం మాత్రం రైతు ఆపడు. అట్లాంటి రైతు యొక్క విషాద జీవితాన్ని మనముందు ఉంచాడు కవి.

రాలి పడుతున్న పూలతో పాటు
జారిపడుతున్న పరిమళాల
గాయాల్ని చూడాలి
ఆ గాయాలకు
కనీసం
చూపుల లేపనం రాయాలి (పేజీ -20)

కవికెంత సున్నిత హృదయం ఉందో ఈ వాక్యాలను చూస్తే అర్థమవుతుంది.

ఆ గది గూటిలో అలసిపోయి
హాయిగా నిదురిస్తున్న రెండు
చిన్ని పక్షులు
పక్కనే సముద్ర హెూరును
తలపించే
నిరంతర సింఫని సంగీతం
దూరంగా ఎక్కడో ఓ
అగంతకుడి
ప్రవేశాన్ని పసిగట్టి
నిదురించే కాలనీని
నిద్ర లేపుతున్న వీధి కుక్కలు

కవిత నెత్తుకునేటప్పుడు అస్పష్ట రూపమేదో మనముందు మాట్లాడినట్లుం టది. కానీ ఒక్కొక్క పాదం దిగివస్తుంటే అక్కడ దుఃఖమో, ధిక్కారమో, ప్రశ్ననో మన మనసుకు దుసరి తీగలా చుట్టుకుంటుంది. దృశ్యం మన కండ్లముందు నిలబడి మాట్లాడుతుంది.

ఒక నవల చదివిన, నాటకం చదివిన, కవిత్వం చదివిన, మనలోకి దాన్ని సారాన్నంత ఒంపుకోవాలి. వేల ఆలోచనలు వికసించాలి. లుప్తమైపోవాలి లిప్త కాలం కవిత్వం చదివిన తర్వాత అంటాడు డా.బాణాల శ్రీనివాసరావు. "కవిత్వశంఖం" కవితలో ఇలా అంటాడు

చరిత్రకెక్కని /మహా శిల్పాలకు ప్రాణమై
ఒక అజ్ఞానందకార నదిపై/మొలవాలి
ఒంటరి వెలుగు వంతెనవై...

నిన్ను కదిలించే/కవిత్వ పాదాల్ని
కనుపాపల కద్దుకొని /నాటుకోవాలి
మనో మైదానంలో (పేజీ -29)

హృదయానికి హత్తుకునే కవిత్వం ప్రపంచంలో ఏ మూలన ఉన్న కళ్ళకు అద్దుకొని మదిలో దాసుకోవాలంటాడు. కవితా పాదం ఒకటి చాలు కదా కన్నీటిని కురిపించడానికి, కవితా వాక్యం ఒక్కటి చాలు కదా...

తన కూతురు గురించి రాసిన కవిత "పొద్దుపొడుపు" చాలా అద్భుతంగా మలిచిన తీరు మనకు కనిపిస్తది. ఎవరు ఆ కవితను చదివినా తన కూతురును ఆ కవితలో చూసుకునేలా ఉంది.

కంటి రెప్పల్ని తెరిచి మరీ చూస్తున్న
నా చిట్టితల్లి బోసి నవ్వుల్తో
ఆవిష్కరించే సూర్యాస్తమయాల
రంగుల ప్రపంచాన్ని...
తన చిన్ని కళ్ళతో
కవిత్వీకరిస్తున్న మహాకావ్యాల్ని
మనసుతోనే చదువుకుంటున్న
(పేజీ -56)

తన కూతురి మీద ఉన్న ప్రేమను వ్యక్తీక రించిన తీరు, కవిత్వీకరించిన విధానం, అభివ్యక్తి, మనసు లోతులోకెళ్లి వచ్చిన పదాల పొందిక రెండు చేతులు చాచి కన్న కూతురును ఎత్తుకున్నట్లు ఉంటది.

మా చేతుల పెద్దబాడిశతో /అరుగాలం
అరకల్ని చెక్కి చెక్కి
ఆకలిగొన్న దేశానికి /అన్నం పెట్టినా
అర్ధాకలితో అలమటించే/ చెదలు తిన్న
చెక్క పేళ్ళం

మా పెయ్యి మగ్గాలతో /బట్టల్ని నేసినేసి
నవ నాగరిక లోకం /నగ్నత్వాని
కప్పేసినా
అతుకుల బతుకుకు /మాసికేసుకోలేని
నేతగాళ్ళం (పేజీ - 70, 71)

ఇట్లా చాకలి,మంగలి, కుమ్మరి, గొల్లవారి దీనత్వాన్ని ఈ కవితలో యదార్ధ దృశ్యాలను చూపించాడు. ఎన్ని సంపుటాలు రాసింది కాదు ముఖ్యం. సంజీవని లాంటి ఒక్క కవితా పాదం చాలు చరిత్రపుటలో పేరు శిలాక్షరమయ్యేందుకు అంటాడు డా.బాణాల.

కవిత నెత్తుకునేటప్పుడు అస్పష్ట రూపమేదో మనముందు మాట్లాడి నట్లుంటది. కానీ ఒక్కొక్క పాదం దిగి వస్తుంటే అక్కడ దుఃఖమో, ధిక్కారమో, ప్రశ్నో మన మనసుకు దుసరి తీగలా చుట్టుకుంటుంది. దృశ్యం మన కండ్లముందు నిలబడి మాట్లాడుతుంది. ఒక నవల చదివిన, నాటకం చదివిన, కవిత్వం చదివిన, మనలోకి దాన్ని సారాన్నంత ఒంపుకోవాలి. వేల ఆలోచనలు వికసించాలి. లుప్తమైపోవాలి లిప్త కాలం కవిత్వం చదివిన తర్వాత అంటాడు డా.బాణాల శ్రీనివాసరావు.



"రాత్రిసింఫని" కవితా సంపుటిలో ఆత్మీయ అనుబంధాలను తడిమిండు. ఆత్మాశయ కవిత్వంతో పాటు తెలంగాణ ఆవశ్యకతను తెలిపిన కవితలు కూడా ఇందులో ఉన్నాయి. అట్లాగే ప్రపంచమంత వణికించిన కరోనా ప్రళయాన్ని, దాన్ని చేధించడానికి భరోసా కల్పించిన కవితలు కూడా ఇందులో ఉన్నాయి. ప్రపంచ నలుమూలల ఎక్కడ విధ్వంసం జరిగినా బాణాల కవితా పంక్తులు బాణాలై దూసుకొచ్చినయి. కవి చీకటిని, నిశ్శబ్దాన్ని అమితంగా ప్రేమిస్తాడు. చుట్టు జరుగుతున్న అమానవీయ దృశ్యాలను తన మనసుతో సంఘర్షించి, అక్షరాలతో నిశ్శబ్ద విప్లవానికి అంకురార్పణ చేస్తడు. ఇందులో పొందుపరిచిన సలభై కవితలు వేటికవే ప్రత్యేకమైనవి.


సాహిత్యకళాలోకం చదవాల్సిన పుస్తకాలివి. విలువైన జీవితాలను, అరుదైన సమాచారాన్ని, చరిత్రను, కళలను ప్రజల పక్షాన ఆలోచనచేసి రచించిన పుస్తకాలివి. ఎంతో ఆర్ధంగా, ఆకర్షణీయ శైలిలో రచించినవి. మంచి అనుభూతిని కలిగించేవి. ఆలోచనలలో చైతన్యాన్ని నింపే పుస్తకాలు ఇటీవల నవతెలంగాణ ప్రచురించిన సాహిత్య సంపద.

ప్రజాకవి సుద్దాల హనుమంతు




ఇది 312 పుటల సుద్దాల హనుమంతు సమగ్ర సాహిత్య సంపుటం. "సుద్దాల పాటలు, గేయాలు పుస్తక రూపంలో రాకముందే, ఆయన కవిగా ప్రజలలో ప్రాచుర్యం పొందారు. ప్రజాకవిగా గుర్తించబడ్డారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆయన నిబద్ధతతో తన పాత్ర నిర్వహించారు. పెన్ను, గన్ను ఏకకాలంలో పట్టుకున్న పోరాట కవి సుద్దాల. ఇబ్బందులు, ఇక్కట్లు అనుభవించి పలవరించారు. ఆయన జీవితం, సాహిత్యమంతా ఇందులో ఉంది" - సురవరం సుధాకరరెడ్డి

కంచెలపై దేహాలు



రాయకుండా ఉండలేక ఊపిరాడని స్థితిలోంచి రాసిన రచన ఇది. సమాజంలోని సంఘటనలను, ఆందోళన కలిగించే సామాజిక పరిణామాలను, విదేశ రాజకీయాల ఫలితాలను ఎంతో సృజనాత్మకంగా, సాహిత్య విలువలతో చేసన బ్రహ్మ ప్రకాశ్ రచన. దీన్ని ఉషారాణి సమర్థవంతంగా అనువదించారు. "విద్వేషం, కరుణ, విచారం, దు:ఖం, కష్టం, ప్రతిఘటన, న్యాయం మొదలైన అర్థాలపై సృజనాత్మక రచన. ఈనాడు మనమున్న భయంకర స్థితి నుంచి బయటపడే మార్గాన్ని చూపే దారిదీపం ఈ పుస్తకమని" అరుంధతి రాయ్ ప్రశంసించిన రచన.

తెలంగాణ తొలితరం కథకులు – కథన రీతులు



పరిశోధనాత్మక రచన ఇది. తెలంగాణ తొలితరం కథకులు 30మందిని స్థూలంగా పరిచయం చేయటమే కాక, వారి కథలను, కథన రీతులను విశ్లేషించిన గ్రంథమిది. కె.పి.అశోక్‌కుమార్ శ్రమకోర్చి రాసిన ఈ రచన సాహిత్య పరిశోధకు లకు మరింత పరిశోధనకు ఉపయోగపడే విధంగా ఉంది. "ఇది గతానికి సంబంధించినవి మాత్రమే కాదు, వర్తమానానికీ, బహుశా భవి ష్యత్తుకూ సంబంధించినవి. కథా ప్రక్రియకు పరిమితమైనవి మాత్రమే కాదు, సమాజ చరిత్రకు అవసరమైన ఎన్నో అంశాలూ ఇందులో ప్రస్తావనకు వచ్చాయ"ని ఎస్.వేణుగోపాల్ ప్రశంసిచిన రచన.

రేపెక్కడికెళ్తావ్..!



పదిహేను కథలున్న ఈ సంపుటిలో దేశంలోనే ప్రసిద్ధులైన రచయతలు రాసినవి. ఇందులో ఎనిమిది కథాంశాలు మహిళ ప్రధానంగా కొనసాగినవే. ఏ ప్రాంత రచయిత అయినా, ఏ భాషా రచన అయనా, కాలం ఏదయినా ఇందులోని కథలన్నీ సమకాలీన సామాజికతకు సంబంధించిన కథలుగా చైతన్యాన్ని, మానవీయతను పెంపొందిం చేవిగా ఉండటం వీటి ప్రత్యేకత. దేశంలోని వివిధ ప్రాంతాల జీవన ప్రతిబింబాల సంపుటి ఇది. అచ్చమైన తెలుగు నుడికారంతో రూప్‌కుమార్ డబ్బీకార్ అనువదించారు.

విప్లవ నీతి కథలు



ఇది నిజంగా అవసరమైన నీతి కథలు. పిల్లలకే కాదు, పెద్దలకు కూడా. ముఖ్యంగా శ్రామిక ఉద్యమాల్లో పనిచేస్తున్న నాయకులకు, కార్యకర్తలకు ఎంతో విలువైన కథలు. నిత్యం వారి రోజువారీ పనుల్లో, చర్చల్లో, వ్యూహాల్లో, సంభాషణల్లో, ఎత్తుగడల్లో ఇవెంతగానో ఉపయోగపడతాయి. పక్షులు, జంతువులు ప్రకృతిన ఆసరా చేసుకుని, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక విషయాలను చాలా గొప్పగా చెప్పిన కథలు ఇవి. చైనా రచయిత ఫెంగ్ షుఫెంగ్ రాసిన ఈ కథల్ని ముక్తవరం పార్థసారథి తెలుగులో మనకందించారు.

భళా! చిత్రకళా!



భారతీయ దృశ్య కళా చరత్ర పుస్తకం కేవలం కళా చరిత్ర మాత్రమే కాదు, మానవ సాంస్కృతిక జీవనంలోని అనేక అంశాలను, వారి చరిత్రను తెలిపే గ్రంథం ఇది. కళా చరిత్రకారిణి డా॥ బాలమణి శ్రమకోర్చి సేకరించి, పరిశోధించి రాబోయే తరాలకు కానుకగా అందించారు. కళా సాంస్కృతిక రంగాలలో పనిచేస్తున్న, అభ్యసిస్తున్న వారికి ఇది ఎంతో ఉపయోగ పడే గ్రంథం. విశ్వవిద్యాలయ స్థాయిలో కళా చరత్రను బోధించే ఆచార్యులుగా ఉంటూ పరిశోధనాత్మకమైన ఈ రచనను చాలా ఆసక్తి గొలిపే రీతిలో చేశారు. చిత్రాలతో కూడిన కళా చరిత్ర.

స్త్రీ ఆధునిక కళాకారిణిగా శతాబ్దయానం



ఇదొక అపురూపమైన పుస్తకం. ఒక వంద సంవత్సరాల కాలంలో 1920 నుంచి 2020 వరకు భారతదేశంలో చిత్రకారిణులుగా, కళాకారి ణులుగా ప్రసిద్ధి చెందిన 69 మందిని, వారి కళా విశేషణాలను జీవిత పరిచయాలను ఎంతో ఆసక్తిని కలిగించేట్లు రచించారు డా. బాలమణి గారు. మహిళా చిత్రకారిణుల చరిత్రను నమోదు చేసిన అరుదైన గ్రంథం. వర్ణ చిత్రాలతో ఇంగ్లీషు, తెలుగు రెండు భాషల్లో కలిపి వేసిన అరుదైన రచన.

మాటలో మనసునై



'జీవితంలోని అనుభవాలు, అనుభూతులను గురించి రాయడం, సాధారణ పాఠకుడి గుండెకు హత్తుకునేట్లు క్లుప్తంగా వ్యక్తీకరించడం సృజనాత్మక ప్రతిభకు తార్కాణం. మామూలు మనుషులకు సాదాసీదాగా అనిపించే అంశాల గురించి ఆసక్తికరంగా రాయడం సునిశిత దృష్టికి సృజనాత్మక యోచనలు ఉన్నవారికే సాధ్యం. అలాంటి రచనే ఇది' అంటారు గుడిపాటి. ఆనందాచారి అంతరంగ ఆవిష్కరణే ఈ పుస్తకం.

తదేక



'తదేక' విమర్శనా వ్యాసాల సంపుటి. కొత్తగా వస్తున్న సహిత్య సృజనపై విశ్లేషణాత్మకమైన వ్యాసాలివి. కొత్తగా సాహిత్య రంగంలోకి వస్తున్న వారికి, సాహితీ పరిశోధకులకు ఎంతో అవగాహన కలిగించే విమర్శనా సంపుటి ఇది. సాహ్యి రంగంలో విశేష కృషి చేస్తూ బోధనా రంగంలో ఉన్న డా॥ మహమ్మద్ హసేన వెలువరించిన విశ్లేషణ్మాక గ్రంథం.

దర్వాజ పేజీపై మీ అభిప్రాయాలను, సూచనలను, సలహాలను, రచనలను darwajapage@ gmail.com కు పంపించగలరు. చిరునామా : దర్వాజ, నవతెలంగాణ, ప్లాట్‌నెం. 21/1, అజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్- 500020

మోయలేని పని భారం !

- అదనపు బాధ్యతలతో కుదేలవుతున్న అంగన్‌వాడీలు
- 'గౌరవ' వేతనం పేరుతో శ్రమ దోపిడీ
- ఇచ్చేది గోరంత...చాకిరీ కొండంత
- ఎప్పుడు ఏ పని పురమాయిస్తారోనని ఆందోళన

న్యూఢిల్లీ : ప్రాథమిక విద్యాభ్యాసానికి ముందు అంటే ఒకటవ తరగతిలో చేరడానికి ముందే చిన్నారుల సంరక్షణ, విద్య (ఈసీసీఈ)పై జాతీయ విద్యా విధానం-2020 దృష్టి సారించింది. ఈ విధానాన్ని గతంలో ఎన్నడూ అనుసరించలేదు. చిన్నారుల వయసు ఆరు సంవత్సరాలకు చేరకముందే వారి మెదడు 85 శాతం మేర వృద్ధి చెందుతుంది. ఓ చిన్నారి ఆలోచనలు, మేధస్సు, భావోద్వేగ వృద్ధికి ఆ వయసు అత్యంత కీలకమైనదని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే ప్రీ-ప్రైమరీ తరగతులను (గ్రేడ్-1కి ముందు) ప్రభుత్వ

విధులేమిటి?

ప్రస్తుతం ఆరు సంవత్సరాల కంటే తక్కువ వయసున్న పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరవుతు న్నారు. 2023 డిసెంబర్ 31 నాటికి దేశంలో 3,48,135 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 12,23,068 మంది సహాయకులు ఉన్నారని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. గర్భిణులు, పాలిచ్చే తల్లులు, శిశువులు, ఆరు సంవత్సరాల లోపు వయసున్న పిల్లల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరోగ్య సంబంధమైన పథకాలకు సంబంధించిన వివిధ పోషకాహార, అవగాహనా కార్యక్రమాల అమలును వీరందరూ నిశితంగా పర్యవేక్షిస్తూ అమలు చేస్తారు. ఇప్పుడు కొత్తగా ప్రీ స్కూల్ విద్యకు సంబంధించిన బాధ్యతను కూడా వీరి పైనే మోపబోతున్నారు.

పరిధిలో చేర్చారు. పాఠశాల విద్యను పూర్తిగా ప్రక్షాళన చేయడానికి వీలుగా తరగతులను నాలుగు స్థాయిలుగా



విభజించాలని నేషనల్ కరికులమ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌సీఎఫ్) సూచించింది. అందుకోసం 5+3+3+4 ఫార్ములాను రూపొందించింది.

ఆటలతో విద్య

ఇందులో మొదటి ఐదు సంవత్సరాలను ఫౌండేషన్ దశ అంటారు. ఈ దశలో మూడు నుండి ఎనిమిది సంవత్సరాల వయసున్న చిన్నారులు ఉంటారు. సమీప భవిష్యత్తులో ప్రామాణికీకరణకు, ప్రైవేటు ప్రీ-స్కూల్స్ క్రమబద్ధీకరణకు కూడా ఇది బాటలు వేస్తుంది. ఈ దశలో అంగన్‌వాడీలను, ప్రాథమిక పాఠశాలలను భాగస్వాములను చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఆటలతో కూడిన విద్యను నేర్పడం ఈ దశ ప్రత్యేకత. అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ విషయంలో ఎక్కువ బాధ్యత అప్పగిస్తారు. అందుకోసం అంగన్‌వాడీ కార్యకర్తలకు అవసరమైన శిక్షణ అందిస్తారు. ఆ దిశగా ప్రభుత్వం పలు చర్యలను ప్రకటించింది. శిక్షణ కాదు...శిక్షే

ఫౌండేషన్ స్థాయిలో జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసే విషయంలో వివిధ రాష్ట్రాలు వేర్వేరు వైఖరులను అనుసరిస్తున్నాయి. ప్రీ స్కూల్ స్థాయిలో ఆటలతో విద్యను అందించడంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు దీర్ఘకాల శిక్షణ ఇవ్వాలని యోచిస్తున్నారు. మహారాష్ట్రలో ఇప్పటికే ఆరు నెలల కోర్సును రూపొందించారు. అంతేకాదు...అంగన్‌వాడీలకు శిక్షణ అందించే వారికి అవసరమైన సూచనలు కూడా ఇచ్చారు.

ఇదో రకం శ్రమ దోపిడీ

అంగన్‌వాడీలపై ఇప్పటికే అధిక పనిభారం పడుతోంది. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ 3-6 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లలను చూసుకుంటారు. ఆ తర్వాత వారికి భోజనం పెట్టాల్సి ఉంటుంది. రెండు గంటలకు ఈ పనులు పూర్తి చేసుకొని ఆ తర్వాత మహిళలు, శిశువుల బాగోగులు చూస్తారు. అన్ని రకాల సమాచారాన్ని సిద్ధంగా ఉంచడం, ఇతర పథకాలకు సంబంధించిన చిన్నా చితకా పనులు చేయడం, ప్రభుత్వం అప్పగించే కార్యక్రమాలు నిర్వహించడం...వీటన్నింటితో అంగన్‌వాడీలకు తగినంత విశ్రాంతి అనేదే లేకుండా పోతోంది. పనికి తగిన వేతనం అనే మాట వీరి నిఘంటువు లోనే లేదు. వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించరు. కనీసం గ్రాట్యుటీ, పెన్షన వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలు కూడా కల్పించరు. జీతానికి బదులు గౌరవ వేతనం అందిస్తూ శ్రమను దోచుకుంటారు. ఆ ఇచ్చేది కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచుకుంటాయి.

ఇంటర్ వరకూ విద్యను అభ్యసించిన వారికి ఆరు నెలలు, అంతకంటే తక్కువ విద్య ఉన్న వారికి సంవత్సరం శిక్షణ ఇస్తారు. ఇప్పటికే బండెడు చాకిరీతో తల్లడిల్లుతున్న అంగన్‌వాడీలకు ఇది ఓ రకంగా శిక్ష వంటిదే.

పని భారం పెంచిన డిజిటలీకరణ

కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ప్రధాన అంగన్‌వాడీలలో పనిచేసే కార్యకర్తలు, సహాయకుల నెలసరి గౌరవ వేతనాన్ని రూ.4,500, 2,250కి పెంచింది. రాష్ట్రాలు అందించే మొత్తంలో వ్యత్యాసాలు ఉన్నాయి. తమిళనాడులో కార్యకర్తలు రూ.13,452 పొందుతుంటే పశ్చిమ బెంగాల్‌లో రూ.8,250 మాత్రమే ఇస్తున్నారు. డిజిటలీకరణ నేపథ్యంలో పనిభారం పెరిగిందే తప్ప తగ్గలేదు. అంగన్‌వాడీలు మొబైల్ అప్లికేషన్-పోషణ్ ట్రాకర్ యాప్‌లో పూర్తి సమాచారాన్ని అప్‌లోడ్ చేయాల్సి రావడంతో పెద్ద ఎత్తున గందరగోళం, అసమ్మతి చోటుచేసుకుంటున్నాయి. పనిభారం అసాధారణంగా పెరిగిపోతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెట్‌వర్క్ సరిగా లేదని, ఫోన్లు కూడా నాసిరకంగా ఉన్నాయని వారు ఫిర్యాదు చేస్తున్నారు. ఫోన్ పనిచేయకపోతే వదిలేయడానికి లేదు. ఎవరైనా మహిళను ఓ పథకంలో నమోదు చేయాలంటే ముందుగా ఆమె కేవైసీని పూర్తి చేయాలి. అయితే ఆ మహిళకు ఫోన్ ఉండదు. భర్త వద్ద ఉన్నప్పటికీ పనిలో ఉంటాడు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అర్థం చేసుకోలేని వారు అసహనానికి గురవుతుంటారు.

రాత్రి సమయంలో కూడా...

గత సంవత్సరం డిసెంబరులో ఇరవై వేల మంది అంగన్‌వాడీలు ముంబయిలోని ఆజాద్ మైదాన్‌లో 52 రోజుల పాటు నిరసన తెలిపారు. ఆ కాలంలో వారికి వేతనాలు ఇవ్వలేదు. అంతేకాక క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. ఈ సంవత్సరం జూలైలో పంజాబ్ నుండి తమిళనాడు, ఢిల్లీ, మహారాష్ట్ర వరకూ పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. గత ఏడాది మేలో కేంద్రం 'పోషణ్ భీ, పఢాయ్ భీ' పేరిట ఓ కార్యక్రమాన్ని చేపట్టింది. దీని బాధ్యత కూడా అంగన్‌వాడీల పైనే పడింది. పోషకాహారానికి సంబంధించిన కోణంపై వారు మరింతగా దృష్టి సారించాల్సి వచ్చింది. చేయాల్సిన పని చాలా వరకూ ఆన్‌లైన్‌లోనే జరుగుతుండడంతో తరచుగా రాత్రి 11 గంటల వరకూ విధులు నిర్వర్తించాల్సి వస్తోందని అంగన్‌వాడీలు చెప్పారు. బోధనా విధానంలో తరచూ మార్పులు చేస్తున్నారు. కానీ అంగన్‌వాడీలకు అవసరమైన మౌలిక సదుపాయాల మద్దతు అందించడం లేదు. మరింత క్రియాశీలకంగా పని చేయాలంటే మంచి వేతనాన్ని ఇవ్వాలని, ప్రయోజనాలు కల్పించాలని వారు కోరుకుంటున్నారు. ఇది అత్యాస కాదేమో.

అబద్ధాలు, అసత్యాలు మానుకోవాలి

లేకపోతే ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం

- అడ్డూ అదుపులేని అవినీతి పాలన మీది
- ఏడాదిలోనే అద్భుత పాలన కాంగ్రెస్‌ది : బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లేఖ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్‌ఎస్ పార్టీ నేతలు, కేసీఆర్ కుటుంబసభ్యులు కాంగ్రెస్ పాలనపై అబద్ధాలు, అసత్యాలు ప్రచారం చేయడం మానుకోవాలని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కోరారు. లేకపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాజీ సీఎం, ప్రతిపక్ష నాయకులు, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్‌కు లేఖ రాశారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలన అడ్డూ అదుపు లేని అవినీతితో కూడుకున్నదనీ, ఏడాది కాంగ్రెస్ పాలన అద్భుతంగా ప్రజలకు సేవలందించిందని వివరించారు.

బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలో తెలంగాణ వెనుకబడిందని ఆరోపించారు. దళిత ముఖ్యమంత్రి హామీని అమలు చేయకుండా సీఎంగా అందలమెక్కి మొదటి రోజు నుంచే వంచనకు పాల్పడ్డారని వివరించారు. కోర్టుల్లో కేసులు వేయించి బీఆర్‌ఎస్ ఉద్యోగాల భర్తీ చేపట్టలేదని తెలిపారు. అన్ని రకాల పోటీ పరీక్షలు అవకతవకలు, గందరగోళమే చేశారని తెలిపారు. కాంగ్రెస్ తొలి ఏడాదిలోనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి 54 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టునునాణ్యతా లోపంతో నిర్మించి, దాని మనుగడకే ప్రమాదం తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీని కింద మూడు బ్యారేజీలు పని చేయకపోయినా ఈ ఖరీఫ్ సీజన్లో 66.76 లక్షల ఎకరాల్లో 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఉత్పత్తి చేసేలా సాగునీరు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నాటికి రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉంటే ఆ అప్పును రూ.7 లక్షల కోట్లకు పెంచారని వివరించారు. లక్షలాది మంది రైతుల రుణమాఫీని బీఆర్‌ఎస్ ఎగ్గొడితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షలలోపు రుణాలను మొత్తం రూ.21 వేల కోట్లు మాఫీ చేసి 25 లక్షల మంది రైతులకు సహాయపడిందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో పంట బీమా లేకపోవడంతో రైతులు నష్టపోగా, కాంగ్రెస్ ప్రభుత్వం 42 లక్షల మంది రైతులకు బీమా కవరేజీ కోసం రూ.1,433.33 కోట్ల ప్రీమియం చెల్లించిందని వివరించారు. కాంగ్రెస్ అధికారికంగా రూపొందించిన విగ్రహంపై బీఆర్‌ఎస్ నేతలు విమర్శలు చేయడం హాస్యాస్పదమని కొట్టిపారేశారు.

అసెంబ్లీకి రండి

సుదీర్ఘ రాజకీయ అనుభవమున్న కేసీఆర్ ఫాంహౌజ్‌కే ఎందుకు పరిమితమయ్యారని ప్రజలు ప్రశ్నిస్తున్నారని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి వచ్చి రాష్ట్ర ప్రగతికి సలహాలు, సూచనలు ఇస్తే బాగుంటుందని సూచించారు.

ఉద్దేశపూర్వకంగా కొట్టలేదు..

క్షమాపణ చెబుతున్నా: మోహన్‌బాబు




హైదరాబాద్: జల్‌పల్లిలోని తన నివాసం వద్ద జరిగిన ఘటనపై నటుడు మోహన్‌బాబు మరోసారి స్పందించారు. తాను ఉద్దేశపూర్వకంగా మీడియా ప్రతినిధిని కొట్టలేదని వివరణ ఇచ్చారు. జర్నలిస్టులకు క్షమాపణలు చెప్పారు. ఆదివారం సాయంత్రం సోమాజిగూడ యశోద ఆస్పత్రికి వెళ్లి.. చికిత్స పొందుతున్న జర్నలిస్టును మోహన్‌బాబు, మంచు విష్ణు పరామర్శించారు. ఈ సందర్భంగా అతని కుటుంబ సభ్యులకు క్షమాపణ చెప్పారు.

జల్‌పల్లిలో సినీనటుడు మోహన్‌బాబు నివాసం వద్ద మంగళవారం రాత్రి ఉద్రిక్తత చోటుచేసుకున్న విషయం తెలిసిందే. తెలంగాణ అదనపు డీజీపీని కలిసిన అనంతరం మనోజ్ ..మోహన్‌బాబు నివాసానికి చేరుకోగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. భద్రతా సిబ్బంది గేట్లు తీయకపోవడంతో మనోజ్ అక్కడి భద్రతా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గేట్లు తోసుకొని లోపలికి దూసుకెళ్లారు. ఆయనతో పాటు అక్కడ ఉన్న మీడియా సిబ్బంది కూడా మోహన్‌బాబు ఇంట్లోకి వెళ్లారు. ఈ ఉద్రిక్తతల నడుమ మోహన్‌బాబు తీవ్ర అసహనానికి గురయ్యారు. అక్కడే ఉన్న మీడియా ప్రతినిధులపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. కొందరు ప్రతినిధులపై ఆయన చేయి చేసుకున్నారు. దీంతో ఆ జర్నలిస్ట్‌కు గాయమైంది.

గద్దరన్న న్యాయం కోసం ఉద్యమించారు

పాట ఉన్నంతకాలం గద్దర్ సజీవం : మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

- సిద్దిపేటలో గద్దర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం సేకరించాలి
- గద్దర్ ఒక ప్రపంచం.. ఒక సముద్రం.. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, కవి నందిని సిద్ధారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- అంబేద్కర్ తరువాత గొప్ప వ్యక్తి గద్దర్ : ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య



నవతెలంగాణ-సిద్దిపేట

విప్లవ ఉద్యమం, తెలంగాణ ఉద్యమం, దళిత ఉద్యమం ప్రతి దాంట్లో న్యాయం వైపున నిలిచి అన్యాయాన్ని గద్దరన్న ప్రశ్నించారని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. పాట ఉన్నంతకాలం గద్దరన్న సజీవంగానే ఉంటారని తెలిపారు. గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విపంచి కళానిలయంలో గద్దర్ సాహిత్యం, రాజకీయ, ఆర్థిక అంశాలతో వచ్చిన నాలుగు పుస్తకాలను గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి సూర్య కిరణ్‌తో కలిసి ఆదివారం హరీశ్‌రావు ప్రారంభించారు. పాపయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆయన మాట్లాడారు. గద్దరన్న అర్ధశతబ్దపు పోరాటమని, పదవుల కోసం ఆశపడకుండా తన తండ్రి పోరాటాన్ని, చరిత్రను రేపటి భావితరానికి అందించడానికి సూర్యం మంచి ప్రయత్నం చేస్తున్నారని కొనియాడారు. మలిదశ ఉద్యమంలో గద్దర్ అన్నను కలిసే అదృష్టం కలిగిందని తెలిపారు. వంద ఉపన్యాసాల సారం గద్దరన్న ఒక్క పాట అని, చాలా సామాన్య పదాలతో ప్రజల హృదయాల్లోకి చేరే విధంగా ఆయన పాటలు ఉంటాయని అన్నారు. 'పొడుస్తున్న పొద్దుమీద..' పాట తెలంగాణ ఉద్యమాన్ని, సమాజాన్ని ఉర్రూతలూగించి, ప్రజల్లో చైతన్యాన్ని నింపిందని చెప్పారు. 2008లో తెలంగాణ కోసం రాజీనామా చేసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను, ఎంపీలపై తెలంగాణ ఐక్య కార్యాచరణ సమితి అభ్యర్థులను పెట్టాలని నిర్ణయిస్తే అది తప్పని వాదించిన వ్యక్తి గద్దర్ అని, తెలంగాణ ఉద్యమానికి, కేసీఆర్‌కు అండగా గద్దర్ నిలబడ్డారన్నారు. తూప్రాన్‌లో నీళ్లలేవని హల్దీ వాగులో నుంచి వాటిక చెరువుకి లిఫ్ట్ పెట్టాలని గద్దర్ కోరితే, 8 నెలల్లో పూర్తి చేసి ఆయనతోనే ప్రారంభించినట్టు తెలిపారు. సిద్దిపేటలో గద్దరన్న విగ్రహం పెట్టడం మాకు చాలా గౌరవమని, పెట్టించే బాధ్యత తనదని, స్థలం చూడాలని అన్నారు. గద్దరన్న జీవిత చరిత్ర పైన ఒక డాక్యుమెంటరీ చేయాలని, దానికి తాను సహకరిస్తానని తెలిపారు. తన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మను సీఎం రేవంత్ రెడ్డి మాయం చేశారని ఆరోపించారు. అలాంటి రాష్ట్ర ప్రభుత్వం అవార్డు ఇస్తే దాన్ని తృణప్రాయంగా తిరస్కరించిన నందిని సిద్ధారెడ్డి.. మన సిద్దిపేట బిడ్డ కావడం నిజంగా గర్వకారణమన్నారు.

గద్దర్‌ను విశ్లేషించడం కష్టం

ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గద్దర్‌ను విశ్లేషించడం చాలా కష్టమని, ఆయన ఒక మహా సముద్రమని అన్నారు. న్నారు. పాటల ద్వారా పెట్టుబడిదారులను భయపెట్టించారని, ఆయన పాటలో గ్రామీణ జీవితం ఉందన్నారు. చెత్త కుండీ, పాయాకాన, వేతనం లేకుండా పనిచేస్తున్న స్త్రీల పైనా తన సాహిత్యం అందించారని తెలిపారు. కవి సిద్ధారెడ్డి మాట్లాడుతూ.. గద్దర్ ఒక ప్రపంచమని, యాభై ఏండ్లు ఆయనతో అనుబంధం ఉన్నదని అన్నారు. గద్దర్‌తో పోల్చే మరో గాయకుడు లేడన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. అంబేద్కర్ తర్వాత గద్దర్ గొప్ప వ్యక్తి అని, ఆయన మహాశక్తి అని అన్నారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాల కిషన్ మాట్లాడుతూ.. తెలంగాణ మలి దశ ఉద్యమంలో ధూమ్ ధామ్ కార్యక్రమాన్ని తీసుకొచ్చి కళాకారులకు ఒకే స్టేజీ మీదకు తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి గద్దర్ అని అన్నారు. మెదక్ జిల్లాకు ఆయన పేరు పెట్టాలని సూచించారు. ప్రజల ఆశయాల కోసమే గద్దర్ పాటలు రాశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఆస శ్రీహరి, రంగాచారి, శంకర్, శ్రీహరి, తిరుపతి రెడ్డి, సత్తయ్య, యాదగిరి, ఆస లక్ష్మణ్, కనకయ్య, రాజలింగం, భీమసేన తదితరులు పాల్గొన్నారు.



మేడారంలో సందర్శకుల సందడి

నవతెలంగాణ-తాడ్వాయి

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క-సారలమ్మ వనదేవతల దర్శనానికి ఆదివారం సందర్శకులు భారీగా తరలిరావడంతో గద్దెల ప్రాంగణం సందడిగా మారింది. ఆదివారం సెలవుదినం కావడంతో పాటు మినీ మేడారం జాతర కూడా సమీపిస్తున్న తరుణంలో సందర్శకులు ముందస్తుగా తమ మొక్కులు చెల్లించుకునేందుకు భారీగా తరలివచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాలే కాకుండా సరిహద్దు రాష్ట్రాలైన చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి కూడా జనం వేలాదిగా కుటుంబ సమేతంగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మొదట జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి తల్లుల గద్దెలకు చేరుకొని పూలు, కుంకుమ, బంగారం, కొత్త బట్టలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ అధికారులు, ఆలయ పూజారులు సకల సౌకర్యాలు కల్పించారు. వేలాది మంది భక్తుల రాకతో ఆదివారం మేడారం పరిసరాలు సందర్శకులతో జనసంద్రంగా మారాయి.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మహిళల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట : పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క

- సబ్సిడీపై రైతులకు వ్యవసాయ పనిముట్లు అందిస్తాం : వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- వికారాబాద్ జిల్లాలో మంత్రుల పర్యటన



నవతెలంగాణ-పరిగి, కుల్కచర్ల, దోమ

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సబ్సిడీపై రైతులకు వ్యవసాయ పనిముట్లు అందిస్తామని హామీ ఇచ్చారు. మహిళల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లాలో పర్యటించిన మంత్రులు.. పరిగి, కుల్కచర్ల మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం, పలు అభివృద్ధి, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పరిగి మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా పరశురామ్ రెడ్డితోపాటు పాలక మండలి సభ్యులు, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా బీఎస్ ఆంజనేయులు ముదిరాజ్‌తోపాటు పాలకవర్గ సభ్యులు మంత్రుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. కుల్కచర్ల మండలంలోని బండవెల్కిచెర్ల పాంబండ రామలింగేశ్వర స్వామి దేవాలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికీ మంత్రులు హాజరయ్యారు. అలాగే పరిగి పట్టణకేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. సీఎం కప్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశాల్లో మంత్రులు మాట్లాడారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒకదాని వెంబడి ఒకటి అమలు చేస్తున్నామని అన్నారు. రైతు కూలీలకు ఇచ్చిన హామీలు కూడా తప్పకుండా నెరవేరుస్తామని తెలిపారు. ఏకకాలంలో రుణమాఫీ చేశామని, త్వరలోనే రైతు భరోసా రైతుల ఖాతాలో జమవుతుందని తెలిపారు. అగ్రికల్చర్‌తోపాటు ఆయిల్ ఫామ్ మీద కూడా దృష్టి పెట్టినట్టు చెప్పారు. రైతులు వ్యవసాయం చేయడంతో పాటు తమ పిల్లలను బాగా చదివించాలని సూచించారు. శీతల గిడ్డంగులను నిర్మించనున్నట్టు తెలిపారు. అదేవిధంగా పండించిన పంటలను హోల్ సేల్ మార్కెట్‌లో విక్రయించేందుకు కోహిడ వద్ద మార్కెట్‌ను సన్నద్ధం చేస్తున్నట్టు చెప్పారు. జిల్లాకు ట్రిబుల్ ఆర్ రోడ్డు రావడం వల్ల భూములకు భారీగా డిమాండ్ పెరుగుతుందని, కాబట్టి రైతులెవరూ భూములను అమ్ముకోకూడదని సూచించారు. పార్టీలో కష్టపడిన వారికి సరైన గుర్తింపు లభిస్తుందన్నారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ.. వ్యవసాయ శాస్త్రవేత్తలుగా రైతన్నలు ఉన్నారని, కందులకు తాండూర్ ఫేమస్ అని అన్నారు. పంటల మార్పిడి కూడా అవసరమని అన్నారు. మహిళల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. రాబోయే కాలంలో రైతులే రాజులు, మహిళలే మహారాణులని అన్నారు. అందరి సహకారంతో ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకొచ్చి ముందుకు సాగుతుందని తెలిపారు. ఛీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. చేవెళ్ల ప్రాణహిత ప్రాజెక్టు, రైల్వే లైన్ పరిగికి తీసుకువచ్చే క్రమంలో గత ప్రభుత్వం రాకుండా అడ్డుకుందన్నారు. ఇప్పుడు రైల్వే ప్రాజెక్టు సంబంధించి సర్వే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, డీఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్, జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ రాజేందర్ రెడ్డి, వైస్ చైర్మెన్ అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి

పబ్లిక్ సెక్టార్ జనరల్ ఇన్సూరెన్స్ యూనియన్లు,అసోసియేన్లు

నేడు భోజన విరామ సమయంలో నిరసన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ రంగ సాధారణ బీమా కంపెనీల్లో వంద శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమ తించాలన్న ప్రతిపాదనను ఉపసంహరించుకోవా లని కోరుతూ ఆయా కంపెనీల ఉద్యోగులు ఆందో ళన బాటపట్టారు. ఈ నిర్ణయాన్ని పబ్లిక్ సెక్టార్ జ నరల్ ఇన్సూరెన్స్ యూనియన్లు, అసోసియేన్లు తీవ్రంగా ఖం డించాయి. గతానుభవాలు చూస్తే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితి పెంపు ఈ రంగానికి దోహదం చేయలేదంటూ ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రస్తుతం 74 శాతం వరకు పరిమితి ఉన్నా బీమా రంగం కేవలం 32.67 శాతమే ఉప యోగించుకున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. అదే విధంగా పబ్లిక్ సెక్టార్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీల విలీనం తదితర డిమాండ్లతో నేడు నిరసనకు అసోసియేషన్లు, యూనియన్లు ఆందోళనకు పిలుపునిచ్చాయి.

మహారాష్ట్ర క్యాబినెట్ విస్తరణ

- మంత్రులుగా 39 మంది ప్రమాణం



నాగ్‌పూర్ : మహారాష్ట్ర క్యాబినెట్ విస్తరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముగ్గురు మహిళలు సహా 39 మంది మంత్రులుగా పదవీ స్వీకార ప్రమాణం చేశారు. నాగ్‌పూర్‌లోని రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ సిపి రాధాకృష్ణ మంత్రులతో ప్రమాణం చేయించారు. దీంతో రాష్ట్ర రెండో రాజధాని అయిన నాగ్‌పూర్‌లో 33 ఏళ్ల తరువాత జరిగిన పదవీ స్వీకార ప్రమాణోత్సవ కార్యక్రమంగా ఇది నిలిచింది. మంత్రులుగా ప్రమాణం చేసినవారిలో బిజెపి నుంచి 19 మంది, శివసేన (ఏక్‌నాథ్ షిండే) నుంచి 11 మంది, ఎన్‌సిపి (అజిత్ పవార్) నుంచి తొమ్మిది మంది ఉన్నారు. ఈ విసర్తణతో మంత్రుల సంఖ్య 42కు చేరింది. ఈ నెల 5న ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రులుగా ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ ప్రమాణస్వీకారం చేసిన సంగతి తెలిసిందే.

19 నుంచి జాతీయ పుస్తక ప్రదర్శన

ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా సీఎం, మంత్రులు

29 వరకు హైదరాబాద్ బుక్‌ఫెయిర్ కొనసాగింపు



- ఈ సారి అదనంగా మరో వేదిక
- 23న వెయ్యి మందితో పుస్తకవాక్
- పుస్తక ప్రియులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి : హైదరాబాద్ బుక్ ఫెయిర్ కార్యదర్శి ఆర్. వాసు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అందరూ ఎదురుచూస్తున్న పుస్తకాల పండగ రానే వచ్చింది. ఈ నెల 19 నుంచి 29 వరకు దాశరథి కృష్ణమాచార్యులు ప్రాంగణం(హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియం)లో హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ఆధ్వర్యంలో 37వ జాతీయ పుస్తక ప్రదర్శన జరగనున్నది. అందుకు సంబంధించి ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. పుస్తకప్రియులు బుక్‌ఫెయిర్‌ను సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ బుక్‌ఫెయిర్ కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు(వాసు) పిలుపునిచ్చారు. బుక్‌ఫెయిర్ నేపథ్యంలో ఏర్పాట్లు, ఈసారి ప్రత్యేకతలు, నిర్వహణ, అతిథుల రాక గురించి నవతెలంగాణకు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

దాశరథి కృష్ణమాచార్యులు ప్రాంగణం

దాశరథి శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో ఈసారి ఎన్టీఆర్ స్టేడియంలోని బుక్‌ఫెయిర్ ప్రాంగణానికి దాశరథి కృష్ణమాచార్యులు ప్రాంగణంగా పేరు పెట్టాం. ప్రతిసారీ ప్రాంగణంలో పుస్తకాల ఆవిష్కరణలు, చర్చలు, ముఖ్య అతిథుల ప్రసంగాల కోసం ఒకే వేదిక ఉండేది. బుక్‌ఫెయిర్ విశిష్టత మరింత పెరగడం, కవులు, రచయిత విజ్ఞప్తి చేయడం వంటి కారణాలతో ఈసారి రెండు వేదికలను ఏర్పాటు చేస్తున్నాం. ఒక వేదికకు తోపుడుబండి సాధిక్‌పేరును, మరో వేదికకు బోయి విజయభారతి పేరును పెట్టాం. తోపుడుబండి సాధిక్ వేదికను హంపిథియేటర్‌గా తీర్చిదిద్దుతున్నాం.

347 స్టాళ్లు ఏర్పాటు

బుక్‌ఫెయిర్ ప్రాంగణంలో 347 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వ పథకాలు, తెలంగాణ సంస్కృతి, పర్యాటకం గురించి తెలిపేలా 14 స్టాళ్లను ఆయా ప్రభుత్వ శాఖలకు కేటాయించాం. తెలుగు పబ్లిషర్స్‌కు 171, ఇంగ్లీష్ పబ్లిషర్స్‌కు 135, స్టేషనరీకి 10 స్టాళ్లు ఇచ్చాం. రచయితలు తమ సొంతంగా పుస్తకాలను అమ్ముకునేందుకుగానూ ప్రత్యేకంగా ఆరు స్టాళ్లను అందుబాటులో ఉంచాం. బుక్‌ఫెయిర్‌లో సాహిత్యం, ఆధ్యాత్మికం, ఆయా రంగాలకు సంబంధించిన, పోటీపరీక్షలు, చిన్నపిల్లల పుస్తకాలు లభించనున్నాయి.

> బుక్‌ఫెయిర్ 19న సాయంత్రం మొదలవుతుంది. ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించాం. ఆయనతో పాటు హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరుకానున్నారు. బుక్‌ఫెయిర్ ఆవశ్యకతను మరింత ఇమిడింపజేయడంలో భాగంగా కేంద్ర సాహిత్య అకాడమీ వారిని కూడా ఆహ్వానించాం. అకాడమీ నుంచి ఇద్దరు పరిశీలకులు రానున్నారు.
> పుస్తకాలు చదవాల్సిన ఆవశ్యకతను ప్రజలను విడమర్చి చెప్పడంలో భాగంగా ఈ నెల 23న ట్యాంక్‌బండ్ నుంచి ఎన్టీఆర్ స్టేడియంలోని దాశరథి కృష్ణమాచార్యులు వేదిక వరకు పుస్తక వాక్‌ను నిర్వహించబోతున్నాం.
>
> **ముఖ్య అతిథులుగా సీఎం, మంత్రులు పొన్నం, జూపల్లి**

సమయం పెంచాం

ఈసారి పబ్లిషర్స్, పుస్తకప్రియుల విజ్ఞప్తి మేరకు మరిన్ని ఎక్కువ గంటలు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించాం. అందులో భాగంగానే బుక్‌ఫెయిర్‌ను ప్రతిరోజూ మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభించి రాత్రి 9 గంటల వరకు నిర్వహించనున్నాం. గతంలో రోజుకు ఆరు గంటలే అందుబాటులో ఉండగా..ఈసారి దాన్ని తొమ్మిది గంటలకు పెంచాం.

ప్రత్యేక ఆకర్షణగా సాంస్కృతిక కళారూపాలు

పిల్లలు, ఔత్సాహికులను మరింత ఆకర్షించేందుకు ఈసారి సభాప్రాంగణంలోని వేదికలపై సాంస్కృతిక కళారూపాలు ప్రదర్శించనున్నాం. దాశరథి గొప్పతనాన్ని నేటి యువతరానికి తెలిపేలా, మెరుగైన సమాజం దిశగా పిల్లలను తయారు చేసేలా తెలంగాణ బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో ప్రతి రోజూ రెండు గంటల పాటు కల్చరల్ ప్రోగ్రామ్స్ నిర్వహించనున్నారు.

ప్రతి రోజూ సాయంత్రం ఐదు గంటల నుంచి ఆరు గంటల వరకు తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కళారూపాలను ప్రదర్శించనున్నారు.

నచ్చిన..ప్రభావితం చేసిన పుస్తకాలపై చర్చ

బుక్‌ఫెయిర్‌కు ప్రముఖ రచయితలు, కవులతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించబోతున్నాం. ఈసారి ప్రముఖులు, రచయితలు, కవులతో తమకు నచ్చిన..తమ జీవితాలను ప్రభావితం చేసిన పుస్తకాలపై ప్రత్యేకంగా చర్చా కార్యక్రమం ఉంటుంది. వారు ఆ పుస్తకాల గొప్పతనం గురించి వివరిస్తారు. అట్లాగే ఈసారి చర్చాగోష్టుల్లో పాల్గొనేందుకు మహారాష్ట్ర, తమిళనాడు, కర్నాటక, తదితర రాష్ట్రాలకు చెందిన కవులు రానున్నారు. ఈసారి ప్రత్యేకంగా కేంద్ర సాహిత్య అకాడమీ నుంచి కూడా పర్యవేక్షకులు రానున్నారు.

> **పకడ్బందీగా ఏర్పాట్లు.. ప్రత్యేకంగా తెలంగాణ వంటకాలు.. పారిశుధ్యానికి ప్రాధాన్యం**
>
> పుస్తకప్రియులు, పబ్లిషర్స్, రచయితలు, సందర్శకులు, మేధావుల సూచనలు, సలహాల మేరకు బుక్‌ఫెయిర్ నిర్వహణ కోసం ఈసారి ప్రకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. హైదరాబాద్ బుక్‌ఫెయిర్ కమిటీ ఏడు టీమ్‌లుగా విడిపోయి విజయవంతం కోసం రెండు నెలలుగా పనిచేస్తున్నాం. దాశరథి కృష్ణమాచార్య ప్రాంగణంలో ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నాం. వృద్ధులు, వికలాంగుల సౌకర్యార్థం కోసం ఈసారి వీల్‌చైర్లను అందుబాటులో ఉంచాం. తెలంగాణ వంటకాలతో ఈసారి ప్రత్యేకంగా ఫుడ్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశాం. ఇరానీ చాయ్, హైదరాబాద్ బిర్యానీ కూడా లభించనున్నాయి.

కార్పొరేట్ విద్యావిధానాన్ని నియంత్రించాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యా విధానాన్ని ప్రోత్సహించాలి :టీఎస్‌యూటీఎఫ్ రంగారెడ్డి జిల్లా మహాసభల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి

నవతెలంగాణ-షాద్ నగర్



కార్పొరేట్ విద్యా విధానాన్ని నియంత్రించాలని, అలా జరిగినప్పుడే పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్య అందే అవకాశం ఉంటుందని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ఠాగూర్ హైస్కూల్ ఆడిటోరియంలో జరిగిన సంఘం జిల్లా మహాసభల్లో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏండ్లు పూర్తయినా ఇంకా ఎంతో మంది నిరుపేదలు చదువుకు దూరంగా ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఎంతోమంది తల్లిదండ్రులు కూటికి లేకున్నా తమ పిల్లలకు కార్పొరేట్ స్కూళ్లలో చదివించాలని తాపత్రయపడుతున్నారని తెలిపారు. అలాంటి విద్యా విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించడం విడ్డూరంగా ఉందన్నారు.

అనేక ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, పేస్కేల్ విడుదల చేయాలన్నారు. 317 జీవోతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని, ఆ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారించాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

అనంతరం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా గోపాల్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా ఎం వెంకటప్ప ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శులుగా నర్సింలు గౌడ్, శివారెడ్డి, వెంకటయ్య, కిషన్ చౌహన్‌తో పాటు 93 మంది జిల్లా కమిటీ సభ్యులుగా 17 మంది జిల్లా ఆఫీస్ బేరర్స్‌గా ఎంపికయ్యారు.

అన్నం పెట్టే అన్నదాతపై అరాచకమా..?

హర్యానా ఘటనపై తెలంగాణ రైతు సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చలో ఢిల్లీ పాదయాత్ర చేస్తున్న రైతులపై శంభు సరిహద్దులో హర్యానాలోని బీజేపీ ప్రభుత్వం పోలీసులతో భాష్పవాయు గోళాలు, జల ఫిరంగులు ప్రయోగించడాన్ని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర చట్టం పార్లమెంటులో చేయాలని డిమాండ్ చేస్తూ పంజాబ్ నుంచి పాదయాత్ర చేసిన రైతులపై పోలీసులు దాడి చేశారని తెలిపారు. శనివారం 101 మంది రైతుల పాదయాత్ర హర్యానా ప్రభుత్వం ఏర్పాటు చేసిన బారికేడ్లను చేరుకోగా పోలీసులు ఒక్కసారిగా రైతులపై జల ఫిరంగులు, టియర్ గ్యాస్ ప్రయోగించడంతో వారు చెల్లాచెదురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీకి వెళ్ళడానికి అనుమతి లేదనీ, వెనక్కి వెళ్లిపోవాలని ఆదేశాలిచ్చినా రైతులు వెనక్కి తగ్గలేదని తెలిపారు. పారా మిలటరీ బలగాల సహాయంతో బారికేడ్లను వేసి రైతులను అడ్డుకున్నారని చెప్పారు. శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న రైతులపై పోలీసులు దాడి చేసి వారి గొంతులను అణచివేయాలనుకోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేటశారు. ఈ దాడిలో 17 మంది రైతులకు గాయాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయడమే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విధానంగా పెట్టుకుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రైతులతో చర్చలు జరిపి సమస్యను శాంతియుతంగా పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పార్టీ.. కార్యకర్తలకు అండగా ఉంటుంది

- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- కార్పొరేటర్ సింగిడి పద్మారెడ్డికి పరామర్శ

నవతెలంగాణ-బోడుప్పల్



కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉండేందుకు అన్ని రకాలుగా కృషి చేస్తుందని టీపీసీసీ చీఫ్ బి.మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. హైదరాబాద్‌లోని బోడుప్పల్ కార్పొరేషన్ పరిధి 5వ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి గత నెలలో లిఫ్ట్ ప్రమాదంలో గాయపడ్డ విషయం తెలుసుకుని ఆదివారం కార్పొరేటర్ నివాసానికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నాయకుల యోగక్షేమాలు తెలుసుకోవడం పార్టీ నాయకునిగా తన ప్రథమ కర్తవ్యమని అన్నారు. భవిష్యత్తులో పార్టీ విజయం కోసం కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట టీపీసీసీ ఉపాధ్యక్షులు, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, కార్పొరేషన్ల మేయర్లు తోటకూర అజయ్ యాదవ్, అమర్ సింగ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీపీసీసీ చీఫ్‌ను కలిసిన యూత్ కాంగ్రెస్‌జిల్లా ప్రధాన కార్యదర్శి

మేడ్చల్ జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా విజయం సాధించిన అసర్ల మౌనిక బీరప్ప టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు బోడుప్పల్ కార్పొరేషన్‌కు వచ్చిన మహేష్ కుమార్ గౌడ్‌ను ఆమె కలిశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో మహిళల భాగస్వామ్యం పూర్తి స్థాయిలో ఆశించిన విధంగా ఉందని, భవిష్యత్తులో పార్టీని ముందుకు తీసుకుపోయేలా కృషి చేస్తామని తెలిపారు. ఆమె వెంట యువజన కాంగ్రెస్ బోడుప్పల్ కార్పొరేషన్ అధ్యక్షులు అసర్ల బీరప్ప తదితరులు ఉన్నారు.

తిరోగమనం వైపు తెలంగాణ

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో తిరోగమనం వైపు పయనిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్‌లో విమర్శించారు. పదేండ్లపాటు కేసీఆర్ పాలనలో అద్భుతంగా పురోగమించిన రాష్ట్రం.. నేడు అవినీతి, అసమర్థ పాలనతో అభివృద్ధిలో వెనకబడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి రవాణా శాఖ ఆదాయాన్ని ఒక ప్రధాన సూచీ అని కేటీఆర్ పేర్కొన్నారు. "ప్రజల ఆర్థిక పరిస్థితులు బాగుంటే బైకులు, కార్లే కాదు ఇతర భారీ వాహనాల అమ్మకాలు జరుగుతాయి. వాహనాల రిజిస్ట్రేషన్లు వృద్ధిని చూపిస్తాయి. కానీ తెలంగాణలో రిజిస్ట్రేషన్లు తగ్గి ఆదాయానికి గండిపడుతోంది. పొరుగున ఉన్న ఐదు రాష్ట్రాలు ఈ ఏడాది రవాణాశాఖ ఆదాయంలో 8 నుంచి 32 శాతం వృద్ధి నమోదు చేయగా, తెలంగాణ మాత్రం గతేడాది కంటే తక్కువ వృద్ధి నమోదు చేసింది. పాలన గాలికొదిలేసి.. కక్ష సాధింపు చర్యలకే సమయాన్ని కేటాయించడతో అభివృద్ధిలో రాష్ట్రం వెనకబడుతోంది" అని కేటీఆర్ విమర్శించారు.

తబలా మాస్ట్రో ఇక లేరు

(మొదటిపేజీ తరువాయి)

మహిమ్‌లో తబలా విద్వాంసుడు అల్లా రఖా, బావి బేగం దంపతులకు జన్మించారు. జాకీర్ చిన్నప్పటి నుంచే సంగీతంలో చక్కని ప్రతిభను కనబరిచాడు. మూడేండ్ల వయసు నుంచే తన తండ్రి మార్గదర్శకత్వంలో మృదంగం శిక్షణ పొందాడు. 12 ఏండ్లు వచ్చేసరికి కచేరీ ప్రదర్శనలు జరిపారు. ఆ తర్వాత కొన్నేండ్లలో ఆయన ప్రపంచస్థాయిలో ఎదిగారు. ప్రపంచంలో ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్‌ను ప్రమోట్ చేయటంలో ఆయన కీలక పాత్ర పోషించారు.

పద్మభూషణ్, పద్మశ్రీ, సంగీత నాటక అకాడమీ వంటి ప్రతిష్టాత్మక అవార్డులను ఆయన అందుకున్నారు. 2024లో 66వ గ్రామీ అవార్డులలో సింగిల్ నైట్‌లో మూడు అవార్డులు పొందిన తొలి భారతీయుడిగా ఆయన చరిత్ర సృష్టించారు. జాకీర్ హుస్సేన్ మరణంతో సంగీత ప్రపంచం మూగబోయింది. ఇండియన్ క్లాసిక్ మ్యూజిక్ ప్రపంచంలో ఒక శకం ముగిసిందని అభిమానులు బాధను వ్యక్తం చేస్తున్నారు. జాకీర్ హుస్సేన్ మృతి పట్ల ప్రపంచవ్యాప్తంగా ఆయన అభిమానులు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేయటం కనిపించింది.

బీఆర్ఎస్ ఉద్యమంతోనే కాంగ్రెస్ గురుకుల బాట

- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ ఉద్యమంతోనే కాంగ్రెస్ గురుకుల బాట పట్టిందని ఆ పార్టీ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఏడాది పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ,గురుకుల పాఠశాలల్లోని 53 మంది విద్యార్థులు మరణించారని ఆరోపించారు. విద్యార్థులకు నిర్దేశించిన ఆహారం అందించక పోవడంతోనే వారు అనారోగ్యం పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ పోరాటానికి బయపడి సీఎంతో పాటు మంత్రులు గురుకుల విద్యార్థులతో కలిసి ఒక్క పూట హడావుడి చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలోనే రూ.1,500 డైట్ చార్జీలు పెంచామనీ, మరో సారీ 2023లో చార్జీలు పెంచడానికి సబ్ కమిటీ వేశామని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల స్థితి గతులు, నేటి రేవంత్ పాలనలో ఉన్న స్థితిగతులపై అమరవీరుల స్థూపం దగ్గరి బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

భారత్ చేరుకున్న దిసనాయకే

న్యూఢిల్లీ : భారత్‌లో మూడు రోజుల పర్యటన కోసం ఆదివారం న్యూఢిల్లీకి శ్రీలంక అధ్యక్షులు అనుర కుమార దిసనాయకే చేరుకున్నారు. కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎస్ మురుగన్, దౌత్య అధికారులు దిసనాయకేకు స్వాగతం పలికారు. సెప్టెంబరులో అధ్యక్షులుగా ఎన్నికైన తరువాత దిసనాయకేకు ఇదే మొదటి విదేశీ పర్యటన. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఆహ్వానం మేరకు ఈ పర్యటనకు వచ్చారు. భారత్‌తో దౌత్య సంబంధాలను మరింత బలపర్చడం, ఇరు దేశాల వివిధ రంగాల్లో సహకారాన్ని విస్తరించడం ప్రధాన లక్ష్యంగా ఈ పర్యటన సాగనుందని శ్రీలంక అధికారులు తెలిపారు.

ఆదివారం రాత్రి జై శంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో దిసనాయకే మధ్య చర్చలు జరిగాయి.



గ్రూప్-2 పరీక్ష హాల్లోకి ఫోన్ తీసుకెళ్లిన అభ్యర్థి

నవతెలంగాణ-వికారాబాద్ కలెక్టరేట్




గ్రూప్-2 పరీక్ష హాల్‌లోకి ఓ అభ్యర్థి సెల్‌ఫోన్ తీసుకెళ్లిన ఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి డెంటల్ కళాశాలలో జరిగింది. ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 పరీక్షల్లో భాగంగా మధ్యాహ్నం పేపర్-2 రాసేందుకు అభ్యర్థి హడావిడిగా వచ్చారు. ఆ క్రమంలోనే ఫోన్‌ను పరీక్షా కేంద్రంలోకి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. పరీక్ష రాసే సమయంలో గుర్తించిన అధికారులు ఫోన్‌ను స్వాధీనం చేసుకు న్నారు. ఈ ఘటనపై అభ్యర్థిని అధికారులు విచారిస్తు న్నారు. అయితే సెంటర్‌లోకి అభ్యర్థి వచ్చే ముందు చెకింగ్ చేయకుండా ఎలా రానిచ్చారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చెకింగ్ లోపం ఉందా.. అభ్యర్థి కావాలనే హాల్‌లోకి ఫోన్ తీసుకొ చ్చారా.. అనే కోణంలో అధికారులు విచారణ చేపట్టా రు. ఈ ఘటన కు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వక్ఫ్ బిల్లుతో పాలిటిక్స్

హిందూత్వ రాజకీయానికి ఉపయోగించుకుంటున్న బీజేపీ

- కర్నాటక, కేరళ, తమిళనాడులో ఆ పార్టీ నాయకుల తీరు
- కాషాయపార్టీ తీరుపై ముస్లిం సంఘాలు, ప్రతిపక్షాల ఆగ్రహం



న్యూఢిల్లీ : దేశంలో వక్ఫ్ బిల్లుతో హిందూత్వ రాజకీయాలకు బీజేపీ యత్నిస్తున్నది. ఆ పార్టీ నాయకులు ఈ బిల్లును తమ రాజకీయ ప్రయోజనాలకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టి మరీ ఈ విధంగా వ్యవహరిస్తున్నారు. కర్నాటక, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో పలు సందర్భాల్లో బీజేపీ నాయకుల తీరు దీనికి అద్దం పడుతున్నది.

కర్నాటకలోని బీజేపీ నాయకులు వక్ఫ్ బోర్డుకు వ్యతిరేకంగా తీవ్ర ప్రచారాన్నే చేస్తున్నారు. ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు అందివచ్చిన ప్రతి సందర్భాన్నీ ఉపయోగించుకుంటున్నారు. అక్టోబర్‌లో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య.. విజయపుర జిల్లాలోని రైతులను కలిశారు. హొనావాడలోని ఒక గ్రామంలో 1500 ఎకరాలకు సంబంధించి వక్ఫ్ బోర్డుకు చెందిన భూమిని రైతులు ఆక్రమించారంటూ అప్పటికే వారికి నోటీసులు వచ్చాయి. దీంతో రంగంలోకి దిగిన బీజేపీ ఎంపీ.. ఎలాంటి ఆధారాలు, వివరణ లేకుండా నోటీసులు పంపటాన్ని ప్రశ్నించారు. గెజిట్ నోటిఫికేషన్‌లో తప్పిదం కారణంగా విజయపుర గ్రామంలోని రైతులకు నోటీసులు అందాయని కర్నాటక ప్రభుత్వం పేర్కొన్నది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల రైతులకూ జారీ అయిన నోటీసులను ఉపసంహరించుకోవాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధికారులను ఆదేశించారు.ఇలాంటి నోటీసులు హవేరి జిల్లాలో హింసకు దారితీశాయి. కడకోల్ జిల్లాలోని గ్రామస్థులు తమ భూమిని కూడా వక్ఫ్ ఆస్తిగా క్లెయిమ్ చేస్తారనే భయంతో ముస్లిం నివాసితుల ఇండ్లపై రాళ్లు రువ్వారు. ఇదే ఆందోళనతో ధార్వాడ్, కల్బుర్గిలో కూడా నిరసనలు వెల్లువెత్తాయి. వక్ఫ్‌బోర్డులు భూ ఆక్రమణదారులనీ, దానిని తక్షణమే సవరించాల్సిన అవసరమున్నదనే అభిప్రాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీజేపీ తీవ్ర ప్రయత్నాలనే చేసింది. ఈ చర్యలే రైతులు, ప్రజల్లో ముస్లింల పట్ల ఆగ్రహానికి కారణమవుతున్నాయని అంటున్నారు.సాధారణంగా బీజేపీ శ్రేణులు, హిందూత్వ శక్తులు.. ముస్లింల పట్ల ద్వేషాన్ని పెంచటానికి 'జిహాద్' పదాన్ని ఉపయోగిస్తుంటారు. లవ్ జిహాద్ అంటూ ఆ మధ్య సాక్షాత్తూ బీజేపీ ప్రభుత్వాలే చర్యలు తీసుకున్న సందర్భాలున్నాయి. ఇప్పుడు దీనిని భూములకూ అన్వయిస్తున్నాయి బీజేపీ, దాని అనుబంధ హిందూత్వ శక్తులు. దీనికే 'ల్యాండ్ జిహాద్' అనే పేరును పెట్టాయి.

వక్ఫ్ చట్టం, 1995లో నిర్దేశించిన అధికారాలను కలిగి ఉన్న రాష్ట్రస్థాయి సంస్థల ద్వారా వక్ఫ్ భూముల నిర్వహించబడతాయి. భారత్‌లోని ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతాని(యూటీ)కి 30 వక్ఫ్ బోర్డులున్నాయి. వక్ఫ్ బోర్డుల పనితీరుకు సవరణలు ప్రతిపాదించే బిల్లును సమీక్షించే జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) పదవీకాలాన్ని నవంబర్ 28న లోక్‌సభ పొడిగించింది. ఇప్పుడది ఫిబ్రవరి బడ్జెట్ సెషన్‌కు మారింది. వక్ఫ్ బిల్లును ప్రతిపక్షాలు, ముస్లిం సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి. ఇప్పటికే మోడీ సర్కారుకు వ్యతిరేకంగా తీవ్ర ఆందోళనలు చేపట్టాయి కూడా. వక్ఫ్ బోర్డులను భూ ఆక్రమణదారులుగా చిత్రీకరించే బీజేపీ వ్యూహం పట్ల తాము జాగ్రత్తగా ఉన్నామని ముస్లిం సంఘాలు అంటున్నాయి. పార్లమెంటు ప్యానెల్‌లో సభ్యుడు, తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) ఎంపీ కళ్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ... పార్లమెంటులో బిల్లును ముందుకు తీసుకురావటం కష్టంగా ఉన్నందున, వక్ఫ్ బోర్డులకు వ్యతిరేకంగా సాధారణ ప్రజలలో వాతావరణాన్ని సృష్టించటానికి బీజేపీ లేనిపోని సమస్యలను లేవనెత్తిందని అన్నారు.

ఢిల్లీ వక్ఫ్ బోర్డు మాజీ న్యాయవాది వజీహ షఫీక్ మాట్లాడుతూ... "ముస్లింలను విలన్‌లుగా చిత్రీకరించటానికి, సమాజానికి వ్యతిరేకంగా ఓటర్లను పోలరైజ్ చేయటానికి ఇది బీజేపీ కొత్త ఎత్తుగడ అని హెచ్చరించారు.వక్ఫ్ ఆస్తులన్నింటినీ జాతీయం చేయాలని కర్నాటకలో బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాల్ డిమాండ్ చేశారు. గతనెల కర్నాటకలోని మూడు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగినప్పుడు కూడా బీజేపీ ఈ వివాదాన్ని ఎన్నికల అంశంగా ఉపయోగించుకున్నది. హిందువులు సాగు చేసుకుంటున్న ప్లాట్లను వక్ఫ్ ఆస్తిగా తప్పుగా గుర్తించటం ద్వారా కాంగ్రెస్ ముస్లింలను సంతృప్తి పరుస్తున్నదని బీజేపీ ఆరోపించింది.

వక్ఫ్ బిల్లును సవరించే అంశం, మతపరమైన మార్గాల్లో ఓటర్లను పోలరైజ్ చేయడానికి భూ వివాదాలను ఉపయోగించుకునే బీజేపీ వ్యూహం ఇటీవలి నెలల్లో కేరళలో కూడా స్పష్టంగా కనిపిస్తున్నది. ఎర్నాకుళం జిల్లాలోని మునంబం తీరం వెంబడి ఉన్న 404 ఎకరాల భూమి వక్ఫ్ బోర్డు, 600 హిందూ, క్రైస్తవ మత్స్యకారుల కుటుంబాల మధ్య 1960ల నుంచి న్యాయపరమైన వివాదానికి కేంద్రంగా ఉన్నది. కమ్యూనిటీ సభ్యులకు చెందిన ఆస్తులపై వక్ఫ్ బోర్డు చట్టవిరుద్ధంగా క్లెయిమ్‌లు వేసిందని ఆరోపిస్తూ సైరో-మలబార్ చర్చి నేతృత్వంలోని క్రైస్తవ సంస్థలు జేపీసీకి లేఖ రాయటంతో కర్నాటక వివాదం జరిగిన సమయంలోనే ఈ విషయం మళ్లీ తెరపైకి వచ్చింది.

వయనాడ్ లోక్‌సభ స్థానానికి గత నెలలో జరిగిన ఉపఎన్నికల ప్రచార ర్యాలీలో బీజేపీ ఎంపీ సురేష్ గోపి మాట్లాడుతూ.. బిల్లుకు సవరణలు వక్ఫ్ బోర్డు క్రూరత్వాన్ని అణిచివేస్తాయన్నారు. ఓటర్లు బీజేపీకి మద్దతు ఇవ్వకుంటే కేరళలోని శబరిమల ఆలయం, తమిళనాడులోని వేలంకన్ని చర్చిలపై వక్ఫ్ బోర్డు క్లెయిమ్ చేస్తుందని ఆయన హెచ్చరించారు. తమిళనాడులో వక్ఫ్ బోర్డు "ల్యాండ్ జిహాద్" అని ఆరోపించేందుకు బీజేపీ ఇదే నమూనాను అనుసరించింది. తిరుచ్చిలోని తిరుచెందురై ఆలయానికి, 600 మందికి చెందిన భూమిని వక్ఫ్ బోర్డు అక్రమంగా క్లెయిమ్ చేసిందని కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే ఆరోపించారు. వక్ఫ్ బిల్లును సమీక్షిస్తున్న పార్లమెంటరీ ప్యానెల్ సభ్యుడు, కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ మాట్లాడుతూ... వక్ఫ్ బోర్డులతో మొత్తం ముస్లిం సమాజాన్ని లక్ష్యంగా చేసుకోవటానికి బీజేపీ ల్యాండ్ జిహాద్ కుట్ర సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తోందని అన్నారు.

7
నవతెలంగాణ
ఎల్బీనగర్ -మహేశ్వరం
సోమవారం | డిసెంబర్ 16, 2024 | www.navatelangana.com

ఆర్టీసీ ప్రయాణికులకు శుభవార్త



నవతెలంగాణ-హయత్‌నగర్

నేటి నుండి కొత్తగా గ్రీన్ ఎలక్ట్రిక్ మెట్రో లగ్జరీ ఏసీ బస్సులు ఎన్జీవోస్ కాలనీ నుంచి లింగంపల్లికి రూట్ నెంబర్ (216w/300) అందుబాటులోకి రానున్నాయని హయత్ నగర్-2 డిపో మేనేజర్ శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ బస్సులు బీఎస్‌రెడ్డి నగర్, సాగర్ రింగ్ రోడ్డు, మందమల్లమ్మ, ఆరంఘర్, నానల్ నగర్, దర్గా, ఖాజాగూడ క్రాస్ రోడ్డు, ఖజాగూడ, నానక్ రామ్ గూడ, విప్రో సర్కిల్, ఐఐటి క్రాస్ రోడ్స్ మీదుగా లింగంపల్లి కి రాక పోకలు సాగించనున్నాయని వివరించారు. ఎన్జీవోస్ కాలనీ నుంచి మొదటి బస్సు ఉదయం 8:15 గంటలకు, చివరి బస్సు రాత్రి 9:30 గంటలకు బయలుదేరుతుందని తెలిపారు. లింగంపల్లి నుంచి మొదటి బస్సు ఉదయం 5:45 గంటలకు, చివరి బస్సు రాత్రి 7:00 గంటలకు బయలుదేరుతుందని చెప్పారు. ఈ బస్సులు ప్రతి అరగంటకు ఒక్కొక్కటి చొప్పున అందుబాటులోకి ఉంటాయని వెల్లడించారు.



కిషన్‌రెడ్డిని కలిసిన బాలాపూర్ బీజేపీ నాయకులు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం కిషన్ రెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బాలాపూర్ బండ్లగూడ ఖాల్సా సింగల్ విండో మాజీ చైర్మెన్ కొలన్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ కార్పొరేటర్లు, నాయకుల బృందం మర్యాద పూర్వకంగా కలిశారు. తర్వాత పూల మాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించి.. ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర మంత్రిని కలసిన వారిలో కార్పొరేటర్లు కిసరి గోవర్ధన్ రెడ్డి, చెవ్వ శ్రవణకుమార్, ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, పి. భిక్షపతి చారి, నాయకులు గౌరి శంకర్, గాజుల మధు, కోడూరి సోమేశ్వర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ- బడంగ్‌పేట్

ఆర్థిక సహాయం అందజేసిన దేప భాస్కర్ రెడ్డి



నవతెలంగాణ - దిల్‌సుఖ్‌నగర్

ప్రపంచ క్యారమ్ బోర్డు పోటీలో మూడో స్థానంలో నిలిచిన ఆదిత్యకు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దేప భాస్కర్ రెడ్డి ఆదివారం ఇరవై ఐదు వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. దేప ఫౌండేషన్ అధ్వర్యంలో దేప భాస్కర్ రెడ్డి.. ఆదిత్యకు ఆర్థిక సాయం అందజేసి, ప్రోత్సహించారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతిభ కలిగిన వారిని దేప ఫౌండేషన్ ప్రోత్సహిస్తుందని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రతిభావంతులైన ప్రతి ఒక్కరినీ దేప ఫౌండేషన్ ఆర్థికంగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఇప్పటికే దేప ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యువజన కాంగ్రెస్ నేత చిలుక ఉపేందర్ రెడ్డి, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, దేప మల్లారెడ్డి, కెఎస్ మూర్తి, పగడాల శ్రీశైలం, రాజగోపాల్, విప్లవ రెడ్డి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పాశం యాదగిరిని సన్మానించిన ఉద్యమకారులు



నవతెలంగాణ - దిల్ సుఖ్ నగర్

పాత్రికేయులు పాశం యాదగిరిని ఆదివారం తెలంగాణ ఉద్యమకారులు సన్మానించి, అభినందనలు తెలిపారు. ఆర్కేపురం డివిజన్‌కు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు మారోజు రామాచారి, తెలంగాణ వనరుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు గోరా శ్యాం సుందర్ గౌడ్‌లు ఈ సందర్భంగా పాశం యాదగిరికి అభినందనలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సీనియర్ ఉద్యమకారులను గుర్తించి ఆర్థిక సహాయం, ఇంటి స్థలాన్ని ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని రామాచారి శ్యాం సుందర్ గౌడ్‌లు స్పష్టం చేశారు. అదే విధంగా కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు క్రియాశీలక అర్హులైన ఉద్యమకారులకు కూడా 250 స్థలాన్ని ఇవ్వాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

'సీపీఐ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి'



నవతెలంగాణ-హయత్‌నగర్

సీపీఐ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షులు సామిడి శేఖర్ రెడ్డి కోరారు. భవన నిర్మాణ కార్మిక సంఘం హయత్ నగర్ మండల అధ్యక్షులు చెంది వెంకట్ ఆధ్వర్యంలో హయత్ నగర్‌లో ఉన్న లేబర్ అడ్డా మీద నిర్వహించిన సీపీఐ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు రమావత్ సక్రు నాయక్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100 సంవత్సరాలు చరిత్ర కలిగినటువంటి పార్టీ భారతదేశంలో ఏదైనా ఉందంటే అది భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ అని చెప్పారు. నిరంతరం కార్మిక, కర్షక బడుగు, బలహీన, అట్టడుగు ప్రజల అభ్యున్నతి కోసం.. దేశ స్వాతంత్రం మొదలుకొని నేటి వరకూ ప్రజల వెన్నంటి ఉండి వాళ్ళ సమస్యలను పరిష్కరించే దిశగా ఎన్నో పోరాటాలను చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు ఉప్పలయ్య, రమేష్, వినోద్, పార్వతి, ఎల్లమ్మ, సునీత, కనకయ్య శ్రీను, జంపన్న పాల్గొన్నారు.



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నాదర్‌గుల్ శివాలయంలో సన్నిధాన స్వాముల ఇరుముడులు, పూజ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, కార్పొరేటర్ నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, కో ఆప్షన్ సభ్యులు మర్రి జగన్మోహన్ రెడ్డి, నాదర్‌గుల్ రైతు సహ కార సంఘం బ్యాంకు వైస్ చైర్మెన్ బంగారి బాబులు, మహేశ్వరం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్ యాదవ్, నాయకులు బంగారి అశోక్, గడ్డం భాస్కర్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, మురళీమోహన్, నర్సింగ్ పాల్గొన్నారు.

19న సీపీఐ(ఎం)
తుర్కయంజాల్ మున్సిపల్ ప్రథమ మహాసభ

సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యాదయ్య



నవతెలంగాణ-తుర్కయంజాల్

భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సీపీఐ(ఎం) తుర్కయంజాల్ ప్రథమ మహాసభను ఈ నెల 19న తుర్కయంజాల్ పట్టణంలో నిర్వహించనున్నట్టు సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ పగడాల యాదయ్య తెలిపారు. ఆదివారం తుర్కయంజల్ మున్సిపాలిటీ సీపీఐ(ఎం) పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం రాగన్నగూడలోని పార్టీ కార్యాలయంలో మండల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పగడాల యాదయ్య మాట్లాడుతూ.. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి పార్టీ మహాసభలను నిర్వహించడం ఆనవాయితీ అని చెప్పారు. గడిచిన మూడు సంవత్సరాల కాలంలో పార్టీ నిర్వహించిన ప్రజా పోరాటాలు, ఉద్యమాలు పాలకవర్గాల విధానాలను సమీక్షించి భవిష్యత్తు మూడేళ్లలో తీసుకుపోయే కర్తవ్యాలపై చర్చించనున్నామని వివరించారు. గడచిన మూడు సంవత్సరాల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేకమైన విధానాలకు పాల్పడుతూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వక్తం చేశారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దాసోహమై కోట్ల రూపాయల సంపదనంతా కొల్లగొట్టి వారికి అప్పగించే విధంగా పాలకవర్గాలు ప్రయత్నించాయని ఆరోపించారు. మరో పక్క కార్మికులను శ్రమ దోపిడీ గురిచేస్తూ..కార్మిక చట్టాలను, హక్కులను కాలరాసి వారికి తీరని అన్యాయం చేశారని అన్నారు. అధికారం ఉన్నా లేకపోయినా నిరంతరం ప్రజా సమస్యలే ధ్యేయంగా పనిచేస్తున్న కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు రాబోయే రోజుల్లో ప్రజా పోరాటాలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. అందుకోసం జరిగే పార్టీ మున్సిపల్ ప్రథమ మహాసభలను పార్టీ సభ్యులు, సానుభూతిపరులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు, తుర్కయంజాల్ మున్సిపల్ కన్వీనర్ డి.కిషన్, నాయకులు ఐ.భాస్కర్, కె.శ్రీరామ్ మూర్తి, కె.అరుణ్ కుమార్, జే.ఆశీర్వాదం, పి.శ్రీను, పల్లె.కృష్ణ, బి.శంకరయ్య, కె.వెంకట కృష్ణ, డి.శ్రీధర్, యం.స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్యను పరిష్కారం చేయండి



కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి 16వ వార్డు వీకర్ సెక్షన్ కాలనీలో నెలకొన్న డ్రయినేజీ సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతకింది నవీన్ గౌడ్, జల్‌పల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ ఆదిల్లా మహేష్‌లు జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ వెంకట్రాంను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సమస్యపై వెంటనే స్పందించిన కమిషనర్.. ఆదివారం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మున్సిపాలిటీ సూపర్‌వైజర్ బుడుమల కుమార్ గాల్బర్ మిషిన్ సహాయంతో డ్రైనేజీలో పేరుకుపోయిన మట్టిని పూర్తిగా తొలగించి సమస్యను పూర్తిగా పరిష్కరించడం జరిగిందన్నారు. ఈ సమస్యపై గతంలో ఎన్నోసార్లు ప్రజా ప్రతినిధులకు అధికారుల దృష్టికి తీసుకపోయిన ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డ్రైనేజీ సమస్యను పరిష్కారం చేసిన కమిషనర్ వెంకట్రామ్‌కు కాలనీ వాసులు తరుపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

'లార్డ్స్ ఒలింపియాడ్'లో ఫుడ్ ఫెస్టివల్

చైర్మెన్ సిద్దాల బీరప్ప



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేటలోని లార్డ్స్ ఒలింపియాడ్ పాఠశాలలో 'ఫుడ్ ఫెస్టివల్' వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల ఆహార పదార్థాలు, ప్రదర్శనలు చూపరులను విశేషంగా ఆకర్షించాయి. అన్ని రకాల వంటకాలతో దాదాపు వందకు పైగా వివిధ వంటకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లార్డ్స్ విద్యా సంస్థల పాఠశాల చైర్మెన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మెన్ బెర్ల శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు జీవితం మీద సంపూర్ణ అవగాహన కోసం, అన్నిరంగాల్లో ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించటం, అన్ని రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లార్డ్స్ విద్యా సంస్థల డైరెక్టర్ సిద్దాల శ్రీలత, డీన్ సతీష్, ప్రిన్సిపాల్ బానూరు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'జనవరి 19న హలో మాదిగ-ఛలో హైదరాబాద్'



నవతెలంగాణ-హయత్‌నగర్

జనవరి 19న నిర్వహించనున్న హలో మాదిగ-ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మేడి పాపయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఎల్బీనగర్ ఉన్న మహనీయుల విగ్రహాల వద్ద రంగారెడ్డి జిల్లా కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా మేడి పాపయ్య మాట్లాడుతూ ఎల్బీనగర్ అధ్యక్షుడు పంతం ఉపేందర్ ఆధ్వర్యంలో నియోజకవర్గం నుండి మాదిగ, మాదిగ ఉప కులాలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎస్సీలను ఏబీసీడీగా విభజన చట్టం అసెంబ్లీలో తీర్మానం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జీడీ నర్సింహ, జాతీయ ప్రధాన కార్యదర్శి, సంగపాక ఏసోఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్, సుగుణమ్మ, రాష్ట మహిళా నాయకురాలు అంజమ్మ, యాదమ్మ, పోషమ్మ, నర్సిమ్మ, రంగారెడ్డి జిల్లా ఇంచార్జి, సంపత్ రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, రామస్వామి రాష్ట్ర సహాయ కార్యదర్శి, సైదులు, ప్రధాన కార్యదర్శి జిల్లా ముత్యాలు, రవి పాల్గొన్నారు.



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజక వర్గం మహేశ్వరం మండల కేంద్రంలో ఇమ్మడి శ్రీహరి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీజేవైఎం అధ్యక్షులు వనంపల్లి శ్రవణ్, బీజేపీ సీనియర్ నాయకులు గుర్రం యాదయ్య, ఇమ్మడి వీరేష్, రాఘవేందర్, చింటూ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజక వర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్



నాదర్గుల్ గ్రామంలోని అంగడి వీరభద్ర సన్నిధానంలో నిర్వహించిన ఇరుముడి పూజకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, గూడెపు ఇంద్రసేన, కార్పొరేషన్ బీజేవైఎం అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు నిమ్మల రవికాంత్ గౌడ్, యాతం వెంకటేష్, గడ్డం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అందరినీ సమానంగా చూసేది కాంగ్రెస్



కేఎల్ఆర్

నవతెలంగాణ-బడంగ్‌పేట్

అన్ని కుల, మతాలను సమానంగా చూసే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట కార్పొరేషన్ నాదర్‌గుల్‌లో పాస్టర్ సాయిలు ఆధ్వర్యంలో బియుపిఏ ప్రీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కేఎల్ఆర్ హాజరై మాట్లాడారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ బాయ్... బాయ్ అనే సిద్ధాంతాన్ని దేశానికి హస్తం పార్టీ నేర్పిందని గుర్తుచేశారు. కొన్ని పార్టీలు మత రాజకీయాలు చేస్తూ... దేశ పౌరుల మధ్య చిచ్చు పెట్టే కుట్రలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 25న క్రిస్మస్ వేడుకలను తుక్కుగూడ కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించి, మత సామరస్యాన్ని చాటుతామని తెలిపారు. ఏ ఒక్కరి మనోభావాలు దెబ్బ తినకుండా అందరి దేవుళ్లను సమానంగా గౌరవిస్తామన్నారు. రంగారెడ్డి జిల్లా నుంచి వచ్చిన క్రైస్తవ సోదర సోదరీమణులకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'మధుయాష్కీ జన్మదిన వేడుకల్లో సేవా కార్యక్రమాలు'



నవతెలంగాణ - దిల్‌సుఖ్‌నగర్

మాజీ పార్లమెంటు సభ్యులు మధుయాష్కీ గౌడ్ జన్మదిన వేడుకలు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను ఆదివారం నిర్వహించామని హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపాటి రామారావు తెలిపారు. శాంతినికేతన్ మానసిక వికలాంగుల విద్యార్థులకు అన్నదానం చేయడం జరిగిందన్నారు. వృద్ధాశ్రమంలో వృద్దులకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. నవోదయ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, స్టేషనరీ, పండ్లు అందజేశామని డైరెక్టర్ నేలపాటి రామారావు తెలిపారు. ప్రమాదానికి గురైన ఒక పెయింటర్ కార్మికుడికి ఈ సందర్భంగా ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేసినట్టు తెలిపారు. ఈ సేవా కార్యక్రమాలకు ముందు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి.. కాంగ్రెస్ పార్టీ నేతలు రక్తదానం కూడా నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బుడ్డ సత్యనారాయణ, పాశం అశోక్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు కుట్ల నరసింహ, సీనియర్ కాంగ్రెస్ నేత మకుటం సదా శివుడు, మహిళా అధ్యక్షురాలు స్వర్ణ మాధవి, రత్నకుమారి, ఉమేష్ గౌడ్, బొంగు వెంకటేష్ గౌడ్, వినీష్ రెడ్డి, సుధీర్, శివప్రసాద్, విజయ్, రవికుమార్ చౌదరి, సుధీర్ రెడ్డి, నరేందర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



అనాథ పిల్లల మధ్య మధుయాష్కీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-హయత్‌నగర్



తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మెన్ మధు యాష్కీ గౌడ్ జన్మదిన వేడుకల సందర్భంగా హయత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు చెన్నగొని రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో అనాథ పిల్లలకు (help For Good Old age home) అన్నదానం చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా జిల్లా అధ్యక్షురాలు కళ్లెం సుజాత రెడ్డి, గోవర్ధన్, సూర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-హయత్‌నగర్

తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మెన్, ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మధుయాష్కీ గౌడ్ జన్మదిన వేడుకలను మన్సూరాబాద్ డివిజనల్ రాజ రాజేశ్వరి కాలనీలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి రెంటాల కృష్ణయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తర్వాత కేక్ కట్ చేశారు.



వేధింపుల కేసులో వ్యక్తి అరెస్టు



నవతెలంగాణ-హయత్‌నగర్

మైనర్‌ను వేధించిన కేసులో ఓ వ్యక్తి అరెస్టు అయిన ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా సాయి కృష్ణా నగర్ పోలేపల్లికి చెందిన సతీష్ అనే వ్యక్తి.. మన్సూరాబాద్‌కు చెందిన మైనర్ వెంటపడుతుండేవాడు. అంతేకాదు ఆ బాలిక తల్లిదండ్రులకు ఫోన్ చేసి వేదిస్తూ..రాత్రిపూట ఇంటి తలుపులు కొడుతూ ఆ బాలిక పేరును గట్టిగా అరుస్తూ పిలుస్తుండేవాడు. ఈ విషయంపై ఎల్బీనగర్ పోలీసులు అక్టోబర్ నెలలో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. నిందితుడు సతీష్ దుబాయ్‌కు పారిపోయాడు. కొన్ని రోజుల కిందట నిందితుడు దుబాయ్ నుండి వచ్చిన విషయం తెలుసుకున్న ఎల్బీనగర్ పోలీసులు.. నిందితుడిని ఆదివారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు వెల్లడించారు.

ఘనంగా సైనిక్‌పురి యోగా సెంటర్ 14వ వార్షికోత్సవం

● పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

భారతీయ యోగా సంస్థాన్ ఆధ్వర్యంలో సైనిక్‌పూరిలో ఏర్పాటు చేసిన యోగా సెంటర్ 14వ వార్షికోత్సవానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా అనేది మన ఆధ్యాత్మిక, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఒక అద్భుతమైన సాధనం అన్నారు. నిత్యం యోగా సాధన ద్వారా మన జీవనశైలిని మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఈడు కృష్ణ, సెంటర్ ఇన్‌చార్జి, జోన్ అధ్యక్షుడు శ్రీధర్, పురుషోత్తం, రాజేశ్వర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, రామ, తులసి తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ కోసం గొడవ.. యాసిడ్ తాగి యువకుడి మృతి



నవతెలంగాణ - జవహర్ నగర్

ఫోన్ కోసం గొడవ పడి ఓ యువకుడు యాసిడ్ తాగి మృతి చెందిన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీజేఆర్ నగర్‌కు చెందిన వెంకటేష్‌కు సాయికుమార్, సాయి కృష్ణ (18), రాకేష్ ముగ్గురు కుమారులు ఉన్నారు. శనివారం సాయంత్రం సాయికృష్ణ, తన తమ్ముడైన రాకేష్‌తో ఫోన్ కోసం గొడవపడ్డాడు. దీంతో తండ్రి వెంకటేష్ సాయికృష్ణను మందలించాడు. మనస్తాపం చెందిన సాయికృష్ణ శనివారం రాత్రి యాసిడ్ తాగడంతో వెంటనే లైఫ్ లైన్ హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. అక్కడి డాక్టర్ల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతిడి సోదరుడు సాయికుమార్ జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీస్‌లు దర్యాప్తు చేస్తున్నారు.

కరాటే ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది



నవతెలంగాణ-ఘట్కేసర్

కరాటే ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తుందని మేడ్చల్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. ఎదులాబాద్‌లోని డీఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో కేఎల్‌బీ అమికబుల్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన మొదటి జాతీయ ఓపెన్ తైక్వాండో పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి దాదాపు 500 మంది తైక్వాండోలో శిక్షణ పొందిన యువతీ యువకులు పోటీ పడుతున్న పోటీలు నిర్వహించడం గొప్ప పరిణామం అన్నారు. అదే విధంగా దేశంలో యువతీ యువకుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసి వారికి మెరుగైన శిక్షణ అందించడం ద్వారా వారు అంతర్జాతీయ వేదికలపై భారతదేశ పతాకాన్ని సగర్వంగా చాటి చెప్పే విధంగా తయారయ్యేందుకు ఇతోధికంగా కృషి చేస్తున్నఅకాడమీల కృషిని అభినందించాలన్నారు. మన పిల్లలను వారి ఆసక్తులకు అనుగుణంగా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

మహనీయులకు జ్ఞానమాల సమర్పణ



నవతెలంగాణ-కాప్రా

కాప్రా మండల పరిధిలోని జమ్మిగడ్డ ప్రాంతం బీజేఆర్ కాలనీలోని మహాత్మా జ్యోతిరావుపూలే, బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రావు విగ్రహాలకు జ్ఞానమాల టీం ఆధ్వర్యంలో ఆదివారం జ్ఞానమాల సమర్పించారు. ఈ సందర్భంగా జ్ఞానమాల టీం ఆర్గనైజర్ గగన్ కుమార్ మాట్లాడుతూ.. జ్ఞాన మాల కార్యక్రమం 133వ వారానికి చేరిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఏ.రహీమ్, నర్సింహ్మా చారి, నరేందర్ రావు, రవి నాయక్, దయానంద్, వెంకటయ్య, సూరిబాబు, నగేష్, స్వామి, జాన్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-కాప్రా

లయన్స్ క్లబ్ ఆఫ్ కాప్రా ఏఎస్‌రావు నగర్ చారిటబుల్ ఆధ్వర్యంలో ఏఎస్‌రావు, ఈసీ నగర్ లయన్స్ హాస్పిటల్‌లో డెంటల్ క్లినిక్, ఐక్లినిక్, ఆప్టికల్స్, ఫిజియో థెరపీ క్లినిక్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆ వైద్య శిబిరాన్ని లయన్స్ జిల్లా గవర్నర్ కృష్ణ ప్రసాద్‌తో పాటు కుషాయిగూడ స్టేషన్ ఏసీపీ మహేష్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ చుట్టు పక్కల కాలనీల ప్రజలకు వివిధ వైద్య సేవలను అందిస్తున్న ట్రస్ట్ సేవలను కొనియాడారు. పోలీస్ డిపార్ట్‌మెంట్ కూడా లయన్స్ సేవా కార్యక్రమాలలో పాలు పంచుకుంటామని తెలిపారు. డాక్టర్ అనిల్ బృందం కళ్ళ పరీక్షలు చేశారు. పద్మసాయి డెంటల్ క్లినిక్ డాక్టర్ దినేష్ బృదం దంతాల పరీక్షలు పరీక్ష చేశారు. డాక్టర్ చాముండేశ్వరి ఫిజియో థెరపీ పరీక్షలు, టెనెట్ డయాగ్నోస్టిక్స్ వారు రక్త పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా నాయకులు ఇన్నారెడ్డి ,కృష్ణా రెడ్డి ,శేఖర్ రెడ్డి, రూపారెడ్డి తోపాటు చర్లపల్లి సీఐ రవికుమార్, ఎస్ఐ శేఖర్, ట్రస్ట్ చైర్మెన్ విజయకుమార్, సెక్రటరీ వరప్రసాద్, సురేష్ కుమార్, కేఎన్‌రెడ్డి, చందన్ రాజు,పిజె రెడ్డి, క్లబ్ సభ్యులు శ్రీనివాసరెడ్డి, మనోజ్, గణేష్, తదితరులున్నారు.

నేషనల్ ఐకాన్-2024 అవార్డును అందుకున్న మోమిన్ బాషా



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా ఆధ్వర్యంలో సాహితి అవార్డు గ్రహీత, కవి ఎలమంచిలి వెంకటరమణ చేతులమీదుగా హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా తెలంగాణ స్టేట్ అధ్యక్షులు మోమిన్ బాషా నేషనల్ ఐకాన్ అవార్డు -2024ను అందుకున్నారు. ఈ సందర్భంగా మోమిన్ భాషా మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ఈ అవార్డును అందజేశిన ఎలమంచిలి వెంకటరమణ, నేషనల్ ప్రెసిడెంట్ ఫౌండర్ అయ్యప్ప, నేషనల్ చైర్మెన్ ఫౌండర్ రాజాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా తెలంగాణ స్టేట్ చైర్మెన్ నారాయణ రెడ్డి, సౌత్ ఇండియన్ చైర్మెన్ ధనలక్ష్మి, ఆశ, భాగ్యలక్ష్మి, శ్రీలత, కృష్ణ, అక్బర్, శ్రీనివాస్ గౌడ్, సంగీత, సుధారాణి, దుర్గ, పద్మ, విశాల, వంశరాజ్ మల్లేష్, అంకుష్, చంద్రమౌళి, రఘు, గంగా, తదితరులు పాల్గొన్నారు.

డీజే సౌండ్‌లతో ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దు



● జవహర్ నగర్ సీఐ సైదయ్య

నవతెలంగాణ-జవహర్ నగర్

రాత్రి సమయంలో 10:30 గంటల తర్వాత నిబంధనలు అతిక్రమించి ఎవరైనా డీజే, బ్యాండ్ సౌండ్‌తో అధిక శబ్దాలు చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని జవహర్ నగర్ సీఐ సైదయ్య హెచ్చరించారు. జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలాజీ నగర్, వికలాంగుల కాలనీలో శనివారం రాత్రి మూడు గంటల సమయంలో నిబంధనలకు విరుద్ధంగా రాత్రిపూట అధిక శబ్దాలతో చుట్టుపక్కల వారికి ఇబ్బంది కలిగించడంతో స్థానికులు 100కు డయల్ చేశారు. వెంటనే పోలీసు వారు అక్కడికి చేరుకొని డీజే బండి యజమాని సంపత్, ఆర్గనైజర్ దేవయ్య(46)లపై బీఎన్ఎస్‌లోని సెక్షన్ 223(ఏ), 292 మరియు సెక్షన్ 21/76 సీపీ యాక్ట్ కింద కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరమ్మతు పనులు పరిశీలించిన జలమండలి ఎండీ

● యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు

● నీటి సరఫరా పునరుద్ధరణ





నవతెలంగాణ-సిటీబ్యూరో

రెడ్ హిల్స్ వద్ద ధ్వంసమైన 825 ఎంఎం డయా పీఎస్‌సీ గ్రావిటీ మెయిన్ పైప్‌లైన్ అత్యవసర మరమ్మతు పనులను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని అధికారుల ను అడిగి తెలుసుకున్నారు. పాడైన పైపులను అక్కడి నుంచి తరలించాలని సూచించారు. జలమండలి చేపట్టే మరమ్మతులు పైపు లైన్ విస్తరణ పనులు పూర్తయిన వెంటనే రోడ్డు మరమ్మతు పనులు నిర్వహించాలని ఆదేశించారు. కొత్తగా నిర్మించిన పైప్ లైన్ కు బలోపేతం చేయడానికి సరైన ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే నీటి సరఫరా, మురుగునీటి నెట్‌వర్క్ కోసం పైప్‌లైన్‌ల వివరాలను జీఐఎస్ నమోదు చేయాలని ప్రాజెక్టు అధికారుల ను ఆదేశించారు. జలమండలి రెడ్ హిల్స్ రిజర్వాయర్‌కు ఆసిఫ్ నగర్ ఫిల్టర్ బెడ్స్ నుంచి నీటి సరఫరా ధ్వంసమైన పైప్ లైన్‌కు యుద్ధ ప్రాతిపదికన మర మ్మతు పనులు ఆదివారం సాయంత్రం 4 గంటల వరకు వేగంగా పూర్తి చేశా రు. అనంతరం నీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో రెడ్ హిల్స్ రిజర్వాయర్ పరధిలోని అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా యథావిధిగా జరుగుతోంది.సకాలంలో మరమ్మతు పనులు చేపట్టి నీటి సరఫరా పునరుద్ధరణ చేసిన అధికారులు, సిబ్బందిని ఎండీ అశోక్‌రెడ్డి అభినందించారు.

హింసకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

● ఐద్వా మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఎం. వినోద

● ఐద్వా మేడ్చల్ మండల కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-మేడ్చల్

మహిళలు హింసకు వ్యతిరేకంగా ఉద్యమించాలని, దేశంలో సగభాగం అయినా మహిళలు అన్ని రంగాలలో ఉంటున్నప్పటికీ పని ప్రదేశాలలో భద్రత కరువైందని ఐద్వా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఎం.వినోద అన్నారు. ఆదివారం మేడ్చల్ మండలంలోని ఆక్సిజన్ పార్కులో ఐద్వా మేడ్చల్ మండల నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఐద్వా మేడ్చల్ మండల అధ్యక్షురాలిగా గౌతమి, మండల ప్రధాన కార్యదర్శిగా అశ్విని, కోశాధికారిగా శ్రావణి, ఉపాధ్యక్షురాలిగా లత, సహాయ కార్యదర్శిగా జ్యోతిలను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా పల్లవి, డాలి, స్వరూప, బాలమణి, భాషమ్మ, లూదియలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి ఎం.వినోద మాట్లాడుతూ చిన్నపిల్లల నుండి ముసలి వాళ్ల వరకు అత్యాచారాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. ఇవి పెరగడానికి మద్యం, డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాలు కారణం అన్నారు. వాటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. వీటిని అరికట్టాలని ఐద్వా డిమాండ్ చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలైన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని తెలిపారు. నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్ష-కార్యదర్శులు మాట్లాడుతూ.. మండలంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపైన పోరాటం చేస్తామని, మహిళలకు ప్రత్యేక రక్షణ కోసం చట్టాలను పకడ్బందీగా అమలు చేయడం కోసం పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

గ్రూప్-2 పరీక్షలు పరిశీలన



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఘట్కేసర్ మండలంలోని ఏదులాబాద్‌లో గల ఏసీ ఇంజినీరింగ్ కాలేజ్, మెగా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్స్ కాలేజ్‌లో జరుగుతున్న గ్రూప్-2 పరీక్షల నిర్వహణను ఆదివా రం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్ష ప్రశాంతంగా జరుగు తుందా..? సీసీ కెమెరాలు పని చేస్తున్నాయా..? అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష గదుల్లో తిరిగి పరీక్షల నిర్వణ తీరును పరిశీలించారు. కలెక్టర్ వెంట కాలేజీ ప్రిన్సిపాల్, ఎగ్జామ్స్ కంట్రోలర్, పోలీసు అధికారులు ఉన్నారు.

మెగా మహిళా డిగ్రీ కాలేజ్‌లో..



గ్రూప్-2 పరీక్షల నేపథ్యంలో ఆదివారం ఉప్పల్‌లోని రామంతపూర్‌లో గల మెగా మహిళా డిగ్రీ కాలేజ్, వాగ్దేవి డిగ్రీ కాలేజ్‌ల్లో జరుగుతున్న పరీక్ష నిర్వహణను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరగాలనీ, పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. జిరాక్స్ షాపులు మూసే ఉన్నాయా..? అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

● ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మల్కాజిగిరి సర్కిల్ గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని భవానీ నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యతిథులుగా ఎమ్మెల్యే, స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా భవానీనగర్ కాలనీలో బోరు వాటర్, మంచినీరు, తదితర మౌలిక వసతులు కల్పించాలని భవానీ నగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు వారికి వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..డివిజన్ పరిధిలోని కాలనీ వాసులు, సంక్షేమ ప్రతినిధులు తమ సమస్యలను తమ దృష్టికి తెస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, బైరు అనిల్, భవానీ నగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం



● మూఢనమ్మకాల నిర్మూలన సంఘం

నవతెలంగాణ- మేడ్చల్

పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం జిల్లా అధ్యక్షు లు భూమిగారి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మేడ్చల్‌లోని ఆక్సిజన్ పార్కులో పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని సేవ్ ద నేచర్ లవ్ ద నేచర్ అనే నినాదంతో సమావేశం నిర్వహిం చుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మూఢన మ్మకాల నిర్మూలన సంఘం మేడ్చల్ జిల్లా నాయకులు అధ్యక్షులు భూమిగారి చంద్రశేఖర్, మన్నె ప్రశాంత్, శంకరన్న, నాగరాజు, గిరీష్, యోగి నాయక్, చరణ్, వెంకటేష్, మహిళా అధ్యక్షురాలు అశ్విని, లుదియా, శిల్పల ఆధ్వర్యంలో ప్రకృతిని రక్షించాలని ప్లకార్డ్స్ పట్టుకొని ఆక్సిజన్ పార్కులో ఉదయం నుండి సాయంత్రం వరకు పార్కుకు వచ్చిన విహార యాత్రికులకు అవగాహన కల్పించారు. ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు, మహనీయుల పుస్తకాలను అందజేశారు.

శరీరానికి ఫిట్‌నెస్ ఎంతో అవసరం



● మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

నవతెలంగాణ-కీసర

దేహ దారుఢ్యానికి ఫిట్‌నెస్ ఎంతో ఉపయోగమని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. ఆదివారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఎల్ నగర్‌లో 'అభి ఫిట్ నెస్ జిమ్'ను నాగారం మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ శరీర ఆరోగ్యం కోసం జిమ్ చేయడం వలన శరీరం దేహ దారుఢ్యంతో బలంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అభిఫిట్‌నెస్ జిమ్ నిర్వాకులు అభిషేక్ నాగారం మున్సిపల్ వైస్ చైర్మెన్ మల్లేష్ యాదవ్, నాగారం మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తేర్ల శ్రీధర్, నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాసరెడ్డి, నాయకులు అన్నం రాజు శ్రీనివాస్, జగన్మోహన్ రెడ్డి, మాజీ వార్డ్ మెంబర్ సాయినాథ్ గౌడ్, శ్రీకాంత్ యాదవ్, నాయకులు జిమ్ము యజమాన్యం పాల్గొన్నారు.



కుషాయిగూడ బస్టాండ్‌లో హనుమాన్ విగ్రహం ఆవిష్కరణ



నవతెలంగాణ - చర్లపల్లి

కుషాయిగూడ హనుమాన్ విగ్రహ నిర్మాణ సమితి, బజరంగ్‌దళ్ సంయుక్త ఆధ్వర్యంలో కుషాయిగూడ బస్టాండ్‌లో నిర్మించ తలపెట్టిన 36 అడుగుల భారీ హనుమాన్ విగ్రహాన్ని పోలిన నమూనా విగ్రహాన్ని గ్రామస్తులు సామూహికంగా ఆవిష్కరించారు. కుషాయిగూడ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి నమూనా విగ్రహానికి వేద పండితులు ఆదివారం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఓంకారంతో ఆంజనేయ నామాలను జపిస్తూ భజనలు చేశారు.

ఈ సందర్భంగా హనుమాన్ విగ్రహ నిర్మాణ సమితి ప్రతినిధులు మాట్లాడుతూ.. కుషాయిగూడ బస్టాండ్‌లో 36 అడుగుల భారీ హనుమాన్ విగ్రహ నిర్మాణానికి పనులను ప్రారంభించినట్టు తెలిపారు. నమూనా విగ్రహం మాదిరి 36 అడుగుల భారీ హనుమాన్ విగ్రహాన్ని కళాకారులు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు స్వచ్ఛందంగా విరాళాలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

కిష్టాపూర్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు నివాళి

● హాజరైన వివిధ పార్టీల నేతలు

నవతెలంగాణ-మేడ్చల్

ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా ఆదివారం మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కిష్టాపూర్ అర్చన కాలనీలో ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు పి.విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానా న్ని భారతదేశంలో విలీనం చేసేందుకు సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎనలేని కృషి చేశారని కొనియాడా రు. సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు చిరస్మరణీయమని అన్నారు. నిజాం నవాబును తన సైన్యంతో ఓడించి హైదరాబాద్‌ను విలీనం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు కొండం ఆంజనేయులు ముదిరాజ్, అర్చన కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు జనార్దన్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి సుధాకర్ చారి, ఉపాధ్యక్షులు బుచ్చి రాములు, బీజేపీ నాయకులు ప్రభాకర్ రెడ్డి,కిషన్ రావు, ప్రేమ్ కుమార్, హరిబాబు రెడ్డి, వేముల సత్య నారాయణ రెడ్డి, ఇంద్రారెడ్డి, రాజు, రామ చంద్రారెడ్డి, కాలనీవాసులు హనుమంత్ రెడ్డి, గంగయ్య, మన్మథరావు, కమలాకర్ రెడ్డి, మోహన్ గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బాలసుబ్రహ్మణ్యం పాటలు అజరామరం



నవతెలంగాణ-కల్చరల్

విఖ్యాత గాయకుడు ఘంటసాల స్థానాన్ని భర్తీ చేసిన బాలసుబ్రహ్మణ్యం భిన్న భాషా చిత్రాలలో పాడి తన పేరు చిరస్థాయిగా నిలుపుకొన్నారని విదేశీ ఆంధ్రులు పేర్కొన్నారు. బాలు పాటలు అజరామరం అని చెప్పారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై అర్ధ శతాబ్ది స్వచ్ఛంధ సాంస్కృతిక సంస్థ వంశీ ఆర్ట్స్ థియేటర్స్ వంశీ కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వహణలో మర్యాద రామన్న సినిమాలో బాలు తొలి పాటతో సినీ రంగ ప్రవేశం చేసిన సందర్భంగా వైఎస్ రామ కృష్ణ బృందంచే బాలు పాటకు పట్టాభిషేకం పేరిట సినీగాన లహరి జరిగింది. రామ కృష్ణతో పాటు డాక్టర్ శంకర్, రవీంద్ర నాథ్, మణి బాబు, రమణ మూర్తి, వీణ, రాధా, రాణి, పద్మశ్రీ, శ్యామల తదితరులు సోలో యుగళ గీతాలలో పాలు పంచుకున్నారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఉగాండా నుంచి వంశీ ఫెస్టివల్స్ చైర్మెన్ డాక్టర్ బి.వ్యాస కృష్ణ దోహా (ఖతార్), నివాసి రచయిత్రి డాక్టర్ వెంకట మాధవీ లతలు పాల్గొని రామ కృష్ణను బాల సుబ్రహ్మణ్యం సంగీత పురస్కారంతో సత్కరించారు.

అక్రమ పార్కింగ్, ఫుట్ పాత్‌లు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

గౌలిగూడ పుత్లీబౌలీ చౌరస్తా వద్ద గల అమృత బార్ పక్కన, ట్రూప్ బజార్ రోడ్లపై అక్రమ పార్కింగ్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆనంద్ కుమార్ గౌడ్ అన్నారు. సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంబాబును మర్యాద పూర్వకంగా కలిసి అక్రమ పార్కింగ్, ఫుట్ పాత్‌పై ఇష్టానుసారంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో భజన్ సింగ్, మహేష్ గౌడ్, కరేష్ గౌడ్, విజయ్ ముదిరాజ్, రాము, గిరీష్ పాల్గొన్నారు.

'సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి'



- పే స్కేల్ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి
- బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

గత ఇరవై ఏండ్లుగా పాఠశాల విద్య అభివృద్ధి కోసం పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్షలోని అన్ని విభాగాలలో దాదాపు 19,600 మంది కాంట్రాక్టు ఉద్యోగులు పని చేస్తున్నారని, ఏండ్ల తరబడి వారు చాలీచాలని వేతనంతో జీవితాలు నెట్టుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులు ఉండనివ్వమని, అందరిని రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడు వారి సమస్యలు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఎన్నో ఏండ్లుగా పరిష్కారానికి నోచుకోని ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తున్నారని, అదే విధంగా సమగ్ర శిక్ష ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఈ సమగ్ర శిక్ష కార్యక్రమం ప్రారంభమైందని, ఇపుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పే స్కేల్ ఇస్తున్నారని, తెలంగాణలో అమలు చేసి వారిని ఆదుకోవాలని కోరారు. తమ విధులనే కాకుండా ప్రభుత్వం అప్పగిస్తున్న ప్రతి పనిని సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే విధులు నిర్వహిస్తున్న వారికి పనికి తగిన వేతనం అందడం లేదన్నారు. ప్రతి ఉద్యోగికి రూ.10 లక్షల జీవిత బీమాతో పాటు ఆరోగ్య బీమా రూ.10 లక్షల సౌకర్యం కల్పించాలని, ఎస్ఎస్ఏ ఉద్యోగులు పదవీ విరమణ చేస్తున్న వారికి, చేసిన వారికి బెనిఫిట్స్ కింద రూ.25 లక్షలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ, విద్యాశాఖ నియామకాల్లో వీరికి వెయిటేజ్ కల్పించాలన్నారు. ప్రభుత్వం పాఠశాల విద్య అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని, సమగ్ర శిక్ష ఉద్యోగులతో వెంటనే చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరిస్తుందన్న నమ్మకం తమకుందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సలహాదారులు పి.బడేసాబ్, గాలిగల్ల సాయిబాబా, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఇంద్రకంటి సరిత, వర్కింగ్ ప్రెసిడెంట్ నవనీత, కోశాధికారి శ్రీవాణి, రమ్య, ఫరీన్, గిరిజా భవాని, మధురవాణి, మోహన్, సరస్వతి, షేక్ పాషా తదితరులు పాల్గొన్నారు.

విప్లవోద్యమం రూపశిల్పి 'కొండపల్లి'

తెలంగాణ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మెన్ అల్లం నారాయణ

నవతెలంగాణ-ముషీరాబాద్

విప్లవోద్యమం నిర్మాత కొండపల్లి సీతారామయ్య రచనలు వెలుగులోకి రావడం హర్షనీయమని తెలంగాణ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మెన్ అల్లం నారాయణ అన్నారు. ఆదివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కొండపల్లి సీతారామయ్య సంపూర్ణ రచనల ఆవిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. కెయస్‌గా సుపరిచితమైన కొండపల్లితో కలిసి పనిచేయడం తన లాంటి వాళ్ళ జీవితంలో ఎప్పటికీ మరవలేనిదన్నారు. తొలిదశ తెలంగాణ ఉద్యమం 1969లో ప్రారంభమైతే దానికి ఆదిలోనే మద్దతు నిలిచి పీపుల్స్ వార్ పార్టీగా తన శ్రేణులను సన్నద్ధం చేశారని గుర్తు చేశారు. గ్రామాలకు తరలండి, జగిత్యాల జైత్రయాత్ర వంటి బృహత్తర కార్యక్రమాల రూపశిల్పి కొండపల్లి అని ఆయన గుర్తు చేశారు. ఇవాళ ఆ గ్రామాలకు తరలండి కార్యక్రమాల ద్వారా ప్రజల సమస్యలని అర్థం చేసుకున్న విద్యార్థి యువకులు ఇవాళ దండకార్యంలో విప్లవోద్యమాన్ని నిర్మాణం చేశారన్నారు. దేశ చరిత్రలో ఇంతటి మహోజ్వల పోరాటాన్ని కొండపల్లి సారథ్యంలోని నిర్మాణం జరిగిందని గుర్తు చేశారు. డా.శ్రీనివాస్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో విరసం సీనియర్ నాయకురాలు కృష్ణాబాయి కొండపల్లి సీతారామయ్య రచనలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో హైకోర్టు న్యాయవాది శివాజీ, సామాజిక కార్యకర్త సుధాకర్, రచయిత ఈ.ఎ.కె.ప్రభాకర్, ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, సాంబమూర్తి, మా భూమి సంధ్య, జర్నలిస్టు తాయమ్మ కరుణ, తదితరులు పాల్గొన్నారు.



చలికాలంలో ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలి

- డాక్టర్ ప్రత్యూష..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

గత రెండు మూడు రోజులుగా చలి తీవ్రత పెరిగింది. ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని గడికాన బస్తీ దవాఖాన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రత్యూష అన్నారు. ఆదివారం బస్తీ దవాఖానాలో మాట్లాడుతూ.. రోజురోజుకు పెరుగుతున్న చలి తీవ్రతతో శ్వాసకోశ వ్యాధులు ప్రబలే అవకావం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. చలికాలంలో వృద్ధులు, చిన్నారులు బయట తిరగకపోవడం మంచిదన్నారు. తప్పనిసరైతే తలకు మఫ్లర్, మంకీ టోపీలు, ముఖానికి మాస్కులు ధరించి బయటకు రావడం మంచిదంటున్నారు. ఇంటి పరిసరాల శుభ్రత చాలా ముఖ్యమని, పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో దోమలు వ్యాప్తిచెంది టైఫాయిడ్, డెంగీ, చికెన్‌గున్యా, మెదడువాపు, విషజ్వరాలు బారిన పడే ప్రమాదం ఉంటుందన్నారు. గాలి ద్వారా స్వైన్ ఫ్లూ వంటి ప్రమాదకరమైన వ్యాధులు సోకే అవకాశాలు ఉంటాయని తెలిపారు. చలికాలంలో ప్రతి ఒక్కరూ సరైన జాగ్రత్తలు పాటించాలన్నారు. చిన్నారులు, వృద్ధులు, అస్తమా రోగులు, చల్లగాలిలో, మంచుపట్టిన సమయంలో బయట తిరగడం మంచిదికాదని సూచించారు. ముఖ్యంగా చలికాలంలో ఏసీలు, ప్యాన్లు, కూలర్లు వాడకం తగ్గించాలన్నారు. చర్మంపై అశ్రద్ధ వహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. చలికాలంలో బయట తిరగడంతో జలుబు, జ్వరం, ఫ్లూ వంటివి వ్యాధులు సోకిన వెంటనే వైద్యుని సంప్రదించాలని సూచించారు.

'సాటి కళాకారులను ప్రభుత్వ కార్యక్రమాలకు దూరం పెట్టడం భావ్యమా'

- తెలంగాణ సంగీత నాటక నాట్య కళాకారుల అసోసియేషన్, డెక్కన్ థియేటర్ స్కాలర్స్ అసోసియేషన్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మెన్, ప్రొఫెసర్ పుంజాల అలేఖ్య సాటి కళాకారులను ప్రభుత్వ కార్యక్రమాలకు దూరం పెడుతుందని, ఇది మీకు భావ్యమా అని తెలంగాణ సంగీత నాటక నాట్య కళాకారుల అసోసియేషన్, డెక్కన్ థియేటర్ స్కాలర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎండి.ఖాజా మన్సూర్ ఆమెను ప్రశ్నించారు. ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సగటు కళాకారుడి జీవితం నేటికీ దగాకు గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా చైర్మెన్ అలేఖ్య కోటి రూపాయల ప్రభుత్వ ప్రాజెక్టును బయట నుండి కొంత మందిని కిరాయికి తీసుకొచ్చి వాళ్లకు 4 రోజులు తర్ఫీదు ఇప్పించి 21 రోజులలో తెలంగాణ వివిధ జిల్లాలలో ప్రదర్శనలు చేయించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తొలి ఏడాది సంవత్సరం ముగించుకున్న సందర్భంగా సీఎం ప్రవేశపెట్టిన పథకాల ద్వారా ప్రజలు లబ్ధి పొందిన విధానం గురించి కళారూపంగా సంగీత నాటక కళాకారుల చేత ప్రజల ముందు ప్రదర్శించామని బాధ్యతలను సంగీత నాటక అకాడమీకి అప్పగించారని తెలిపారు. ఈ 21 రోజుల కార్యక్రమానికి బడ్జెట్ కోటి రూపాయలు కేటాయించారని కానీ గుట్టుచప్పుడు కాకుండా నిధులు దారి మళ్లించారని ఆరోపించారు. ఒక కళాకారిణిగా, ప్రొఫెసర్‌గా పని చేసి విశ్వవిద్యాలయ స్థాయిలో రిజిస్టర్‌గా పని చేసిన అలేఖ్య కాంగ్రెస్‌కి ఎంతో సేవ చేసిన గొప్ప కుటుంబం నుంచి వచ్చిన ఆమె సాటి కళాకారులను ప్రభుత్వ కార్యక్ర మానికి దూరం పెట్టడం భావ్యమా అని ప్రశ్నించారు. ఇదే విషయం వారికి విన్నవించడానికి వారి ఛాంబర్ కు వెళ్లిన డెక్కన్ థియేటర్ స్కాలర్స్ అసోసియేషన్ ప్రతినిధులను కనీసం కలవడానికి ఆమె ఇష్టపడలేదని వెల్లడించారు. ఈ అన్యాయాన్ని ముఖ్యమంత్రి, సదరు మంత్రి సమర్థిస్తున్నారా అని ఆయన ప్రశ్నించారు. ఈ విషయాన్ని సీఎం ఎ.రేవంత్ రెడ్డి పరిగణనలోకి తీసుకుని, కళాకారులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

మూసీ పునరుజ్జీవం పేరుతో మా బస్తీ జోలికి రావొద్దు

- సీపీఐ(ఎం) సౌత్ జిల్లా నాయకులు జి.విఠల్



నవతెలంగాణ-ధూల్‌పేట్

మూసీ పునరుజ్జీవం పేరుతో మా బస్తీ జోలికి రావొద్దని సీపీఐ(ఎం) సౌత్ జిల్లా నాయకులు జి.విఠల్ అన్నారు. జుమ్మెరత్ బజార్ అంబేద్కర్ నగర్ బస్తీ కమ్యూనిటీ హాల్‌లో బస్తీ జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడు తూ.. మూసీ రివర్ సుందరీకరణ పేరుతో ఎన్నో ఏండ్లుగా నివాసం ఉన్న అవాసలను తొలగించడం సరి కాదన్నారు. మా బస్తీ జోలికి వస్తే ఎంతకైనా పోరాడుతామన్నారు. పోరాడి మా బస్తీని నిల బెట్టుకుంటామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) నాయకులు పి.నాగేశ్వర్, ఎన్.శ్రీ రాములు బస్తీ నాయకులు పి. తిరుమలేశు, యాదగిరి, రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్షౌవరవృత్తికి ప్రభుత్వం జీఓ ఇవ్వాలి

- ఎన్‌బీజేజేపీఎస్ రాష్ట్ర కన్వీనర్ పి.వికాస్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నాయి బ్రాహ్మణులకు క్షౌవర వృత్తిపై ప్రభుత్వం జీఓ ఇవ్వాలని నాయి బ్రాహ్మణ జన జాగృతి పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ పి.వికాస్ అన్నారు. ఆదివారం హనుమాన్ టెక్డిలోని బీసీ భవన్‌లో ప్రతినిధుల్లో కలిసి భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయి బ్రాహ్మణులకు ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కల్లు గీత కార్మికులకు ఇచ్చిన విధంగానే క్షౌవరవృత్తి వారికి కూడా తమ వృత్తి తామే చేసుకునే విధంగా జీఓ ఇచ్చి చట్టబద్ధత కల్పించాలన్నారు. ఇతర కులస్తులు తమ వృత్తిలోకి వచ్చి ఉపాధి లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిగా ఉన్న నాయి బ్రాహ్మణులను ఐక్యం చేసేందుకు, జీఓ సాధనకై రథయాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాలయాల కళ్యాణ కట్టల్లో పనిచేస్తున్న నాయి బ్రాహ్మణులను నాలుగో తరగతి ఉద్యోగులుగా నియమించాలన్నారు. వారికి హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో మంగళ వాయిదా కళాశాలలు నెలకొల్పాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామాలలో, పట్టణాల్లో మంత్రసాని వృత్తి చేసే వారికి దాయమ్మలుగా వివిధ దవాఖానలలో నియమించాలని విజ్ఞప్తి చేశారు. యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ కట్టల్లో పని చేస్తున్న నాయి బ్రాహ్మణ మహిళలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. దేవాదాయ శాఖ నియమించే దేవాలయాల కమిటీల్లో నాయి బ్రాహ్మణులకు ఒక స్థానం కేటాయించాలన్నారు. క్షౌవరవృత్తిదారులు, మేధావులు, యువతి, యువకులు, నాయి బ్రాహ్మణ మహిళా సంఘాలు, ఉద్యోగస్తులు, మంగళ వాయిద్య కళాకారులు, వైద్యులు, లాయర్లు, వివిధ సంఘాల నాయకులు ఈ రథయాత్రకు కలిసి రావాలని కోరారు. వృత్తి రక్షణకై ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి తమ జాతి ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ జన జాగృతి పోరాట సమితి రాష్ట్ర కో- కన్వీనర్ ఎం.ప్రేమ్ కుమార్, ప్రతినిధులు మక్త శ్రీనివాస్, రాజేందర్, జితేందర్, మహేష్, హరిబాబు, రాకేష్, దుర్గాప్రసాద్ తదితరులున్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కింగ్ కోఠి భారతీయ విద్యా భవన్‌లో ఆదివారం నిర్వహించిన సెమీ క్రిస్టమస్ వేడుకల్లో పాల్గొన్న పాస్టర్ మోహన్ బాబు, హెచ్ వర్మ, ఆర్‌ఏ వినోద్ కుమార్, పాస్టర్ అశోక్ పాల్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

అమరజీవి పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి సందర్భంగా ఆదివారం గౌలిగూడలోని ప్రజాఏక్త పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ తదితరులు..

ఆర్థికసాయం అందజేత



నవతెలంగాణ-అంబర్‌పేట

అంబర్‌పేట డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్‌కు చెందిన రాఘవ అనే వికలాంగుడు ఇటీవల గుండుపోటుతో మరణించడంతో వారి సతీమణి రాధికకు రూ.50వేలను ఆర్థికసాయంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి భార్య కావ్యకిషన్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డివిజన్ అధ్యక్షులు నాగభూషణం చారి, సీనియర్ నాయకులు యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

సెపక్ తక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కార్యవర్గం ఎన్నిక

- నేషనల్ సెక్రటరీగా పెరిక సురేష్



నవతెలంగాణ-అంబర్‌పేట

గ్రామీణ స్థాయి నుంచి జాతీయ అంతర్జాతీయ స్థాయికి సెపక్ తక్రా క్రీడను మరింత విస్తృతం చేస్తామని సెపక్ తక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ సెక్రటరీగా పెరిక సురేష్ అన్నారు. సెపక్ తక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శిగా నూతనంగా పెరిక సురేష్ ఎన్నికైయ్యారు. ఆదివారం న్యూఢిల్లీలో జరిగిన యానివల్ జనరల్ బాడీ మీటింగ్‌లో నూతన జాతీయ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఫెడరేషన్ జాతీయ అధ్యక్షునిగా యోగేంద్రసింగ్ దయాను ఎన్నుకోగా, సెక్రటరీగా పెరిక సురేష్ ఎన్నికైయ్యారు. సురేష్ తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నారు. ఈ కార్యక్రమంలో గోవా మాజీ డిప్యూటీ సీఎం చంద్రకాంత్ కల్వేకర్, వైఎస్ ప్రెసిడెంట్ నరేష్ కుమార్, ఇంటర్నేషనల్ వైఎస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్ఆర్ ప్రేం రాజ్ ఎన్నికల అబ్జర్వర్‌గా వ్యవహరించారు. ఇంటరేషనల్ సెపక్ తక్రా ఫెడరేషన్(ఐఎస్‌టీఏఎఫ్) జనరల్ సెక్రటరీ దటుక్ అబ్దుల్ హలీమ్ బిన్ కదర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీ. శ్రీనివాసులు, తెలంగాణ సెక్రటరీ బీ శ్రీనివాస రెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్భంగా పెరిక సురేష్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి జాతీయ అంతర్జాతీయ స్థాయికి సెపక్ తక్రా క్రీడను ప్రజల్లోకి తీసుకువెళ్లి యువతను ప్రోత్సహిస్తామని తెలిపారు.

వీరశైవ లింగాయత్ లింగ బలిజలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



- ఓబీసీ జాబితాలో చేర్చాలి
- వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పటోళ్ల సంగమేశ్వర్

నవతెలంగాణ-ముషీరాబాద్

వీరశైవ లింగాయత్ లింగ బలిజలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఓబీసీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పటోళ్ల సంగమేశ్వర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ శివప్ప, సిద్దుల బాలకృష్ణ, నాయకోటి ప్రభు, మర్రి ఈశ్వరప్పల సంతాప సభ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు హాజరై నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వీరశైవ లింగాయత్ లింగ బలిజల నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమం ఎంతో ఘనంగా నిర్వహిస్తామని ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తామన్నారు. అన్ని సంఘాలు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి అన్ని సంఘాలను కలుపుకొని ఒక స్పష్టమైనటువంటి ప్రణాళికతోని కార్యక్రమం చేయడానికి ముందు పోతున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 45 లక్షల జనాభా ఉన్నటువంటి వీరశైవ లింగాయత్ లింగ పరిషత్ లకు పెద్దపీట వేస్తూ కేటాయించిన కమిటీని పూర్తిస్థాయిలో ప్రకటించి బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ ముఖ్యంగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మమ్మల్ని ఓబీసీ జాబితాలో చేర్చి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. త్వరలోనే రాష్ట్రంలో నుండి 25 కులాల ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వన్నె ఈశ్వరప్ప, ప్రధాన కార్యదర్శి దినేష్ పాటిల్, సెంట్రల్ కమిటీ సభ్యులు శెట్టి శివకుమార్, మల్లికార్జున అప్ప, మహిళా అధ్యక్షులు శెట్టి శ్రావణి, అశ్విని, తదితరులున్నారు.

వికలాంగులకు ఉచిత పరికరాల పంపిణీ



నవతెలంగాణ-అంబర్‌పేట:

సికింద్రాబాద్ పార్లమెంటు సభ్యులు కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో వికలాంగులకు సహాయ పరికరాలు ఉచిత పంపిణీ కొరకు అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలోని వికలాంగుల (అసెస్మెంట్ క్యాంప్) అంబర్‌పేట మున్సిపల్ మైదానంలో నిర్వహించిన కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. అధిక సంఖ్యలో వికలాంగులు పాల్గొని వారికి కావాల్సిన పరికరాల కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ అలింకో అధికారులకి తమ అవసరాలకు సంబంధించి విజ్ఞాపన చేయడం జరిగింది. వారు వివిధ రకాలుగా పరిశీలించి వారికి తగ్గట్టుగా పరికరాలను మంజూరు చేశారు. బ్యాటరీ ట్రైవెహికల్స్, చెవులకు సంబంధించినటువంటి పరికరాలు, ఆర్టిఫిషియల్ లిమ్స్, వీల్ చైర్స్, స్టిక్స్, గుడ్డి వారికి సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ స్టిక్స్ పరికరాలను మంజూరు చేసిన వాటిని అతి తొందరలో లబ్ధిదారులకు పరికరాలను చేకూరే విధంగా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటీవీ సంస్థల చైర్మెన్ జి.కావ్య కిషన్ రెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, మాజీ మంత్రి సి.కృష్ణ యాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్, కార్పొరేటర్లు ఉమా రమేష్ యాదవ్, అమృత, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం సంయుక్త కన్వీనర్ ఏడెల్లి అజయ్ కుమార్ నగర బీజేపీ ప్రధాన కార్య దర్శి కృష్ణ గౌడ్, నగర బీజేపీ ఉపాధ్యక్షులు రమేష్ యాదవ్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ శ్యామ్‌రాజ్, కేసరి నర సింహారావు యాదవ్, డివిజన్ బీజేపీ అధ్యక్షులు దాసోజు నాగభూషణం చారి, మూల రవీందర్ గౌడ్, ప్రవీణ్, పి నాగరాజు చారి, ఎ.యశ్వంత్, వెంకట స్వామి గౌడ్, మైలారం రాజు, వెంకటస్వామి గౌడ్, దయాకర్ యాదవ్, రవి యాదవ్, బాలకృష్ణ గౌడ్, అయోధ్య రాములు, భాస్కర్ గౌడ్ ఎస్ ఎస్ రెడ్డి, జ్యోతి, కవిత, రత్నప్రభ, సునంద, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- సాయి దత్త ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ధనంజయ



నవతెలంగాణ-అంబర్‌పేట

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సాయి దత్త ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ధనంజయ అన్నారు. ఆదివారం సాయి దత్త ఆస్పత్రిలో డాక్టర్ కె.శైలజ గైనకాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత హెల్త్ క్యాంపును మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ధనంజయ ప్రారంభించారు. మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల వల్ల అనారోగ్యం బారి న పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాటిపై ప్రజలు అప్రమత్తంగా ఉం డాలని ఆస్పత్రిలో నిర్వహించిన ఉచిత హెల్త్ క్యాంపు సుమారు 200 మంది రావడంపై హర్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ ఇన్‌చార్జి డాక్టర్ కుమార్, కోఆర్డి నేటర్ ప్రముఖ సంఘ సేవకులు బోనం వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న ఉత్సవాల ఏర్పాట్ల సమావేశంలో తీవ్ర రసాభాస

- వాగ్వివాదం ఒకరిపై ఒకరు ఆరోపణలు ప్రత్యారోపణలు
- అలిగి వెళ్లిపోయిన ఎంబీసీ కులాల చైర్మెన్ జైపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

వడ్డే ఓబన్న ఉత్సవాల ఏర్పాట్ల సన్నాహక సమావేశంలో తీవ్ర రసాభాస చోటుచేసుకుంది. నాయకులు పరస్పరం ఒకరికొకరు ఆరోపణలు ప్రతి ఆరోపణలతో సభా ప్రాంగణాన్ని రణరంగంగా మార్చారు. ఈ హఠాత్కర సంఘటనతో ఎంబీసీ కులాల చైర్మెన్ జైపాల్ అసంతృప్తికి లోనై అలిగి వెళ్లిపోయారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వడ్డే ఓబన్న ఉత్సవాల ఏర్పాట్ల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంబీసీ కులాల చైర్మెన్ జైపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో నాయకుల మధ్య సమన్వయంలోపించి పరస్పరం ఒకరికొకరు ఆరోపణలు చేసుకున్నారు. చైర్మెన్ ముందే ఒకరికొకరు ఆరోపణలు చేసుకోవడంతో వారిని వారించాలని ఎంత ప్రయత్నించినా నాయకులు ఎంతకు వినకపోవడంతో తీవ్ర అసహనానికి లోనయ్యారు. ఒక్కనొక సమయంలో చైర్మెన్‌గా ఉండి మీరు ఏం సాధించారని ప్రశ్నించే ప్రయత్నం చేయగా చైర్మెన్ జైపాల్ అక్కడ నుంచి వెళ్లిపోయారు.

బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుంది

- దొంతి రాజేష్ కన్నా
- ముగిసిన టీయూసీఐ మహాసభలు



నవతెలంగాణ-ముషీరాబాద్

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడవ సారి అధికారంలోకి వచ్చాక కూడా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని టీయూసీఐ జాతీయ కార్యదర్శి దొంతి రాజేష్ కన్నా విమర్శించారు. బడా కార్పొరేట్ కంపెనీలకు అనుకూల నిర్ణయాలు తీసుకుంటూ ప్రభుత్వ కంపెనీలను విస్మరిస్తుందని విమర్శించారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో మూడు రోజులపాటు జరిగిన టీయూసీఐ మహాసభలు ముగిశాయి. ఈ సందర్భంగా దొంతి రాజేష్‌కన్నా మాట్లాడుతూ.. కార్పొరేట్ సంస్థలకు అనుకూలమైన చట్టాలను కేంద్ర ప్రభుత్వం రూపొందించడం అత్యంత బాధాకరమన్నారు. ఇందులో భాగంగానే కార్మికవర్గాలను సమైఖ్య పరిచి తమ పోరాటాలను ఉదృతం చేస్తామన్నారు. టీయూసీఐ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రెడ్డి కె.థాజత్ మాట్లాడుతూ.. కార్మికులు అంతర్జాతీయంగా పోరాడి సాధించుకున్న చట్టాలు, హక్కులను నిర్వీర్యం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. పనిగంటలు, యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కు, కనీస వేతనాల చట్టం, భద్రత హక్కులు, ఫ్యాక్టరీ చట్టాలను నిర్వీరియం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మళ్లీ హక్కులను సాధించేకునేందుకు సమరశీల పోరాటాలకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చార్లెస్ జార్జి, కార్యదర్శులు బన్సోడే, మారీదు ప్రసాద్ బాబు, బుద్రి ప్రసాద్ మిశ్రా, కోశాధికారి టి.బి. మినీ, రాకేష్ వర్మం తదితరులు పాల్గొన్నారు. అనంతరం 25మందితో కేంద్ర కమిటీ, 21మందితో జనరల్ కౌన్సిలర్స్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన కాలనీ ప్రెసిడెంట్



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు నాలుగో వార్డ్ ఎల్ఐసీ కాలనీ అధ్యక్షుడు దుబ్బాక కిషన్‌రావు ఆదివారం ఎమ్మెల్యే శ్రీ గణేష్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ గణేష్ కిషన్ రావుకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కిషన్ రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గంలో ఎమ్మెల్యే శ్రీ గణేష్ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు చెప్పారు.

10

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్

సోమవారం | డిసెంబర్ 16, 2024 | www.navatelangana.com

సీజన్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- డాక్టర్ ధనుంజయ



నవతెలంగాణ-అంబర్‌పేట

సీజన్ వ్యాధుల పట్ల ప్రజల ప్రభుత్వంగా ఉండాలని సాయి దత్త హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ధనంజయ అన్నారు. ఆదివారం సాయి దత్త హాస్పిటల్‌లో డాక్టర్ కె.శైలజ గైనకాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత హెల్త్ క్యాంపును మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ధనంజయ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాతావరణంలో మార్పుల వల్ల అనారోగ్యం బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. హాస్పిటల్లో నిర్వహించిన ఉచిత హెల్త్ క్యాంపు సుమారు 200 మంది రావడంపై హర్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ ఇన్‌చార్జ్ డాక్టర్ కుమార్, కోఆర్డినేటర్ ప్రముఖ సంఘ సేవకులు బోనం వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కేటీఆర్,ఎమ్మెల్యే మాగంటి



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం, రహమత్ నగర్ డివిజన్లోని ఎస్‌సీఆర్ హిల్స్‌లో క్రిస్టియన్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో, ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే హైదరాబాద్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ పాల్గొని క్రైస్తవ మత పెద్దలతో కలిసి క్రిస్మస్ కేక్ కటింగ్ చేశారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా క్రిస్మస్ పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించి క్రైస్తవులకు అన్ని రకాలుగా తోడ్పాటును అందించారని అన్నారు. క్రిస్టియన్ పిల్లలకు విదేశాలలో చదువుకొనుటకు రూ.20లక్షల స్కాలర్‌షిప్ ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది అన్నారు. నగరంలో ఉప్పల్ బగాయత్తులో రెండు ఎకరాల భూమి కేటాయించి క్రైస్తవుల కొరకు భవన నిర్మాణం చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి, దాసోజు శ్రావణ్, అంతర్జాతీయ సువార్తికులు డాక్టర్ స్టీఫెన్ పాల్, విజయ్ కుమార్, కే నరసింహారెడ్డి, అరుణ్ కుమార్, రాకేష్, కిష్టాఫర్ పాస్టర్లు, క్రైస్తవులు భారీగా పాల్గొన్నారు.

మృదంగ కళాకారుడికి సత్కారం



నవతెలంగాణ-కల్చరల్

సాధారణంగా మృదంగం గానానికి ప్రక్క వాయిద్యంగా ఉంటుంది కానీ ఎల్లా వెంకటేశ్వర రావు మృదంగం వాయిద్య కళను ప్రత్యేకంగా ప్రదర్శిస్తూ అంతర్జీతీయ స్థాయిలో నిలిపారనీ పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కొనియాడారు. రవీంద్ర భారతి ప్రధాన వేదికపై భాషా సాంస్కృతిక శాఖ నిర్వహణలోప్రఖ్యాత మృదంగం కళా కారుడు ఎల్లా వెంకటేశ్వర రావు 74 ఏండ్ల కళా జీవితం సందర్భంగా ప్లాటినమ్ జూబ్లీ వేడుక శిష్య బృందం ఘనంగా నిర్వహించారు. తొలుత వెంకటేశ్వర రావు మృదంగ వాయిద్య గోష్ఠి నవరస భరితంగా జరిగింది. అయన జీవిత విశేషాలు లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జూపల్లి కృష్ణారావు ప్రఖ్యాత కర్ణాటక విద్యాంసులు డాక్టర్ అన్నవరపు రామ స్వామితో కలసి వెంకటేశ్వర రావును స్వర్ణ కంకణ ధారణతో సత్కరించి మాట్లాడారు. సంగీతం సాహిత్యం మానవ జీవన విధానంలో ప్రదానం అన్నారు. వెంకటేశ్వర రావు జీవనం అంతా మృదంగం కళకే అంకితం చేసి ఎందరికో శిక్షణ నిచ్చి కళా కారులను దేశానికి అందించారని అభినందించారు.

వేదికపై ప్రొఫెసర్ జీవిఆర్ శాస్త్రి, డాక్టర్ విభీషణ శర్మ, సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ, గీత రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు తదితరులు పాల్గొని వెంకటేశ్వర రావు ప్రతిభను అభినందించారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు నివాళి



నవతెలంగాణ-ఓయూ

నిజాం మెడల వంచిన దిశాలి, హైదరాబాద్ సంస్థానాన్ని విముక్తం చేసిన ధైర్యశీలి, 530కి పైగా సంస్థానాలను దేశంలో విలీనం చేసిన ఉక్కుమనిషి, స్వాతంత్ర సమరయోధుడు, భారత తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా ఆదివారం రామంతపూర్ ప్రధాన రహదారి హోమియోపతి కాలేజ్ ఎదురుగా ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్, రామంతపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు, ముఖ్య అతిథులుగా పాల్గొని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు, సంజయ్ పటేల్, హబ్సిగూడ డివిజన్ ప్రధాన కార్యదర్శులు చెల్లోజు ఎల్లాచారి, చింతకింది ప్రవీణ్, బొమ్మగోని రఘుపతి గౌడ్, ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ ముత్తినేని జగదీష్, మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి రేవు నరసింహ కురుమ, రామంతపూర్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి సంకురి కుమారస్వామి, కందకట్ల దయానందరెడ్డి, పారుపల్లి హనుమంతరావు, పీసరి శంకర్, మట్ట అరవింద్, పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన నరసింహ



నవతెలంగాణ-ఓయూ

సీఎం రేవంత్ రెడ్డికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుటుంబల పక్షన తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ ఫౌండర్ వలిగొండ నరసింహన కృతజ్ఞతలు చెప్పారు. గురుకులాలలో, సంక్షేమ హాస్టలలో చదువుకుంటున్నటువంటి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యతో పాటు పౌష్టిక ఆహారము, మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా ప్రణాళికలు రూపొందిస్తూ, విద్యార్థులపై పెట్టుబడి ఖర్చు కాదని తెలంగాణ భవిష్యత్తు నిర్మాతలను తయారుచేస్తున్నామని, విద్యార్థులు అందరు తెలంగాణ సంపదని చెప్పి, అందరికీ కామన్ డైట్ అమల్లోకి తీసుకువచ్చి, గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు మంజూరుకు ఆదేశాలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రజా పాలన అధినేత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రివర్గానికి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరికీ, సబ్బండ వర్గాల విద్యార్థుల తరపున కృతజ్ఞతలు చెప్పారు.

నాకౌట్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం



నవతెలంగాణ-కంటోన్మెంట్

బోయినపల్లి ప్లే గ్రౌండ్‌లో ఎస్జీఎఫ్ నాక్ అవుట్ షార్ట్ బౌండరీ ఓపెన్ టోర్నమెంట్ సీజన్-3ని కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఛైర్మెన్ జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ప్లే స్థలం కబ్జాలలో ఉండేదని గ్రౌండ్ స్థలాన్ని కాపాడడం వల్లే ఈరోజు క్రీడాకారులు ఇక్కడ ఆటలు ఆడగలుగుతున్నారని చెప్పారు. వివిధ పాఠశాలల స్పోర్ట్స్ మీట్స్, క్రికెట్ టోర్నమెంట్ పోటీలు, ఫీస్టాల్ రాష్ట్రీయ, జాతీయ స్థాయీ పోటీలు, వాలీబాల్, ఫుట్‌బాల్ పోటీలు ఈ ప్లే గ్రౌండ్‌లో జరుగుతున్నయని జంపన ప్రతాప్ పేర్కొన్నారు. అయితే గ్రౌండ్ అభివృద్ధి కోసం బోర్డు అధికారులు అభివృద్ధికి సహకరిస్తున్నారని అన్నారు. అనంతరం టోర్నమెంట్ నిర్వాహకులు శరత్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే శ్రీ గణేష్ పేరుతో నియోజకవర్గ స్థాయిలో ఎస్జీఎఫ్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని, 25 జట్లు పాల్గొంటున్నాయని, ప్రతి జట్టు 4 ఓవర్లు ఆడుతుందని పేర్కొన్నారు. విజేత జట్టుకు రూ.25 వేలు నగదు విన్నర్స్ ట్రోఫీ, రన్నర్స్ జట్టుకు రూ.12 వేలు రన్నర్స్ ట్రోఫీ, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, ఇతర బహుమతులు అందజేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో తరుణ్, సాయి, ప్రతాప్, అనిల్, శ్రీకాంత్, బాలు, వరప్రసాద్, పవన్, తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభను విజయవంతం చేయాలి

- ఓయూ విద్యార్థి నాయకుడు చనగాని దయాకర్



నవతెలంగాణ-ఓయూ

నిరుద్యోగులకు 54 వేల ఉద్యోగాలు కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతగా డిసెంబర్ 21న ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఓయూ విద్యార్థి నాయకుడు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ కోరారు. ప్రచారంలో భాగంగా ఆదివారం ఓయూలో విద్యార్థును కలిసి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఓయూలో 2కె వాక్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా చనగాని దయాకర్ మాట్లాడుతూ.. నిరుద్యోగులకు, విద్యార్థులకు, రైతులకు పెద్దపీట వేసిన కాంగ్రెస్ ప్రజా పాలనకు కృతజ్ఞతగా ఈ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. గురుకుల విద్యార్థులకు మెస్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలు పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. డిసెంబర్ 21న జరిగే కృతజ్ఞతా బహిరంగ సభ విద్యార్థులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎన్ఎస్‌యూఐ ఓయూ ప్రెసిడెంట్ మేడ శ్రీను, మోహన్, సతీష్, వినయ్, శివ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

పురస్కారం అందుకున్న కోట నీలిమ



నవతెలంగాణ-బేగంపేట్

సనత్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జ్, ఏఐసీసీ సభ్యురాలు డాక్టర్ కోటా నీలిమని సామాజిక మార్పు రంగంలో అద్భుత సేవల కోసం గౌరవించి, భారతీయ మహిళా విజయవంతుల పురస్కారాన్ని అందజేశారు. ఆదివారం బెంగళూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారం అమెకు మణిహారిని రాజ కుటుంబానికి చెందిన ఆమె హైనెస్ ప్రమోదా వడియార్ అందజేశారు. ఇతర విభాగాల్లో ఈ పురస్కారం అందుకున్నవారిలో కవిత కృష్ణమూర్తి, శ్రేయా పటేల్, సమీరా రెడ్డి, ధన్యా రాజేంద్రన్, పింకీ ఆనంద్, మీనాక్షి అమ్మ తదితరులు ఉన్నారు. దేశవ్యాప్తంగా మహిళా సాధకులకు ఈ పురస్కారాలను ప్రదానం చేస్తారు. ఇందులో తెలంగాణ నుంచి డాక్టర్ కోట నీలిమ ఎంపికైంది.

అనారోగ్యంతో ఉన్న వ్యక్తికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులతో ఉన్న వ్యక్తికి బాబా ఫసివుద్దీన్ ఆదేశాల మేరకు కాలనీవాసులు ఆర్థిక సహాయం అందించారు. బొరబండ డివిజన్‌లోని మధుర నగర్ నివాసి మిర్చిల రాజు తన భార్య కొన్ని రోజుల క్రితం మృతిచెందింది. అనంతరం అతనికి పక్షవాతం వచ్చింది. కావున అతని కుటుంబం నడవడానికి చాలా ఇబ్బందిగా ఉన్నదని తెలుసుకొని మధుర నగర్ వెల్ఫేర్ అధ్యక్షులు చెట్టి దేవేందర్, వెల్ఫేర్ సభ్యులు రూ.21,700 ఆర్థిక సహయం అందజేశారు. అదే విధంగా ఎవరైనా దాతలు ముందుకు వచ్చి తమకు తోచిన సహాయం చెయగలరని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ వాజిద్, ఆంజనేయులు గౌడ్, ప్రతాప్, బీఎస్ఎన్ఎల్ నర్సింలు, సయ్యద్ జహంగీర్, కృష్ణ రెడ్డి, శంకరయ్య, రాములు గౌడ్, హుసేన్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరికి మోహన్‌బాబు పరామర్శ



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఇటీవలే మంచు ఫ్యామిలీలో మంటలాంటి గొడవ తెలిసిందే.. అదే సమయంలో ఓ ఛానల్ విలేకరిపై మోహన్ బాబు దాడి చేశాడు. అనంతరం అతను తీవ్రంగా గాయపడి యశోదా ఆస్పత్రిలో చేరాడు. ఆదివారం మోహన్ బాబు, విష్ణు గాయపడిన విలేకరును పరామర్శించారు. చికిత్స విధానం ప్రస్తుత ఆరోగ్య సంరక్షణపై తెలుసుకొని క్షణికావేశంలో జరిగిన తప్పిదం అంటూ క్షమాపణ కోరుతూ.. అధైర్య పడవద్దని ధైర్యం చెప్పారు.

శరీరం, మనస్సు సమన్వయంగా ఉంటే నాట్యం అర్థమౌతుంది

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవి



నవతెలంగాణ-కల్చరల్

శరీర కదలికలు మనసు సమన్వయం అయితే నాట్య కళ అర్థం అవుతుందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవి అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై వంశీ ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో పద్మ మోహన్ దెందులూరి చే ఆంధ్ర నాట్య ప్రదర్శన జరిగింది. తొలుత పుష్పాంజలితో నాట్యాన్ని పద్మ శిష్యులు శ్రీవల్లి నర్తన నేహాలు నవ జనార్ధన పారిజాతంలోని భామా కలాపంను పద్మ మోహన్ రాశస్పొరకంగా నర్తించారు. తదుపరి జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జస్టిస్ మాధవి పాల్గొని పద్మ మోహన్‌ను ఆంధ్ర నాట్య పితామహుడు నటరాజ రామకృష్ణ పేరిట జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించి మాట్లాడారు. సంగీత నృత్య కళలు వినోదం కోసం మాత్రమే కాక మానసిక ఆరోగ్యంకు ఉపయుక్తం అన్నారు. భామా కలాపంలో కథను సంక్షిప్తంగా పద్మ నర్తించిన ఆకట్టుకున్నారని అభినందించారు. సంసారంలో పరస్పర సహకారంతోనే ఎదుగుదల వుంటుందని అదే విధంగా పద్మకు మోహన్ ప్రోత్సహం వుందని అన్నారు. ప్రముఖ ఆంధ్ర నాట్య కళాకారుడు డాక్టర్ కళా కృష్ణ మాట్లాడుతూ.. పద్మ జనార్ధన పారిజాతం బిరుదుకు అర్హురాలనీ అన్నారు. పద్మ మోహన్ నాట్య కళకు సంబంధించిన కళాకారులకు చేస్తున్న ఆర్థిక సహాయం గురించి వివరించారు. వేదికపై హరికథ కళాకారిని ఉమా మహేశ్వరి, హనుమంత రెడ్డి తదితరులు పాల్గొన్నగా వంశీ రామరాజు అధ్యక్షత వహించారు.

ఆస్పత్రి నిర్మాణం పనులు వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే పద్మారావు గౌడ్



నవతెలంగాణ-ఓయూ

సీతాఫలమండీలో కుట్టి వెల్లోడి ప్రభుత్వ ఆస్పత్రి, కొత్త భవనాల నిర్మాణం పనులను వేగవంతం చేయాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం సితాఫలమండీ కుట్టి వెల్లోడి ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణం పనులను ఆయన అధికారులు, కార్పొరేటర్ల తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సితాఫలమండీతో పాటు సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నంగా నిలిచిన ప్రాజెక్టులు తమ హయంలోనే ప్రారంభమయ్యాయని తెలిపారు. కుట్టి వెల్లోడి ప్రభుత్వ ఆస్పత్రి కొత్త భవనాల నిర్మాణానికి రూ.12 కోట్ల మేరకు నిధులను గతంలోనే మంజూరు చేయించామని, పనులు చురుకుగా చేపట్టాలని సూచించారు. నిర్ధారిత వ్యవధిలో, నాణ్యత ను పాటిస్తూ పనులు పూర్తి చేయాలని, కుట్టి వెల్లోడి ఆస్పత్రిని కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా తీర్చి దిద్దాలని పద్మారావు గౌడ్ సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రాసురి సునీత, లింగాని ప్రసన్న లక్ష్మి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పద్య నాటక పోటీలకు పెరుగుతున్న ప్రేక్షకులు



నవతెలంగాణ-కల్చరల్

భాషా సాంస్కృతిక శాఖ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ సౌజన్యంతో నాటక సామాజాల సమాఖ్య రుద్ర శివ సాంస్కృతిక సంఘం, వ్యాస కళా క్షేత్ర సహకారంతో శివానీ ఆర్ట్స్ అసోసియేషన్ నిర్వహణలో రాష్ట్ర స్థాయి ఆహ్వాన పద్య నాటక పోటీలు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్‌టీఆర్ కళా మందిరంలో ఆరంభమైనాయి. తొమ్మిది రోజుల పాటు జరిగే పోటీలలో ఆదివారం నాడు వరంగల్ స్టార్ బ్రదర్స్ సాంస్కృతిక కళా పరిషత్ హనుమకొండ వారిచే జంధ్యాల సుబ్బలక్ష్మి రచించిన విజయానిరుద్ధం పద్య నాటకం దేవరాజ వీరేంద్ర రావు దర్శకత్వంలో ప్రదర్శించారు. అర్జున కుమారుడు అనిరుద్ధుడు ఉషా కుమారిల వివాహం కథాంశం, సంస్థ నిర్వహకుడు పరమేశ్వర్ స్వాగతం పలికిన సభలో పి.హరి ప్రసాద్, శివ మన్నారాయన, మువ్వ దేవనాథం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగాగా కళా పోషకులు హరినాథ్ వేముల లోకేష్ పాల్గొని కళా కారులను అభినందించారు.

విభిన్నమైన హ్యాండ్లూమ్స్ పటోలా ఆర్ట్ ప్రదర్శన షురూ..



నవతెలంగాణ-బంజారాహిల్స్

బంజారా హిల్స్‌లోని రోడ్ నెంబర్ 1లో గల లేబుల్స్ పాప్-అప్ స్పేస్‌లో కొలువుదీరిన డి సన్స్ పటోలా ఆర్ట్స్ వస్త్ర ప్రదర్శన పద్మశ్రీ అవార్డు గ్రహీత, భారతీయ కూచిపూడి నృత్యకారిని డాక్టర్ పద్మజా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. విభిన్నమైన హ్యాండ్లూమ్ చీరలతో పాటు ముఖ్యంగా పటోలా ఆర్ట్ చీరలు, పటోలా హ్యాండ్లూమ్, సిల్క్ వస్త్రో త్పత్తులను ఒకే వేదికలో ప్రదర్శించడం అభినందనీయమని అమె అన్నారు. నేరుగా వినియోగదారునికి అందించేందుకు ఏర్పాటైన ఈ ప్రదర్శన ప్రతి ఒక్కరు సందర్శించి, చేనేతకారులను ప్రోత్సహించాలని డా.పద్మజా రెడ్డి కోరారు. డి సన్స్ పటోలా ఆర్ట్స్ నిర్వాహకులు భవిన్ మాట్లాడుతూ... నేత కార్మికులను ప్రోత్సహించడంతో పాటు చేనేత పరిశ్రమకు మార్కెట్‌ను అందించడమే ఈ ఎగ్జిబిషన్ ప్రధాన సామాజిక లక్ష్యమని వివరించారు. ఈ నెల 22 వ తేదీ వరకు కొనసాగుతున్న ప్రదర్శనలో రానున్న ఫెస్టివ్ ప్రత్యేక కలెక్షన్స్ వేదికగా ఈ షోలో రాజ్‌కోట, పటోలా దుపట్టా, పటోలా శాలువాలు, సింగిల్ పటాన్ చీరలు, సింగిల్ పటోలా దుప్పట, పటాన్ పటోలా చీరలు, సిల్క్ టిషుయ్ పటోలా వంటి 10 వేల రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని, సిల్క్ కో-ఆపరేటివ్ సొసైటీలు తమ ఉత్పత్తులను వివిధ రాష్ట్రాల నుంచి ప్రదర్శిస్తున్నాయని నిర్వహకులు మీడియాకు తెలిపారు.

ఎమ్మెల్సీని కలిసిన పార్ట్ టైం టీచర్స్




నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ ఆల్ యూనివర్సిటీ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం గౌరవ శాసనమండలి సభ్యులు, తీన్మార్ మల్లన్నని కలిసి ఆరు నెలల జీతాలు అర్ధాకళి బతుకులతో, దుర్భరమైన జీవితాలను అనుభవిస్తున్న పార్ట్ టైం టీచర్ల సమస్యలను శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తవలసిందిగా కోరారు. ఎమ్మెల్సీ స్పందిస్తూ.. తప్పకుండా యూనివర్సిటీ పార్ట్ టైం టీచర్ల సమస్యలను అసెంబ్లీ సాక్షిగా మాట్లాడి సమస్యకు పరిష్కారం వచ్చే దిశగా ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టీం టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ సోమేశ్వర్ బోనకుర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కరుణాకర్ పాల్గొన్నారు.

29న జరిగే విజయోత్సవ సభను కచ్చితంగా అడ్డుకుంటాం

- బీఆర్ఎస్వీ ప్రధాన కార్యదర్శి కొంపెల్లి నరేష్



నవతెలంగాణ-ఓయూ

విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలని, మొదటి ఏడాదిలో 2 లక్షల ప్రభుత్వాల ఉద్యోగాలు, కల్పించలేదని, 4000 నిరుద్యోగ భృతి, లేదని బీఆర్ఎస్వీ ప్రధాన కార్యదర్శి కొంపెల్లి నరేష్ అన్నారు. ప్రతి విద్యార్థికి 5 లక్షల విద్యా భరోసా కార్డు ఎక్కడ అని, విశ్వవిద్యాలయాల్లో రీసెర్చ్ స్కాలర్స్‌కి నెలకు 10,000 ఫెలోషిప్ ఇవ్వలేదని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఈడబ్ల్యూఎస్ వర్గాల విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్సుమెంట్ తోపాటు పాత బకాయిలు పూర్తిగా చెల్లింపు లేదన్నారు. ఓయూలో 1250 మందికి 350 మంది శాశ్వత ఆచార్యులు ఉన్నారని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా విద్యారంగలో ఇన్ని సమస్యలు పెట్టుకొని, డైవర్షన్ పాలిటిక్స్ ముఖ్యమంత్రి చేస్తున్నా డన్నారు. నిరుద్యోగా సమాజానికి వెంటనే క్షమాపణ చెప్పాలని దానికి నిరసనగా ఓయూలో జరిగే బహిరంగ సభ అడ్డుకుంటమని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంపెల్లి నరేష్ డిమాండ్ చేశారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం ప్రత్యేక క్రానిక్ కిడ్నీ డిసీజ్ క్లినిక్



నవతెలంగాణ-బేగంపేట్

భారతదేశంలో కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోవడం ఆందోళనకరం. మన దేశ జనాభాలో 17% మంది ప్రజలు మూత్రపిండాల సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. భారతదేశంలో ప్రతి ఏడాది దాదాపు ఐదు లక్షల మంది డయాలసిస్ దశకు చేరుకుంటున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని యశోద హాస్పిటల్ హైటెక్ సిటీ, దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధిగ్రస్తులకోసం క్రానిక్ కిడ్నీ డిసీజ్ 'సీకేడీ' క్లినిక్‌ను పవిత్ర జగద్గురువు శ్రీ శివరాత్రి దేశికేంద్ర మహాస్వామీజీతో కలిసి యశోద హాస్పిటల్స్ గ్రూప్ చైర్మెన్ గోరుకంటి రవీందర్ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులు జస్టిస్ ఆర్. దేవదాస్ (కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి), రాజ్యసభ సభ్యులు రేణుకా చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా యశోద హాస్పిటల్స్ గ్రూప్ చైర్మెన్ మాట్లాడుతూ.. భారతదేశంలో దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధుల భారం పెరుగుతోందని, భారతదేశంలో ప్రతి సంవత్సరం దాదాపు 5 లక్షల మంది కొత్త కిడ్నీ రోగులు డయాలసిస్ దశకు చేరుకుంటున్నారని తెలిపారు. వీరిలో కేవలం ఇరవై వేల మంది రోగులకు మాత్రమే కిడ్నీ మార్పిడి అందించబడుతుందని, మిగిలిన వారు డయాలసిస్‌లో ఉండి, మార్పిడి కోసం వేచి ఉన్నారు. కొన్ని రాష్ట్రాలలో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో జనాభాలో 20% కంటే ఎక్కువ మందిలో ఈ సీకేడీ క్రానిక్ కిడ్నీ డిసీజ్ ప్రాబల్యం పెరుగుతున్నట్టు నివేదికలు చెప్తున్నాయి. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని, దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధిగ్రస్తులకోసం ఒక ప్రత్యేక క్లినిక్ ఉండాలనే ఉద్దేశంతో ఈ సీకేడీ క్లినిక్‌ను ఏర్పాటు చేసినట్టు యశోద హాస్పిటల్స్ గ్రూప్ చైర్మన్ తెలిపారు. యశోద హాస్పిటల్స్-హైటెక్ సిటీ, సీనియర్ నెఫ్రాలజిస్ట్, కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ స్పెషలిస్ట్ డాక్టర్. రాజశేఖర చక్రవర్తి, మాట్లాడుతూ.. "క్రానిక్ కిడ్నీ డిసీజ్" ప్రమాదంలో ఉన్న వారందరూ ఈ క్లినిక్‌లో తమ పేరు నమోదు చేసుకోవచ్చు. సీనియర్ నెఫ్రాలజిస్ట్ కన్సల్టేషన్‌తో సహా ప్రోటోకలైజ్డ్ కేర్, డైటీషియన్ అత్యాధునిక పరికరాలు, మందులను ఉపయోగించి సీకేడీ నిర్వహణకు సలహా ఇస్తారు. సీకేడీ ప్రమాదం ఉన్నవారు డయాబెటిక్ మెల్లిటస్, హైపర్ టెన్షన్, కిడ్నీ స్టోన్స్, దీర్ఘకాలంగా మందులు వాడుతున్న రోగులు, (నొప్పి నివారిణి యాంటీబయాటిక్స్ వంటివి), ఊబకాయం ఉన్న వ్యక్తుకు ఈ ప్రత్యేక క్లినిక్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రోగికి త్వరగా ఈ క్లినిక్‌కు వచ్చినట్లయితే, సీకేడీ యొక్క పురోగతిని నివారించడం సాధ్యమవుతుందని, డాక్టర్. రాజశేఖర చక్రవర్తి, తెలియజేసారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
11
హైదరాబాద్
HMDA
సోమవారం | డిసెంబర్ 16, 2024 | www.navatelangana.com

ఘనంగా ఢిల్లీ వరల్డ్ స్కూల్ 8వ యాన్యువల్ డే




నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని మాణిక్య నగర్, చింతల్‌లో గల ఢిల్లీ వరల్డ్ స్కూల్, 8వ యాన్యు వల్ డే కార్యక్రమాన్ని ఆదివారం ఐడీపీఎల్ చౌరస్తాలో గల ఎంపీర్ కన్వెన్షన్ హాల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ వారు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి, వారి యొక్క ఆహ్వానం మేరకు, ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కె.యం.ప్రతాప్ విచ్చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ వారు మాట్లాడుతూ.. సీబీఎస్‌ఈ బోధనతో చింతల్లో నెలకొల్పిన ఢిల్లీ వరల్డ్ స్కూల్,రాష్ట్రంలోనే మొట్టమొదటి బ్రాంచ్ అని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, క్రీడలతోపాటు మన దేశ సంస్కృతి సంప్రదా యాలను తెలియచేస్తున్నందుకు ఢిల్లీ వరల్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం లో ఢిల్లీ వరల్డ్ స్కూల్ సంస్థల చైర్మెన్ నల్లపాటి వెంకటేశ్వరరావు, మోటివేషనల్ స్పీకర్ కృష్ణ చైతన్య, ఢిల్లీ వరల్డ్ స్కూల్ ప్రిన్సిపల్ రమ్య, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బలమైన పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారం



- సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్

నవతెలంగాణ-ఓయూ

బలమైన పోరాటాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అన్నారు. తార్నాక డివిజన్‌లోని విజయ డైరీ వద్ద గల అంబేద్కర్ కమిటీ హాల్‌లో యువ నాయకుడు తాళ్లపల్లి రాజు ఆధ్వర్యంలో సీపీఐలో పలువురు యువకులు చేరారు. కాంపల్లి శ్రీనివాస్ వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో శ్రీనివాస్ ఆయన మాట్లాడుతూ.. ఈ దేశంలో అనేక రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఉన్నప్పటికీ పేద వర్గాలకు సమస్యలు వచ్చినప్పుడు గుర్తుకు వచ్చేది కేవలం ఎర్రజెండే అని నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికై రాజీలేని పోరాటాలు కొనసాగిస్తుందని పేర్కొన్నారు. పేద వర్గాల కోసం ఎర్రజెండాలు కొనసాగిస్తున్న పోరాటాల పట్ల యువకులు ఆకర్షితులై పార్టీలో చేరటం సంతోషమని, భవిష్యత్తులో సికింద్రాబాద్ పరిధిలో మరిన్ని చేరికలు ఉంటాయని తెలిపారు. అదేవిధంగా సీపీఐ ఈ దేశ స్వతంత్రం నుంచి మొదలుకొని నేటి వరకు విద్యా, ఉపాధి, అవకాశాలు కల్పించాలని, నిరుద్యోగం, హింస, అసమానతలు, దోపిడికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేస్తూ శతాబ్ది ఉత్సవాలకు సిద్ధమవుతున్న ఏకైక పార్టీ సీపీఐ మాత్రమే అని కొనియాడారు. భవిష్యత్తులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందేంతవరకు పోరాడుతుందని వెల్లడించారు. డిసెంబర్ 26 నుంచి సీపీఐ శతాబ్ది ఉత్సవాలను వాడవాడల పెద్ద ఎత్తున నిర్వహించాలని, ప్రచారం కొనసాగించాలని దాని కొరకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కొమురెల్లి బాబు, గౌరీ నాగరాజ్, శ్రీహరి, తాళ్లపల్లి రాజు, విక్కీ, శ్రీకాంత్, శ్రీధర్, చందు, రాహుల్, వెంకటేష్, రమేష్ పలువురు యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఒక నిండు ప్రాణం బలైంది





- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-బాలానగర్

జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఒక నిండు ప్రాణం బలైంది అని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ ఇందిర గాంధీ , పురంలో ఆడుకుంటూ.. ప్రమాదవశాత్తు ఫతేనగర్ నాలాలో పడి చనిపోయిన సంఘటన తెలిసిందే. ఈ మేరకు ఆది వారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్ పండల సతీష్ గౌడ్, బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. అనం తరం బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే కృష్ణారావు రూ. 20వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యంతో ఇందిరా గాంధీపురం నాలాలో కూల్చివేసిన నాలాగోడను కట్టకుండా వదిలేయడంతో.. మోజామిల్ (8)సంవత్సరాల బాలుడు ఆడుకుంటూ.. కొట్టుకపోయి మృతదేహం హుస్సేన్ సాగర్‌లో లభ్యమైందన్నారు. కనీసం అధికారులు స్పందించకుండా.. పలుమార్లు ఫోన్ కాల్ చేసినా జీహెచ్ఎంసీ కమిషనర్ స్పందించక పోవడం వల్ల ఇంత నిర్లక్ష్యంగా అధికారులు పనిచేయ డం వల్లనే బాలుడు మృతి చెందాడన్నారు. బాధిత కుటుంబానికి జీహెచ్ఎంసీ అధికారులు అండగా నిలిచి నష్టపరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పండల సతీష్ గౌడ్, ఆవుల రవీందర్ రెడ్డి, శ్రీహరి, డివిజన్ అధ్యక్షులు కంచి బిక్షపతి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఫతేనగర్ నాలాలో బాలుడు గల్లంతు : గాలిస్తున్న డీఆర్ఎఫ్, పోలీసు బృందాలు..

కూకట్‌పల్లి నియోజకవర్గం ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరాగాంధీపురం బస్తీలో ఆడుకుంటూ .. వెళ్లిన బాలుడు ప్రమాదవశాత్తు ఫతేనగర్ నుంచి బేగం పేట వైపు ప్రవహించే నాలాలో పడి గల్లంతయ్యాడు. సాయంత్రం 5 గంటలకు జరిగిన ఈ సంఘటనలో బాలుడి ఆచూకీ కోసం డీఆర్ఎఫ్. పోలీసుల బృందాల తో పాటు స్థానిక బస్తీవాసులు తీవ్రంగా గాలిస్తున్నారు. సనత్ నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫతేనగర్ సమీపంలోని ఇందిరాగాంధీపురం బస్తీకి చెందిన మోసినకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సయ్యద్ ముజామిల్ (8), తన సోదరుడు ఇనాం(5)తో కలిసి శుక్రవారం, సాయంత్రం 5 గంటల ప్రాంతంలో బస్తీకి సమీపంలోని ఖబ్రస్థాన్ వద్ద ఆడుకుంటూ నాలాలో పడిపోయాడు. తమ్ముడు ఇనాం, పరుగున వెళ్లి కుటుంబ సభ్యులకు విషయం చెప్పాడు. వారు బస్తీవాసులతో కలిసి నాలా వద్దకు వెళ్లి గాలిం చారు. సనత్ నగర్ పోలీసులకు సమాచారం ఇవ్వగా.. పోలీసులు, డీఆర్ఎఫ్ బృందాలు కలిసి నాలాలో దిగి బాలుడి కూడా జాడ దొరకలేదు. నాలాలో ఉన్న డ్రయినేజీ పైప్‌లైన్ నుంచి బాలుడు బేగం పేట బ్రాహ్మణవాడి వైపు కొట్టుకుపోయి ఉంటాడని భావించారు. అక్కడికి వెళ్లే వీలు లేకపోవడంతో వెతకడం గాలింపు కష్టంగా మారింది. బాలుడు నాలాలో పడిన ప్రాంతం బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలోకి వస్తుందని... సనత్ నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీని వాసులు అక్కడి పోలీసులకు సమాచారం ఇస్తామని తెలిపారు.

బాలుడి బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందేలా చూసాం ..

కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్

కూకట్‌పల్లి నియోజకవర్గం ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా గాంధీపురం బస్తీలో నివాసం ఉంటున్న మోసినకు ఇద్దరు కుమారులు. ముజామిల్ సమీపంలో ఉన్న స్మశాన వాటికలో అన్నదమ్ములు ఆడుకుంటుండగా.. ప్రమాదవశాత్తు నాలాలో పడి ముజామిల్ మృతి చెందారు. ఈ సందర్భంగా కూకట్ పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, ఆదివారం వారి నివాసంలో కలిసి పరామర్శించారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలతో రమేష్ స్థానిక నాయకులతో కలిసి మృతుడి తల్లిదండ్రులను కలిసి ఓదార్చారు. సంఘటనతో జరిగిన నష్టం పూడ్చలేని దన్నారు. బాలుడు మృతి చెందడం ఘటన బాధాకర మన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృ తం జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై వాటర్ వర్క్స్, జీహెచ్ఎంసి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. బాదిత కుటుంబానికి తగు నష్టపరిహారం వచ్చేలా చూస్తానని రమేష్ తెలిపారు.

గృహ ప్రవేశ కార్యక్రమంలో అరికెపూడి గాంధీ




నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి సాక్షి జోనల్ ఇన్‌చార్జి సీనియర్ జర్నలిస్ట్ సాక్షి పరమేష్, నూతన గృహప్రవేశానికి శేర్లింగంపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు పీఏసీ చైర్మెన్ అరికెపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్న, ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ నూతన గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకులు చిరుమర్తి రాజు పాల్గొన్నారు.

గృహ ప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం..

కూకట్‌పల్లి నియోజకవర్గం సీనియర్ జర్నలిస్ట్ సాక్షి దినపత్రిక జోనల్ ఇన్‌చార్జి తొట్ల పరమేశ్ నూతన గృహ ప్రవేశం సందర్భంగా.. సత్యనారాయణ వ్రతం కార్యక్రమానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

గృహ ప్రవేశ కార్యక్రమంలో బండి రమేష్

కూకట్‌పల్లి సాక్షి రిపోర్టర్ పరమేష్ నూతన గృహప్రవేశానికి కాంగ్రెస్ ఇన్‌చార్జి రమేష్, ఆదివారం ముఖ్యఅతిథిగా హాజర య్యారు. పరమేష్ దంపతులను ఆశీర్వదించి అభినందించారు.



మంత్రి పొంగులేటిని కలిసిన శేరి సతీష్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఆదివారం కూకట్‌పల్లి నియోజక వర్గం కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి కలిశారు. అనంతరం పలు సమస్యల పై చర్చించారు. ఈ కార్యక్రమంలో రాజు ముదిరాజ్, గిరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



భరత్ నగర్ యువసేన గ్రౌండ్‌లో, కళ్యాణ్ గురుస్వామి అధ్వర్యంలో... మహా పడి పూజ కార్యక్రమలో మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. నవతెలంగాణ- కూకట్‌పల్లి

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ సీనియర్ నేత కూన శ్రీశైలం గౌడ్‌ని తన నివాసం వద్ద పలువురు నాయకులు, పలు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ప్రజలు కలిశారు. వివిధ కాలనీలలో నెలకొన్న సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ముఖ్యంగా 126 జగద్గిరిగుట్ట డివిజన్ లోని రాజీవ్ గృహకల్పలో నెలకొన్న నీటి సమస్యను మాజీ ఎమ్మెల్యేకి వివరించారు. ఈ వాటర్ సమస్యను వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యేకి కోరారు. పలు వినతులు స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే వాటి పరిష్కారం కోసం, ఆయా కాలనీల అభివృద్ధి కోసం సత్వర చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. పలువురు మాజీ ఎమ్మెల్యేకి పలు శుభకార్యాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ వలయంలో గోవింద్ హెూటల్ చౌరస్తా



- రోడ్డు నిర్మాణ పనుల వల్ల ప్రధాన రోడ్డు మూసివేత
- ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో గోవింద్ హెూటల్ చౌరస్తాలో ప్రతి నిత్యం ట్రాఫిక్ జామ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఎల్లమ్మ బండ వెళ్ళే రహదారిలో రోడ్డు నిర్మాణ పనుల జాప్యంతో, ట్రాఫిక్ వలయంలో చిక్కుకున్న గోవింద్ హెూటల్ చౌరస్తా, ఉషా ముళ్ళపూడి కమాన్ నుంచి ఆల్విన్ కాలని ఎల్లమ్మ బండ, జగద్గిరిగుట్టకు ప్రతిరోజు వేల సంఖ్యలో వాహనదారులు ప్రయాణిస్తుంటారు. గోవింద్ హెూటల్ చౌరస్తా వద్దకు రాగానే ట్రాఫిక్ వలయంలో చిక్కుకుని నానా అవస్థలు పడటమే కాకుండా.. సమయం వృధా చేసుకుంటున్నామని వాహనదారులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ జామ్ కు ప్రధాన కారణం ఇండియన్ బ్యాంకు నుంచి ఎల్లమ్మ చెరువు చేపట్టిన, వరద నీటి కాలువ నిర్మాణం కొరకు రోడ్డు తవ్వడం. రోడ్డు నిర్మాణ పనుల్లో ఆలస్యం అవడం. పనుల్లో భాగంగా ఎల్లమ్మ బండకు వెళ్ళే ప్రధాన రహదారి మూసి వేయడం కారణంగా ఆల్విన్ కాలని నుంచి, ఎల్లమ్మ బండ నుంచి, ఉషా ముళ్ళపూడి కమాన్ నుంచి వచ్చే వాహనాలు గోవింద్ హెూటల్ చౌరస్తా వద్దకు రాగానే భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. ఇటు సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వరకు ఒకపక్క హుడా పార్కు వరకు ట్రాఫిక్ జామ్ ఏర్పడి.. ప్రతి రోజు వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంత పెద్ద మొత్తంలో ట్రాఫిక్ జామ్ అవుతున్నప్పటికి.. ట్రాఫిక్ నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులు మాత్రం ఉండక పోవడం గమనార్హం. పోలీసులు లేకపోవడం వల్ల ట్రాఫిక్ నియంత్రణలో లేక అస్తవ్యస్తంగా మారిపోయి.. వాహన దారులు ఘర్షణ పడుతుండటం నిత్యకృత్యంగా మారి పోయింది. కాబట్టి జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే స్పందించి, కాలువ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణకు సిగ్నల్ వ్యవస్థను పునరుద్ధరించి, ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేసి, ట్రాఫిక్ జామ్ సమస్యను పరిష్కరించాలని వాహన దారులు కోరుతున్నారు.

కాసాని కృష్ణ ముదిరాజ్ 18వ వర్ధంతి వేడుకలు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని మల్లంపేట్, నిజాంపేట్ ప్రగతి నగర్, బాచుపల్లి ఎంపీటీసీగా పనిచేసినటువంటి స్వర్గీయ కాసాని కృష్ణ ముదిరాజ్ సేవలు మరువలేనివని ఆ సాంగ్ కాసాని కృష్ణ అభిమానులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా రాజీవ్ గాంధీ నగర్ సాయి నగర్ దేవేందర్ నగర్ ఇంద్రానగర్ కాలనీల ఏర్పాటుకు తను చేసిన సేవలు చిరస్మరణీయమని పలు కాలనీల కాసాని కృష్ణ ముదిరాజ్ అభిమానులు తెలియజేశారు. కాసాని కృష్ణ ఒక నాయకుడు ఒక లీడర్‌గా కాకుండా తమ ఇంటిలో ఒక అన్నగా మెలిగేవాడని ఆపదలో తను అందించే ధైర్యం మరువ లేని దని పలు కాలనీల ప్రజలు తెలియ జేశారు. కాసాని కృష్ణ లేని లోటు పూడ్చలేనిదని వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని 18 వర్ధంతి సందర్భంగా వారికి నివాళులర్పిస్తు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు.

సేమి క్రిస్మస్ వేడుకల్లో శంభీపూర్ క్రిష్ణ



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్‌య నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ చర్చ్ గాగిల్లాపూర్‌లోని చైతన్య కాలనీ హార్మోన్ పెంతుకొస్తూ చర్చ్, పార్క్ సెంట్రల్‌లో ఆదివారం క్రైస్తవ సంఘ సభ్యులు ఏర్పాటు చేసుకున్న సేమి క్రిస్మస్ వేడుకల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ పాల్గొన్నారు. సెమీ క్రిస్టమస్ సందర్భంగా అందరికీ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేక్ కట్ చేసి ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అనంతరం పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అమరం గోపాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు రంజిత్ రెడ్డి, పాస్టర్ వి.ఎస్ రావు, సతీష్, క్రైస్తవ సోదరి, సోదరమణులున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ

నవతెలంగాణ-దుండిగల్

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం అని బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మున్సి పాలిటీ శంభీపూర్ కార్యాలయంలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మంజూరు చేయించిన రూ. 6,28,700 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులు కుత్బుల్లాపూర్ నియోజక వర్గ బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉండి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ యూత్ ప్రెసిడెంట్ ప్రవీణ్ గౌడ్, నాయకులు మేడి చంద్రశేఖర్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

మె‘న్యూ’ ఘరూ

- పెరిగిన మెస్, కాస్మొటిక్ చార్జీలు
- శనివారం నుంచి కొత్త మెనూ అమలు
- ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో మారిన భోజనం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ గౌతమ్ (ఫైల్)

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో మెనూ మారింది. ఆయా వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన పౌష్టికాహారం అందేలా చర్యలు చేపట్టారు. ఇందుకోసం ప్రభుత్వం మెస్ చార్జీలు సహా కాస్మొటిక్ చార్జీలను 40శాతం పెంచింది. శనివారం నుంచి ఈ కొత్త మెస్ చార్జీలతో పాటు కొత్త మెనూ అందుబాటులోకి వచ్చింది. ప్రీ మెట్రిక్ హాస్టల్స్ లో ప్రతిరోజూ మూడు పూటలా మూడు రకాల కూరలతో భోజనం వడ్డించనున్నారు. వారానికి నాలుగు కోడి గుడ్లు, నాలుగు అరటి పండ్లు సహా రెండు సార్లు చికెన్ వడ్డించనున్నారు. పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్‌లో వారానికి రెండు గుడ్లు, మూడు అరటి పండ్లు, ఒకసారి చికెన్ వడ్డిస్తారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఉన్న 61 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు, హాస్టల్స్‌లో చదువుతున్న బాల బాలికలకు ఈ కొత్త మెనూతో లబ్ది చేకూరనుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములై, సంక్షేమ హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యలకు చెక్ పెట్టనున్నారు.

పొంతన లేని ధరలతో తంటాలు

రైతు ఫారం వద్ద కోడిగుడ్డు ధర రూ.దాదాపు రూ.6 వరకు ఉండగా బహిరంగ మార్కెట్‌లో రూ.7 పలుకుతోంది. ప్రభుత్వం రూ.5 మాత్రమే చెల్లిస్తుంది. ఉల్లిగడ్డ హెూల్‌సేల్ మార్కెట్‌లో కిలో రూ.40 వరకు పలుకుతుండగా, బహిరంగ మార్కెట్‌లో రూ.60 వరకు విక్రయిస్తున్నారు. ఇక కిలో వెల్లుల్లి రూ.300 నుంచి రూ.350, కందిపప్పు రూ.130 నుంచి రూ.150 ఉన్నాయి. ఆయిల్ ధరలు ఆకాశాన్నంటాయి. కిలో ఆయిల్ రూ.150 పై మాటే. రైతు బజార్లలో ఏ కూరగాయను పరిశీలించినా, కిలో రూ.40 నుంచి రూ.60 పలుకుతోంది. ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలకు, బహిరంగ మార్కెట్‌లోని నిత్యావసర ధరలకు పొంతన ఉండటం లేదు. విధి లేని పరిస్థితుల్లో నాసిరకం కూరగాయలు, పప్పుతో ఆహారం అందిస్తున్నారు. హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం సంగతేమో కానీ.. కడుపు నిండా తినలేని పరిస్థితి. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ప్రాథమిక పాఠశాలలో ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.5.45 ఇస్తుండగా, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థికి రూ.8.17 చెల్లిస్తోంది. ఉన్నత పాఠశాల విద్యార్థికి గుడ్డుతో కలిపి రూ.10.67 చెల్లిస్తుండగా, ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థికి గుడ్డుకు రూ.5 చొప్పున చెల్లిస్తున్నారు.

డైట్ చార్జీల పెంపు ఇలా..

తరగతి	పాత	కొత్త
3-7	రూ.950	రూ.1,330
8-10	రూ.1,100	రూ.1,540
ఇంటర్, పీజీ	రూ.1,500	రూ.2,100

పండుగలా నిర్వహణ

సంక్షేమ గృహాలు, పాఠశాలల్లో డైట్, కాస్మొటిక్ చార్జీల పెంపు కార్యక్రమానికి పండుగ వాతావరణంలో ప్రారంభించారు. మొదటి రోజు శనివారం కలెక్టర్ గౌతమ్, ప్రజాప్రతినిధులు ఈ సంబురాల్లో పాల్గొన్నారు.

కాస్మొటిక్ చార్జీలు ఇలా..

తరగతి	పాత	కొత్త
3-7 (బాలికలు)	రూ.55	రూ.175
8-10 (బాలికలు)	రూ.75	రూ.275
3-7 (బాలురు)	రూ.62	రూ.150
8-10 (బాలురు)	రూ.62	రూ.200

బాధిత కుటుంబానికి నష్ట పరిహారం అందజేత..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద... గత రెండు సంవత్సరాల క్రితం కరెంట్ షాక్‌తో ప్రమాదానికి గురై మహమ్మద్ అబ్దుల్ బాసిత్ (63) మృ తి చెందారు. తండ్రి అఫ్జల్ కుటుంబానికి విద్యుత్ శాఖ ద్వారా మంజూరు చేయించిన ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ బాధిత కుటుంబ సభ్యులకు నష్టపరిహార చెక్కును ఆది వారం అందజేశారు. వివరాల్లోకి వెళితే.. 127- రంగా రెడ్డి నగర్ డివిజన్ వెంకటరామిరెడ్డి నగర్‌కు చెందిన మహమ్మద్ అబ్దుల్ బాసిత్ విద్యుత్ షాక్‌కు గురవగా కుటుంబ సభ్యులు హటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలియజేశారు. ఈ సంఘటనను స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రమాద విషయంపై విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి.. బాధిత కుటుంబ సభ్యులను ఆదుకోవాలని ఆదేశించారు. బాధిత కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు.. విద్యుత్ శాఖ ద్వారా మంజూరు చేయించిన ఐదు లక్షల రూపాయల చెక్కును ఎమ్మెల్యే ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు విసి.వేమా రెడ్డి, బాధిత కుటుంబ సభ్యులు ఆసిఫా భాను, ఎండి. అబ్దుల్ అజీజ్, ఎండి.అబ్దుల్ అర్ఫాత్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ యువనాయకులు దొంతిరి కార్తీక్ రెడ్డికి నివాళులర్పించిన ఎమ్మెల్యే

దుండిగల్: దొంతిరి నర్సింహా రెడ్డి కుమారులు, బిఆర్ఎస్ యువ నాయకులు దొంతిరి కార్తీక్ రెడ్డి ఇటీవల ప్రమాధవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందగా.. ఆదివారం దూలపల్లిలోని స్టీల్ సిటీ వద్ద వారి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంతాప సభ కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ హాజరయ్యారు. కార్తీక్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కార్తీక్ రెడ్డి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ..ఎమ్మెల్యే..

దుండిగల్ మున్సిపాలిటీ పరిధి దుండిగల్ గ్రామంలో దుండిగల్ రజక సంఘం ఆధ్వర్యంలో.. ఏర్పాటుచేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆదివారం కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని అన్నారు. తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమంతో స్ఫూర్తిని పంచిన చాకలి ఐలమ్మ ఆశయ సాధనను అందరూ కొనసాగించాలన్నారు.

ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, జక్కుల కృష్ణ యాదవ్, గోపాల్ రెడ్డి, విజయ శ్రీనివాస్ యాదవ్, ఆనంద్ కుమార్, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, యాదయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.





మైనార్టీ రెసిడెన్షియల్ విద్యార్థులకు కామన్ డైట్ మెనూ ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రెసిడెన్షియల్ పాఠశాలలకు కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా శనివారం తెలంగాణ గవర్నమెంట్ మైనార్టీ రెసిడెన్షి యల్ జూబ్లీహిల్స్ బాయ్స్-1 కర్మన్‌ఘాట్ సరూర్ నగర్‌లో ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిధిగా జిల్లా సైన్స్ అధికారి సి. ధర్మేందర్ రావ్, గౌరవ అతిధిగా డిప్యూటీ ఎమ్మార్వో జగన్ హాజరై కామన్ డైట్ మెనూను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. స్కూల్ ఇన్‌చార్జి దయాకర్, డిప్యూటీ వార్డెన్ షహీన్ పాషా, కో-ఆర్డినేటర్ శ్రీధర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తెలంగాణ గవర్నమెంట్ మైనార్టీ రెసిడెన్షియల్ జూబ్లీహిల్స్ గర్ల్స్-1లో డీఎస్‌వో ధర్మేందర్ రావ్ కోఆర్డినేషన్‌తో నూతన కామన్ డైట్ మెనూ ఆవిష్కరణను ప్రిన్సిపల్ బి.నాగ స్వర్ణ, ఉపాధ్యా యులు, డిప్యూటీ వార్డెన్ సహా యంతో కలిసి విజయవంతంగా పూర్తి చేశారు.

అణచివేత నుండి పుట్టుకొచ్చిన ధైర్యం

సంతోషి డియో... పెండ్లి ఆమె జీవితాన్ని ఓ విధంగా కోలుకోలేని దెబ్బతీసింది. కానీ కుంగిపోయి అక్కడే జీవచ్ఛవంలా మిగిలిపోవాలనుకోలేదు. అణచివేత నుండి పుట్టుకొచ్చిన ధైర్యంతో అడుగు బయట పెట్టింది. చదువు లేకపోయినా వచ్చిన పని చేసుకుంటూ తన బిడ్డకు మంచి భవిష్యత్ ఇవ్వాలనుకుంది. డ్రైవింగ్ చేస్తూ కొత్త జీవితాన్ని మొదలుపెట్టింది. ఇప్పుడు పురుషులకు మాత్రమే పరిమితమైన వృత్తిని చేపట్టి లింగ వివక్షను బద్దలు కొట్టింది. కొయిడా గనుల నుండి ఇనుప ఖనిజాన్ని రవాణా చేసే వోల్వో ట్రక్కును నడుపుతోంది. తనకు, తన కుమార్తెకు గౌరవప్రదమైన జీవితాన్ని సృష్టించుకున్న ఆమె స్ఫూర్తిదాయక పరిచయం...

పదహారేండ్ల వయసులో సంతోషి డియో హర్యానాలోని ఓ బ్రాహ్మణ కుటుంబంలోని వ్యక్తిని పెండ్లి చేసుకుంది. అప్పటి నుండి ఆమె జీవితం భయంకరమైన మలుపు తిరిగింది. అనునిత్యం వరకట్న వేధింపులు, గృహహింస అనుభవిస్తూ బాధాకరమైన జీవితాన్ని గడిపింది. చాలా కాలం తనని తాను మరిచిపోయి బాధను, కోపాన్ని పూర్తిగా అణిచిపెట్టుకుంది. కట్టేసి కొడితే పిల్లి కూడా ఏదో ఒకనాడు పులై తిరగబడుతుందని మనకు తెలుసు కదా! అలాగే సంతోషి కూడా. ఇక ఆ బాధల జీవితాన్ని భరించలేకపోయింది. పరిస్థితులకు తలవంచడానికి నిరాకరించింది. తిరిగి పోరాడాలని బలంగా నిర్ణయించుకుంది.

అద్భుతమైన కథ

రెండు దశాబ్దాల తర్వాత ఒడిషా రాష్ట్రంలో ఖనిజాలు ఎక్కువగా దొరికే కియోంఝర్ జిల్లా నుండి పాఠశాల చదువును మధ్యలోనే ఆపేసి వచ్చిన ఈమె జీవితం మలుపు తిరిగింది. ఇప్పుడు ఆమె ప్రయాణం స్థితిస్థాపకత, దృఢత్వం, సంకల్పంతో కూడిన అద్భుతమైన కథ. సంతోషి తన అత్తవారి ఇంటిని విడిచిపెట్టి తర్వాత మొదట తమిళనాడులోని స్పిన్నింగ్ మిల్లులో పనిచేసింది. ఆ పని చేస్తూనే ఆటో రిక్షా, బస్సు నడుపుతూ జీవనోపాధి కోసం తాను చేయగలిగినదంతా చేసింది. తన తల్లిదండ్రుల తొమ్మిది మంది సంతానంలో ఆరవ బిడ్డగా పుట్టిన ఈ ధైర్యవంతురాలు తర్వాత కాలంలో ఇనుప ఖనిజాల గనిలో డ్రైవర్‌గా ఉద్యోగంలో చేరింది. సుందర్‌ఘర్ జిల్లాలోని కొయిడాలో ఇనుప ఖనిజం గనిలో ఒకప్పుడు పురుషులు మాత్రమే పని చేసేవారు. మహిళలకు అక్కడ ప్రవేశం లేదు. అలాంటి చోట సంతోషి పురుషులతో సమానంగా 40-టన్నుల వోల్వో ట్రక్కును నడుపుతూ తనలాంటి మహిళలకే కాదు, యువతకు, సమాజానికే స్ఫూర్తిగా నిలిచింది.

పుట్టింట్లోనూ అవమానాలు

గర్భవతిగా ఉన్న సంతోషి భర్త నుండి విడిపోయి సదర్ బ్లాక్, హండిభంగా పంచాయతీ, బాదముని గ్రామంలోని తన తల్లిదండ్రుల ఇంటికి తిరిగి వచ్చింది. అయితే ఆ కుటుంబం నుండి ఆమెకు మద్దతుకు బదులుగా అవమానాలు ఎదురయ్యాయి. అయినా అధైర్యపడకుండా తన సొంత మార్గాన్ని ఏర్పరచుకోవాలనుకుంది.



స్పిన్నింగ్ మిల్లులో పని చేయడానికి తమిళనాడుకు వలస వెళ్లింది. 'మా అత్తగారి ఇంటిని విడిచిపెట్టి వచ్చిన కొన్ని నెలల తర్వాత స్పిన్నింగ్ మిల్లులో పనిచేసే అవకాశం వచ్చింది. అక్కడే 2012లో నాకు అమ్మాయి పుట్టింది. మూడేండ్లు అక్కడే కష్టపడి నా కూతురిని పెంచి, మంచి భవిష్యత్తును నిర్మించుకోవడానికి ప్రతి పైసాను పొదుపు చేశాను' అని ఆమె గుర్తుచేసుకుంది



కొత్త ఆలోచనలు, కలలు

చెన్నైలో ఆమె ఆటో రిక్షా నడుపుతున్న ఓ మహిళను చూసింది. అది ఆమెలో కొత్త ఆలోచలను, కలలను రేకెత్తించింది. 'నాలాంటి ఓ మహిళ డ్రైవింగ్ చేయగలిగితే, నేనెందుకు చేయలేను' అని ఆమె ఆలోచించుకుంది. ఇది ఆమె జీవితంలో ఒక గొప్ప మలుపుగా మారింది. 2015లో తన పొదుపు డబ్బుతో పాటు కొంత రుణం తీసుకొని ఆటో రిక్షా కొనుక్కుని తన సొంత జిల్లాకి తిరిగి వచ్చింది. కుమార్తెకు మరింత మంచి భవిష్యత్తు అందించడానికి 2017లో భువనేశ్వర్‌కు చేరుకుంది. అక్కడ తన బిడ్డను నగరంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించింది. ఆటో నడుపుకుంటూ ఆ తల్లీ బిడ్డలు నిరాడంబర మైన జీవితాన్ని గడిపేవారు. డ్రైవింగ్ చేస్తున్న ఆమె అప్పటి ఒడిషా స్కిల్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సుబ్రతో బాగ్చితో పాటు అనేక మంది ఉన్నత అధికారుల నుండి ప్రశంసలు పొందింది.

> సుందర్‌ఘర్ జిల్లాలోని కొయిడాలో ఇనుప ఖనిజం గనిలో ఒకప్పుడు పురుషులు మాత్రమే పని చేసేవారు. మహిళలకు అక్కడ ప్రవేశం లేదు. అలాంటి చోట సంతోషి పురుషులతో సమానంగా 40-టన్నుల వోల్వో ట్రక్కును నడుపుతూ తనలాంటి మహిళలకే కాదు, యువతకు, సమాజానికే స్ఫూర్తిగా నిలిచింది.

ఆశయాలు అక్కడితో ఆగలేదు

డ్రైవింగ్ చేయడంతో సంతోషి ఆశయాలు ఆగిపోలేదు. భారీ వాహనాలు నడపడంలో శిక్షణ పొందింది. 2021లో క్యాపిటల్ రీజియన్ అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ (సిఆర్‌యుటి) నిర్వహిస్తున్న సిటీ బస్ సర్వీస్ అయిన మో బస్‌కు డ్రైవర్‌గా నియమితురాలయ్యింది. దాంతో ఆమె కష్టానికి ఫలితం దక్కింది. కొద్దిరోజులకే ఆమె ఒడిశాలోని ఒంటరి మహిళా బస్సుగా మహిళా సాధికారతకి ముఖ చిత్రంగా మారింది.



అయితే ఊహించని విధంగా ఆమె విజయగాథ మరింత ముందుకు వెళ్లింది. 'నేను రైల్వే స్టేషన్-పాత్రపాడు మార్గంలో మో బస్‌కు డ్రైవర్‌గా నియమించబడ్డాను. నేనే తొలి మహిళా బస్సు డ్రైవర్ కావడంతో స్థానిక మీడియా దాన్ని హైలైట్ చేసింది. ఒక నెల తర్వాత నా అధికారులు నన్ను ఉద్యోగం నుండి తొలగించారు. నా తప్పు ఏమిటో నేను అర్థం చేసుకోలేకపోయాను' ఆమె చెప్పింది.

దృఢ సంకల్పంతో...

ఉద్యోగం పోవడంతో మళ్ళీ జీవితం ఆమె సంకల్పాన్ని పరీక్షించింది. కుటుంబాన్ని పోషించుకోవడానికి ఆటో రిక్షా డ్రైవింగ్‌కు తిరిగి వచ్చింది. ఆరు నెలల కిందట ఓ మైనింగ్ కంపెనీ సంతోషిలోని పట్టుదల, ధైర్యాన్ని గుర్తించింది. వోల్వో ట్రక్కును నడపడానికి ఆమెకు అవకాశం ఇచ్చారు. వాస్తవానికి ఈ పని గతంలో పురుషులు మాత్రమే చేసేవారు. అలాంటి చోట ఆమె దృఢ సంకల్పంతో ఉద్యోగం సంపాదించి లింగ వివక్షను బద్దలు కొట్టింది. పట్టుదల ఉండాలే కానీ ఏ కలనైనా నిజం చేసుకోవచ్చు అని రుజువు చేసి ఇప్పుడు నెలకు రూ.22,000 జీతం పొందుతోంది.

భువనేశ్వర్ టు న్యూఢిల్లీ

వృత్తి పరంగా ఎంత ఎదుగుతున్నా వ్యక్తిగత జీవితం మాత్రం ఆమెకు ఒక యుద్ధంగానే మిగిలిపోయింది. తాను విడిచిపెట్టాలనుకునే వివాహబంధంలో ఇరుక్కుపోయిన ఆమె భర్త నుండి విడాకుల కోసం దాఖలు చేసింది. కానీ అతను దానిని నిరాకరించాడు. 2017లో ఆమె తన భర్త నుండి విడాకులు ఇప్పించమనీ, తనకు, తన కుమార్తెకు న్యాయం చేయాల్సిందిగా విన్నవించుకునేందుకు ప్రధానమంత్రిని కలవడానికి న్యూఢిల్లీ వరకు తన ఆటోరిక్షాలోనే వెళ్లింది. 'నేను అతనిని కలవలేకపోయాను.

కానీ నేను కేంద్ర మంత్రి జుయల్ ఓరమ్‌ను కలుసుకుని నా వినతిని సమర్పించాను' అని ఆమె చెప్పింది. ప్రస్తుతం కూతురు హాస్టల్‌లో ఉండి చదువుకుంటుంది. సంతోషి తన సొంత గ్రామంలో సొంత ఇల్లు కట్టుకుంది. ఆమె ఇప్పటికీ అదనపు ఆదాయం కోసం ఉద్యోగానికి సెలవు రోజులలో ఆటో నడుపుతోంది. ■



బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌తో రాజ్యాంగం విధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. దివిస్ అదానీ కంపెనీలు డబ్బులు పోగు చేసుకోవడానికి పనికొస్తాయి తప్ప ప్రజల అవసరాల కోసం కాదన్నారు. సామాజిక న్యాయం కోసం, దోపిడికి వ్యతిరేకంగా పోరాడే కమ్యూనిస్టులు బలపడాలని, అప్పుడే సోషలిజం బలపడుతుందని స్పష్టంచేశారు. ఎర్రజెండా బలపడకుండా మన సమస్యలు పరిష్కారం కావన్నారు. బీజేపీ ప్రభుత్వం "ఒకే దేశం, ఒకే మతం, ఒకే పన్ను, ఒకే ఎన్నిక" అంటూ ప్రచారం చేసుకుంటూ జమిలి ఎన్నికలనే ప్రస్తావన ప్రస్తుతం పార్లమెంట్‌లో జరుగుతుందన్నారు. ఈ జమిలి ఎన్నికల ద్వారా నిరంకుశత్వం వస్తుందని, దీన్ని సీపీఐ(ఎం) వ్యతిరేకిస్తుందన్నారు. నష్టపోయేది ప్రాంతీయ పార్టీలేనని, ముఖ్యంగా ఆంధ్రా, తెలంగాణలో టీడీపీ, బీఆర్‌ఎస్ పార్టీలేనన్నారు. కాంగ్రెస్ వ్యతిరేకిస్తున్నా కేసీఆర్, చంద్రబాబు నాయుడు మాత్రం వ్యతిరేకించడం లేదని చెప్పారు. ఒకేసారి పార్లమెంట్, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టడం వెనుక ధన బలాన్ని ప్రదర్శించడం కోసమేనని అన్నారు. దేశంలో ఒకేసారి జమిలి ఎన్నికలు జరిగితే సమయం, డబ్బు ఆదావుతుందని ప్రచారం చేస్తున్నారని, అలాంటిది ఏమీ జరగదన్నారు. ప్రస్తుతం పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు ఆరు దశలుగా జరుగుతున్నాయని, వీటికోసం ఒక ఈవీఎం పెడితే సరిపోతుందని, అదే ఒకేసారి జమిలి ఎన్నికలు పెడితే ఈవీఎంలు ఎక్కడి నుంచి వస్తాయని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాలు, ప్రజల సమస్యలను చర్చించడం కోసమే ప్రతి మూడేండ్లకోసారి సీపీఐ(ఎం) మహాసభలు గ్రామస్థాయి నుంచి దేశ స్థాయి వరకు జరుగుతాయని చెప్పారు. ఈ మహాసభ స్థానిక సమస్యలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు, అమలు తీరుపై చర్చించి, భవిష్యత్ కర్తవ్యాలను రూపొందిస్తామని చెప్పారు. ప్రజల కోసం పోరాడేది కేవలం కమ్యూనిస్టులేనని స్పష్టంచేశారు. భువనగిరి జిల్లా ప్రజానీకానికి కష్టం వస్తే సీపీఐ(ఎం) కార్యకర్తలు గుర్తుకు రావాలన్నారు. ఆ విధంగా పనిచేస్తూ ముందుకు సాగాలని సూచించారు. పోరాటాలతోనే అధికారంలోకి రావొచ్చని ఇటీవల శ్రీలంకలో కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ సభలో కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, సత్తుపల్లి అనురాధ, పైళ్ల ఆశయ్య, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బాలరాజు, మంగ నర్సింహులు, కల్లూరి మల్లేశం, దోనూరు నర్సిరెడ్డి, దాసరి పాండు, మేక అశోక్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బోర్డు కృష్ణారెడ్డి, ఎండీ పాషా, గంగాదేవి సైదులు, బండారు నర్సింహ, అవ్వారి రామేశ్వరి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్, మున్సిపల్ కౌన్సిలర్ దండా అరుణ్ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

జమిలీ బిల్లులపై వెనక్కి తగ్గిన కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లును సభలో ప్రవేశపెట్టాల్సి ఉంది. జమిలీ ఎన్నికల నిర్వహణకు వీలుగా ఈ రెండు బిల్లులను రూపొందించారు. అయితే ఆశ్చర్యకరంగా కొన్ని గంటల వ్యవధిలోనే ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. దిగువ సభ వెబ్‌సైటులో సవరించిన సభా కార్యక్రమాలను పోస్ట్ చేశారు. తొలుత ప్రచురించిన కార్యకలాపాల జాబితా ఉండి ఈ రెండు బిల్లులను తొలగించారు. బిల్లులను ముందుగా సభలో ప్రవేశపెట్టి, ఆ తర్వాత సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపుతారని తొలుత వార్తలు వచ్చాయి. సభలో చేపట్టే కార్యక్రమాల నుండి ఈ రెండు బిల్లులను తొలగించినప్పటికీ నిబంధనల ప్రకారం అనుబంధ జాబితా ద్వారా వాటిని ప్రభుత్వం సోమవారం సభలో ప్రవేశపెట్టవచ్చు.

హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యం

(మొదటిపేజీ తరువాయి)

వేతనం రూ.18000 నిర్ణయించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, తదితర డిమాండ్ల సాధన కోసం తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆశా వర్కర్ల రాష్ట్ర బస్సు జాతను నిర్వహిస్తున్నారు. ఈ జాతను ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలో సాయిబాబా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పాత తహసీల్దార్ కార్యాలయ మైదానంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా స్కీమ్ వర్కర్ల సమస్యలపై సీఐటీయూ అనేక పోరాటాలు చేసిందని గుర్తుచేశారు. ఫలితంగా 2013లో 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్సు సమావేశంలో స్కీమ్ వర్కర్లలో భాగమైన ఆశాలను కార్మికులుగా గుర్తించాలని, కనీసం వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని తీర్మానించినట్టు తెలిపారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన ఈ పదిన్నర ఏండ్లలో ఐఎల్‌సీ సిఫార్సులను అమలు చేయలేదని విమర్శించారు. కరోనా కాలంలో ఆశాల శ్రమను గుర్తించిన డబ్ల్యుహెచ్ఓ 'గ్లోబల్ లీడర్స్' అని అవార్డును ప్రకటించిందని గుర్తుచేశారు. కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం వారి శ్రమను గుర్తించకపోవడం సిగ్గుచేటన్నారు. అత్యంత దుర్మార్గంగా రూ.3వేలు మాత్రమే పారితోషికం చెల్లిస్తోందని, ఈ పద్ధతిని రద్దు చేసి పెరిగిన ధరలకు అనుగుణంగా ఆశాలకు కనీసం వేతనం అందించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఆయుష్మాన్ భారత్ పేరుతో వైద్య రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న మోడీ ప్రభుత్వం ఈ రంగంలో కీలకమైన ఆశాలను గుర్తించకపోవడం శోచనీయమన్నారు. వైద్యరంగపరంగా సర్వేల పేరుతో వెట్టి చాకిరి చేయిస్తుందన్నారు. గతంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆశా వర్కర్లకు హామీలు ఇచ్చినప్పటికీ పదేండ్లలో వాటిని నెరవేర్చలేదని తెలిపారు. 106 రోజులు సమ్మె చేస్తే రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి చర్చలు జరిపినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని, వేతనాలు పెంచుతామని మేనిఫెస్టోలో పొందుపరిచి హామీ ఇచ్చిందని తెలిపారు. కానీ ఏడాది గడిచినా ఇచ్చిన హామీని నెరవేర్చలేకపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హక్కులు సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఆశా వర్కర్ల బస్సు జాతాను ప్రారంభించామన్నారు.

డిసెంబర్ 31న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ముగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు ఎస్వీ రమ, కోశాధికారి వంగూరు రాములు, ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి నీలాదేవి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మన సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, జిల్లా నాయకులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

భూమిలేని పేదలకు రూ.12వేలు

(మొదటిపేజీ తరువాయి)

కల్పించి ప్రజలను మోసం చేసిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. అప్పులపై ప్రజలను పక్కదోవ పట్టిస్తోందని, బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలో చేసిన అప్పులపై తమ దగ్గర పక్కా లెక్కలు ఉన్నాయని స్పష్టంచేశారు.

కేసీఆర్ పదేండ్లలో చేసిన అప్పులపై చర్చకు సిద్ధమా..?

కేసీఆర్ బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలో చేసిన అప్పులపై చర్చకు సిద్ధమా.. అని భట్టి ప్రశ్నించారు. రాష్ట్రప్రభుత్వం బ్యాంకులకు 2014 నాటికి చెల్లించాల్సిన అప్పు రూ.6,400 కోట్లు ఉండగా, పదేండ్లలో ఆ అప్పుల వల్ల ఏడాదికి రూ.66,782 కోట్లు వడ్డీ చెల్లించాల్సిన దుస్థితికి కేసీఆర్ ప్రభుత్వం తీసుకెళ్లిందన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో చేసిన అప్పులకు తాము వడ్డీలు కడుతున్నామని తెలిపారు. కాంగ్రెస్ ఇప్పటివరకు రూ.54వేల కోట్ల అప్పులు చేసిందని తెలిపారు. ఈ లెక్కలపై అసెంబ్లీలో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్.. నీటిపారుదల, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఆస్పత్రులు, ఉద్యోగుల జీపీఎఫ్, ఫీజు రీయింబర్స్‌మెంట్, మధ్యాహ్న భోజనం తదితర శాఖలకు రూ.40,154 కోట్లు బకాయిలు పడిందన్నారు. పదేండ్లలో ప్రత్యక్ష, పరోక్షంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.7,11,911 కోట్లు అప్పులు చేసి ప్రజలపై భారం మోపిందన్నారు. బీఆర్‌ఎస్ చేసిన అప్పులు ఆ పార్టీ నేతలు తినడానికైతే.. కాంగ్రెస్ చేసిన అప్పులు ఆ వడ్డీలు కట్టడానికి అని స్పష్టం చేశారు. పది నెలల్లో రూ.66,722 కోట్ల అప్పులు కట్టామన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం సన్నవడ్లు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నామని తెలిపారు. ఈ బోనస్ ద్వారా ప్రతి ఎకరాకు రూ.10నుంచి రూ.15వేల వరకు రైతులు లబ్ది పొందుతున్నారని చెప్పారు. ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాతిగా పనిచేస్తుందన్నారు. రూ.21వేల కోట్ల రుణమాఫీ ఒక్క ఏడాదిలోనే చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హాస్టల్ విద్యార్థులకు కామన్ మెనూ అమలు చేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమల విస్తరణ కోసం కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్, వరంగల్ ప్రాంతాల్లో విమానాశ్రయాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు తలమానికంగా మూసీని అభివృద్ధి చేయడానికి మూసీ పునరుజ్జీవ కార్యక్రమం చేపట్టామన్నారు. అలాగే, అన్ని జిల్లాలనూ కలుపుతూ రీజనల్ రింగ్‌రోడ్డు ఏర్పాటు చేస్తామన్నారు. ఔటర్ రింగ్‌రోడ్డు, రీజనల్ రింగ్‌రోడ్డు మధ్య ఇండస్ట్రియల్, హౌసింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేసి భవిష్యత్తు తరాలకు అందిస్తామని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దొబ్బల సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ -2 పరీక్షలు ప్రశాంతం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతగా ముగిశాయని టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ ఒక ప్రకటనలో తెలిపారు. పేపర్-1లో జనరల్ స్టడీస్, ఎబిలిటీస్, పేపర్-2లో చరిత్ర, రాజకీయాలు, సమాజం పాఠ్యాంశాలు ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తం 5,51,855 మంది పరీక్షకు దరఖాస్తు చేసుకోగా తొలి రోజు నిర్వహించిన పేపర్-1లో 2,57,981 మంది, పేపర్-2లో 2,55,490 అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. కాగా పేపర్-1లో 46.75, పేపర్-2లో 46.30 శాతం హాజరు నమోదైందని పేర్కొన్నారు. కాగా వికారాబాద్ పరీక్షా కేంద్రంలో సెల్‌ఫోన్‌తో అభ్యర్థి చిక్కాడు.

దొడ్డితోవ..

(మొదటిపేజీ తరువాయి)

రైతు సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. కేంద్రం ప్రతిపాదించిన సంస్కరణలు వ్యవసాయ మార్కెటింగ్‌పై రాష్ట్రాల అధికారాన్ని లాక్కుంటూ, సమాఖ్య వ్యవస్థను సవాలు చేస్తున్నాయి. అయితే రైతులకు కనీస మద్దతు ధరల చట్టం (ఎమ్ఎస్‌పీ) గురించి ఈ ముసాయిదాలో ప్రస్తావనే లేకపోవడం గమనార్హం. పైపెచ్చు ప్రయివేటు రంగాన్ని బలపరిచేలా ముసాయిదాను రూపొందించారు. రైతుల బేరసారాల శక్తిని తగ్గిస్తూ, ప్రతిపాదనలు చేశారు. ఈ ప్రతిపాదనలు అమలైతే, రైతులకు కీలకమైన మండి (వ్యవసాయ మార్కెట్లు) వ్యవస్థలు నిర్వీర్యమై, సంఖ్య కుదించుకు పోతుందని రైతు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌ను పరిగణనలోకి తీసుకోకుండా కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ విధించే ఎగుమతి సుంకాలు, నిషేధాలు, కనీస ఎగుమతి ధర



విధానాలు రైతులను నష్టాలకు గురిచేసేలా ముసాయిదా ప్రతిపాదనల్ని రూపొందించారు. దీనిపై సుదీర్ఘ చర్చను రైతు సంఘాలు కోరుతున్నాయి. దేశ రైతాంగానికి వ్యతిరేకంగా ఉన్న ప్రతిపాదనల్ని అమోదించేది లేదని తేల్చిచెప్తున్నాయి. దీనిపై ఇప్పటికే దేశంలోని పలు ప్రాంతాల రైతులు ఆందోళనల బాట పడుతున్నారు.

'మట్టి'నీ మింగుతుండ్రు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నా ఆ గోతులు పూడ్చకుండా రాత్రి సమయంలో వెంచర్లకు, పగలు జాతీయ రహదారి నిర్మాణం పేరుతో బయటకు తరలిస్తున్నారు.

పోలీసు, మైనింగ్ అధికారులకు ట్రిప్పుకు ఒక్కొక్కరికి రూ.500

గుట్ట మట్టిని తవ్వేందుకు రెండు భారీ ప్రొక్లెయిన్‌లను వినియోగిస్తున్నారు. ఈ ప్రొక్లెయిన్‌లు ఒక్కో టిప్పర్‌కు లోడింగ్ చేసినందుకు రూ.2000 చొప్పున కాంట్రాక్టర్ వసూలు చేస్తున్నారు. బయట ఒక్కో టిప్పర్ మట్టిని రూ.6వేల చొప్పున అమ్ముతున్నారు. దీనిలో ట్రిప్పుకు రూ.500 చొప్పున పోలీస్, మరో రూ.500 భూగర్భగనులశాఖ అధికారులకు ఇస్తున్నట్టు బహిరంగంగానే చెబుతున్నారు. ఇలా మట్టిని తరలించే టిప్పర్లకు సరిగ్గా నంబర్ ప్లేట్లు కూడా ఉండకపోయినా రవాణాశాఖ అధికారులు పట్టించుకోవ డం లేదు. ఇలా రోజుకు రూ.3 లక్షల విలువైన మట్టి బయటకు తరలుతుం డటం చర్చనీయాంశంగా మారింది. రెండు రోజుల క్రితం శ్రీశ్రీ సర్కిల్ ప్రాంత ంలో ప్రయివేటు బిల్డింగ్ పునాదులకు మట్టి తరలిస్తున్న క్రమంలో టిప్పర్ బోల్తా కొట్టింది. నాలుగురోజుల క్రితం అల్లీపురం ఇసుక అడ్డా సమీపం లోకి వంద ట్రిప్పులు,చింతకాని, రామకృష్ణాపురం రైల్వేకాలనీకి వంద ట్రిప్పుల మట్టి ని అక్రమంగా తరలించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇలా పలు ప్రాంతాల్లో వెంచర్లకు ఇలా అనుమతులు లేకుండా తవ్వకాలు చేస్తున్నారని తెలుస్తోంది.

ప్రభుత్వ ఖజానాకు గండి..

ఓ వైపు ప్రకృతి సంపద తరలిపోతున్నా.. మరోవైపు ప్రభుత్వానికి ఏమైనా ఆదాయం వస్తుందా..? అంటే అదీ లేదు. నిబంధనల ప్రకారం ఒక ఘనపు మీటర్ మట్టి తోలేందుకు ప్రభుత్వానికి రూ.20 చెల్లించాలి. గతంలో ట్రాక్టర్ల ద్వారా మట్టి తరలించేవారు. ఇప్పుడు టిప్పర్ల ద్వారా సాగిస్తున్నారు. ఒక్క టిప్పర్లో 12 ఘనపు మీటర్ల మట్టి పడుతుంది. అంటే టిప్పర్‌కు ప్రభుత్వానికి రూ.240 రాయల్టీ చెల్లించాలి. ఇలా జిల్లావ్యాప్తంగా రాత్రింబవళ్ల రోజుకు వెయ్యి ట్రిప్పుల మట్టి అక్రమంగా తరలుతోంది. తద్వారా ప్రభుత్వానికి రూ.కోట్లలో ఆదాయానికి గండిపడుతోంది. రఘునాథపాలెం మండలంలోని కోయచలక, మంచుకొండ రెవెన్యూ పరిధిలోనూ గతంలో ఇలాగే అక్రమంగా మట్టి తరలించారు. ఈ విషయం లోకాయుక్త వరకూ వెళ్లినా దందా మాత్రం ఆగడం లేదు. ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లి, మద్దులపల్లి, గుర్రాలపాడు, వెంకటగిరి, ఏదులాపురం, ముత్తగూడెం, పెద్దతండా, పల్లెగూడెం, ఎంవీపాలెం తదితర ప్రాంతాల నుంచి కూడా అక్రమంగా మట్టి తరలింపుపై పలుమార్లు 'భూగర్భ గనులశాఖ' అధికారుల దృష్టికి 'నవతెలంగాణ' తీసుకెళ్లింది. అయినా అక్రమార్కులతో కుమ్మక్కైన అధికారులు మట్టి మాఫియాను నియంత్రించక పోవడం గమనార్హం. ఈ విషయమై మైనింగ్ ఏడీ సాయినాథ్‌ను ప్రశ్నించేందుకు పలుమార్లు ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదు.

చర్యలు తీసుకుంటాం: షరీఫ్, సీఐ, రఘునాథపాలెం

స్వామినారాయణ స్కూల్‌కు కేటాయించిన ప్రాంతం నుంచి మట్టి బయటకు తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. ట్రిప్పుకు రూ.500 పోలీసులకు ఇస్తున్నారనే విషయం మా దృష్టికి రాలేదు. దీనిపై దృష్టి సారించి చర్యలు తీసుకుంటాం.

నేటి నుంచి మళ్లీ అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాయి)

శాసనసభ కార్యదర్శి డాక్టర్ వీ నర్సింహాచార్యులు తెలిపారు. ప్రభుత్వం ఈనెల 9న ఐదు ఆర్డినెన్సుల్ని సభలో ప్రవేశపెట్టింది. వాటిలో 2024 తెలంగాణ జీతాలు, పించను చెల్లింపు, అనర్హతల తొలగింపు (సవరణ) ఆర్డినెన్స్, పురపాలక సంఘాల (సవరణ) ఆర్డినెన్స్, హైదరాబాద్ మహానగరపాలక సంస్థ (సవరణ) ఆర్డినెన్స్, వస్తుసేవల పన్ను ఆర్డినెన్స్, పంచాయతీరాజ్ (సవరణ) ఆర్డినెన్సులు ఉన్నాయి. అలాగే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క 2022-23 ఆర్థిక సంవత్సర తెలంగాణ విద్యుత్ ఆర్థిక సంస్థ 9వ వార్షిక నివేదిక ప్రతిని కూడా సభలో ప్రవేశపెట్టారు. అలాగే సోమవారం జరిగే ప్రశ్నోత్తరాల్లో గ్రామ పంచాయతీల్లో బీటీ రోడ్ల నిర్మాణం, మున్సిపాల్టీల్లో పారిశుధ్య కార్మికుల క్రమబద్ధీకరణ, గ్రామపంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లకు సంబంధించిన పెండింగ్ బిల్లుల చెల్లింపు, ముదిరెడ్డిపల్లి చెరువులో నీటి కాలుష్యం, నూతన పారిశ్రామిక పార్కుల ఏర్పాటు, పర్యాటకానికి ప్రోత్సాహం, ఉస్మానియా యూనివర్సిటీలో బీఈ విద్యార్థుల డిటెన్షన్, బెల్ట్‌షాపుల మూసివేత, ఐవీఎఫ్ కేంద్రాలు, జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలపై సభ్యులు అడిగే ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు చెప్తారు. అలాగే ఆర్ఓఆర్ సవరణ చట్టంపై కూడా ఈ సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. మధ్యాహ్నం 2 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం జరగనున్నది.



జయప్రదంగా సీపీఐ(ఎం) రాజస్థాన్ రాష్ట్ర మహాసభలు

రాష్ట్ర కార్య వర్గం ఎన్నిక | కార్యదర్శిగా కిషన్ పరీక్ | హాజరైన పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్

న్యూఢిల్లీ : సీపీఐ(ఎం) రాజస్థాన్ రాష్ట్ర నూతన కార్యదర్శిగా కిషన్ పరీక్ ఎన్నికయ్యారు. సీపీఐ(ఎం) రాజస్థాన్ 24వ మహాసభ మూడ్రోజుల పాటు హనుమాన్‌నగర్‌లోని సీతారాం ఏచూరి నగర్, బ్రిజ్‌లాల్ బదు మంచ్, బిజ్లా సింగ్ ఆడిటోరియంలో జరిగాయి. మహాసభ 11 మంది సభ్యుల రాష్ట్ర కార్యదర్శి వర్గం, 35 మంది సభ్యుల రాష్ట్ర కమిటీని ఎన్నుకుంది. ప్రస్తుత రాష్ట్ర కార్యదర్శి అమ్రారామ్ రిలీవ్ అయ్యారు. సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కరత్ మాట్లాడుతూ... 2024 లోక్‌సభ ఎన్నికల్లో నేర్చుకున్న గుణపాఠాలను విస్మరించి, ఆరెస్సెస్ విభజన రాజకీయాలను బీజేపీ ముందుకు తీసుకువెళ్లడంలో నిమగ్నమైందన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో మసీదుల కింద దేవుళ్లను కనుక్కుంటామనే ప్రచారం పేరుతో సామాన్య ప్రజలను మతోన్మాదానికి గురిచేస్తున్నారని విమర్శించారు. ప్రధాని, ముఖ్యమంత్రి, హైకోర్టు న్యాయమూర్తి మొదలుకొని బీజేపీ నేతల వరకు రాజ్యాంగ ప్రమాణాలను ఉల్లంఘిస్తున్నారని అన్నారు. మణిపూర్ మండుతున్నప్పటికీ ప్రభుత్వం మౌనంగా ఉన్నదని విమర్శించారు. బీజేపీ నేతల పిల్లలు విదేశాల్లో చదువుతున్నారనీ, సామాన్యుల పిల్లలకు టీచర్ల దగ్గరకు కూడా వెళ్లే అవకాశం లేదని అన్నారు. దేశంలో వాణిజ్యం, వ్యవసాయం, నిత్యావసర వస్తువుల ద్రవ్యోల్బణంలో మాంద్యం ఉన్నదనీ, ఇటువంటి పరిస్థితిలో, బీజేపీ విభజన రాజకీయాలను ఎదుర్కోవటానికి, ప్రజా జీవన సమస్యలపై పోరాటాన్ని బలోపేతం చేయడానికి సీపీఐ(ఎం) కృషి చేస్తుందని తెలిపారు.

బీజేపీ-ఆరెస్సెస్ విధానాలతో ఇబ్బందులు
సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు విజూ కష్ణన్

దేశంలో బీజేపీ-ఆరెస్సెస్ ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు విజూ కృష్ణన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని జనాభాలో మూడింట రెండొంతుల మంది కూలీలు, రైతులు ఉన్నారన్నారు. నేడు, రైతులు 2020 నుంచి ఎంఎస్‌పీ హామీ, భూసేకరణ, ప్రభుత్వ ధరలకు పంట సేకరణ, ఇతర సమస్యలపై లాఠీలు, తూటాలను ఎదుర్కొని వీధుల్లో పోరాటం చేస్తున్నారని తెలిపారు. కార్మికులు కార్మిక చట్టాలలో మార్పులు, కాంట్రాక్ట్ వ్యవస్థ, కనీస వేతనాలు, ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్నారని అన్నారు. బీజేపీ-ఆరెస్సెస్‌ల ప్రజా వ్యతిరేక విధానాలతో దేశంలోని రైతులు, కూలీలు, సామాన్య ప్రజానీకం ఇబ్బంది పడుతున్నారనీ, దేశ ప్రధాని మాత్రం ప్రసంగాల్లో మునిగితేలుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైతులపై కేంద్రం దమన కాండను సహించబోం


సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రైతులపై కేంద్ర ప్రభుత్వ దమన కాండను సహించబోమని సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ కమిటీ హెచ్చరించింది. ఢిల్లీ సరిహద్దులోని శంభు వద్ద రైతులపై భద్రతా సిబ్బంది భాష్పవాయుగోళాలు, నీటి ఫిరంగులను ప్రయోగించడాన్ని ఖండించింది. ఈ మేరకు ఆదివారం సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్లు పశ్యపద్మ, టి.సాగర్ ప్రభాకర్, విస్సా కిరణ్, వెంకన్న ఒక ప్రకటన విడుదల చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని పంజాబ్, హర్యానాకు చెందిన 101 మంది రైతులు చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమం పేరిట చేపట్టిన పాదయాత్రను అడ్డుకోవడం దారుణమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ రైతులు చేపట్టిన నిరసన కార్యక్రమం అడ్డుకోవడమే కాకుండా వారిపై భాష్పవాయు గోళాలన్ని ప్రయోగించడం ఏమిటని నిలదీశారు. రైతులపై కేంద్ర ప్రభుత్వం దమన కాండ కొనసాగించడం పరిపాటిగా మారిందనీ, ఇదే విధంగా వ్యవహరిస్తే ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మరోసారి భంగపాటు తప్పదని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం రైతుకుల గతంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సిరియాపై ఆంక్షలను ఉపసంహరించండి

ఐరాసలో ప్రత్యేక రాయబారి విజ్ఞప్తి



డమాస్కస్ : తమ దేశంపై విధించిన ఆంక్షలను ఉపసంహరించుకోవాలని పాశ్చాత్య దేశాలకు ఐరాసలో సిరియా ప్రత్యేక రాయబారి గీర్ ఫెడర్సెన్ ఆదివారం విజ్ఞప్తి చేశారు. దేశంలో బషర్ అసాద్ పాలన ముగిసిన నేపథ్యంలో 'ఆంక్షలను అతి త్వరలోనే ఎత్తివేస్తారని కోరుకుంటున్నాం. తద్వారా సిరియా నిర్మాణాన్ని చేపట్టగలం' అని ఆదివారం ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో గీర్ ఫెడర్సెన్ తెలిపారు. అస్సాద్ ప్రభుత్వం నేలకూలిన తరువాత ఏర్పాటైన తాత్కాలిక ప్రభుత్వంతో సమావేశం కోసం డమాస్కస్‌కు గీర్ ఫెడర్సెన్ వచ్చారు. తొలిసారిగా స్వదేశం వచ్చిన నేపథ్యంలో గీర్ ఫెడర్సెన్ విలేకరులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. తమదేశస్థులంతా రాజకీయంగా ఐక్యంగా ఉండి అభివృద్ధిలో పంచుకుంటారని చెప్పారు. అలాగే యుద్ధ సమయంలో జరిగిన నేరాల్లో బాధితులకు న్యాయం, జవాబుదారీతనం ఉండాలని పిలుపునిచ్చారు. సిరియాకు మానవతావాద సహాయాన్ని వేగవంతం చేయాలని అంతర్జాతీయ సమాజాన్ని కోరారు. అంతర్యుద్ధం, తిరుగుబాటు వంటి కారణాలతో 2011 నుంచి సిరియాపై అమెరికా, యూరోపియన్ యూనియన్, ఇతర దేశాలు కఠినమైన ఆంక్షలను అమలు చేస్తున్నాయి.

అమెరికా, చైనా మధ్య శాస్త్రీయ సహకార ఒప్పందం పునరుద్ధరణ



బీజింగ్: అమెరికా, చైనాలు తమ మధ్య శాస్త్రీయ, సాంకేతిక సహకార ఒప్పందాన్ని మరో ఐదేళ్ల పాటు పునరుద్ధరించుకున్నాయి. ఇరు దేశాల మధ్య తీవ్రమైన ఆర్థిక, రాజకీయ ఘర్షణ వాతావరణం నెలకొందని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ ఒప్పందం పునరుద్ధరణతో వాటిని ఖండించినట్లయింది. అయితే ఈ ఒప్పందంపై తొలిసారిగా 1979లో ఇరు దేశాలు సంతకం చేశాయి. తరువాత నుంచి ప్రతీ ఐదేళ్లకు ఈ దీన్ని పునరుద్ధరిస్తున్నారు. గగన తలంపై బెలూన్ కాల్చివేత, తైవాన్ అధ్యక్షులు-అమెరికా స్పీకర్ మధ్య భేటీ వంటి సందర్భాల్లోనూ ఈ ఒప్పందాన్ని పునరుద్ధరించారు. శాస్త్రీయ పరిశోధనలు, వాతావరణ మార్పులు, ఫెంటానిల్ అక్రమ రవాణా, సింథటిక్ డ్రగ్ వంటి విస్తృత రంగాల్లో అమెరికా, చైనా మధ్య సహకారం కోసం ఈ ఒప్పందం కుదిరింది. పునరుద్ధరించిన తాజా ఒప్పందంలో భద్రత, వివాదాల పరిష్కారానికి సంబంధించిన నిబంధనలను బలోపేతం చేసినట్లు, అలాగే మేథో సంపత్తిని రక్షించే నిబంధనలను జత చేసినట్లు అధికారులు తెలిపారు.

పాతబస్తీ మెట్రో భూసేకరణ పనులు ముమ్మరం

1100 ప్రభావిత ఆస్తులు సేకరణ చకచకా..

నెలఖారులోగా 200 ప్రభావిత ఆస్తులకు పరిహారం చెల్లింపు

పనుల ప్రగతిపై ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి సమీక్ష



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఓల్డ్ సిటీలో మెట్రో రైల్‌ను త్వరగా పట్టాలు ఎక్కించడానికి సంబంధించిన స్థల సేకరణ ప్రక్రియ వేగవంతమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు దాదాపు 7.5 కిలోమీటర్ల నిడివి గల ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట మార్గంలో భూసేకరణ పనులు ముమ్మరమయ్యాయి. ఇప్పటికే గుర్తించిన 1100 ప్రభావిత ఆస్తుల సేకరణ చకచకా సాగుతోంది. భూసేకరణ చట్టానికి లోబడి ఈ ప్రభావిత 1100 ఆస్తులకుగాను ఇప్పటికే 900 ఆస్తులకు సంబంధించిన రిక్విజిషన్‌ని జిల్లా కలెక్టర్‌కి సమర్పించామని, వాటిలో 800 ఆస్తులకు ప్రిలిమినరీ నోటిఫికేషన్‌ను దఫదఫాలుగా కలెక్టర్ జారీ చేశారని హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో లిమిటెడ్(హెచ్‌ఏఎంఎల్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. నోటిఫై చేసిన ఆస్తుల్లో 400 ఆస్తులకు ప్రిలిమినరీ డిక్లరేషన్‌ను కలెక్టర్ జారీ చేయడం పూర్తయ్యిందని చెప్పారు. 200 ప్రభావిత ఆస్తుల పరిహారానికి సంబంధించిన అవార్డులను ఈ నెలాఖరులోగా ప్రకటించి, వెంటనే వాటికి పరిహారం చెల్లించి వాటిని కూల్చే పనులూ ప్రారంభమవుతాయని అన్నారు.

తద్వారా మెట్రో రైల్ మార్గ నిర్మాణాన్ని సుగమం చేయనున్నట్టు స్పష్టం చేశారు. ఈ మార్గంలో ఉన్న వివిధ నిర్మాణాలు, ప్రభావిత ఆస్తుల యాజమానులతో సానుకూలంగా చర్చించి, వాటిని భూసేకరణ చట్టం ప్రకారం సేకరించి రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నట్టు తెలిపారు. రోడ్డు విస్తరణ, మెట్రో నిర్మాణంలోనూ మతపరమైన, చారిత్రక కట్టడాలన్నింటినీ తప్పించి వాటిని ఇంజినీరింగ్ సొల్యూషన్లతో పరిరక్షిస్తున్నామని తెలిపారు. మెట్రో రైల్ రాకతో పాత నగరం ఎంతో ఆకర్షణీయ ప్రాంతంగా రూపుదాల్చుకోనుందన్నారు. ఉపాధి అవకాశాలు మెరుగు కావడమే కాకుండా, కాలుష్య రహితంగా ఈ ప్రాంతమంతా గొప్ప అభివృద్ధి సాధించనున్నదని తెలిపారు. ముఖ్యమంత్రి ఇక్కడి మెట్రో రైల్ మార్గం విషయంలో అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కాగా, మెట్రో భూసేకరణ ప్రక్రియపై హెచ్‌ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నిరంతరం సమీక్షిస్తూ పనుల ప్రగతిని ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రికి వివరిస్తున్నారు.

నవచిత్రం

ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు



సదన్ హీరోగా, ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా తెరకెక్కిన 'ప్రణయ గోదారి' చిత్రం ఈనెల 13న విడుదలైంది. పిఎల్ విఘ్నేష్ దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీని పిఎల్‌వి క్రియేషన్స్‌పై పారమళ్ళ లింగయ్య నిర్మించారు.

ఈ సినిమాకు ఆడియెన్స్ నుంచి మంచి ఆదరణ దక్కింది. చిత్రాన్ని ఇంతలా ఆదరిస్తున్న ప్రేక్షకులకు, మీడియాకు థ్యాంక్స్ చెప్పేందుకు చిత్ర బృందం సక్సెస్ మీట్ నిర్వహించింది.

ఈ కార్యక్రమంలో దర్శకుడు విఘ్నేశ్ మాట్లాడుతూ,'చిన్న చిత్రమైనప్పటికీ పెద్ద హిట్ అందించిన ఆడియెన్స్, మీడియాకి థ్యాంక్స్. సినిమా చూసిన ప్రతీ ఒక్కరూ మమ్మల్ని అభినందించారు. విజువల్స్, పాటలు ఇలా ప్రతీ దాని గురించి మాట్లాడారు. ఆడియెన్స్ ఫీడ్‌బ్యాక్ విని మాకు చాలా సంతోషం కలిగింది. ప్రేక్షకులు బాగానే ఉందని అన్నారు.. కానీ మీడియా వారు ఎలాంటి రివ్యూలు ఇస్తారో అని అనుకున్నాం. మీడియా కూడా మా మూవీని మెచ్చుకుంది. ఇంత పెద్ద విజయాన్ని అందించిన ప్రతీ ఒక్కరికీ థ్యాంక్స్' అని అన్నారు. 'మా సినిమాను అందరూ మెచ్చుకుంటున్నారు. నా పాత్రకు మంచి రెస్పాన్స్ వస్తోంది. అందరూ ప్రశంసలు కురిపిస్తున్నారు. నాకు ఇంత మంచి ఛాన్స్ ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్' అని హీరోయిన్ ప్రియాంక ప్రసాద్ చెప్పారు. సంగీత దర్శకుడు మార్కండేయ మాట్లాడుతూ, 'మా ఈ చిన్న ప్రయత్నాన్ని అందరూ ఆదరిస్తున్నారు. మా సినిమా జనాల్లోకి తీసుకెళ్లడంలో మీడియా ముఖ్య పాత్రను పోషించింది. నేను ఇచ్చిన పాటలను అందరూ ఎంజాయ్ చేస్తున్నారు. మా సినిమాను ఇంత బాగా ఆదరిస్తున్న ఆడియెన్స్‌కు థ్యాంక్స్. మంచి కంటెంట్ ఉంటే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని మా సినిమా మరోమారు నిరూపించింది' అని అన్నారు.

'సతీ లీలావతి'గా లావణ్య త్రిపాఠి



లావణ్య త్రిపాఠి

వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న కథానాయిక లావణ్య త్రిపాఠి.

ఆమె ప్రధాన పాత్రలో తెరకెక్కనున్న సినిమా 'సతీ లీలావతి'.

దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్ పతాకాల సంయుక్త నిర్మాణ సారథ్యంలో ప్రొడక్షన్ నెం.1గా ఈ సినిమా రూపొందనుంది. 'భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్(శివ మనసులో శృతి)' తదితర విభిన్న చిత్రాల దర్శకుడు తాతినేని సత్య దర్శకత్వంలో నాగమోహన్ బాబు.ఎమ్, రాజేష్.టి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఆదివారం లావణ్య త్రిపాఠి పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను అనౌన్స్ చేసిన చిత్ర యూనిట్, ఆమెకు జన్మదిన శుభాకాంక్షలను తెలియజేసింది.

ఈ చిత్రంతో మరోసారి డిఫరెంట్ రోల్, ఎగ్జైటింగ్ కథాంశంతో మెప్పించటానికి లావణ్య త్రిపాఠి సిద్ధమయ్యారు. త్వరలోనే ఈ మూవీ చిత్రీకరణ ప్రారంభం కానుంది. మరిన్ని వివరాలను త్వరలోనే తెలియజేస్తామని నిర్మాతలు తెలిపారు.

ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జె.మేయర్, సినిమాటోగ్రఫీ: బినేంద్ర మీనన్, మాటలు: ఉదయ్ పొట్టిపాడు, ఆర్ట్: కోసనం విఠల్, ఎడిటర్: సతీష్ సూర్య.



ఎన్నో ప్రతిష్టాత్మక చిత్రాలకు ఫైనాన్స్ చేసిన ఫిలిం ఫైనాన్సర్, ఆర్ - సెక్యూర్డ్ ఫైనాన్స్ అధినేత బంగారు బాబు (ఈ.వి.రాజారెడ్డి) చిన్న కుమారుడు క్రాంతి రెడ్డి నిశ్చితార్థం పారిశ్రామికవేత్త సీతా రామిరెడ్డి, రామ సీత దంపతుల కుమార్తె శిరీషతో హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు పలువురు రాజకీయ, సినీ, వ్యాపార ప్రముఖులు విచ్చేసి నూతన వధూవరులకు అభినందనలు తెలియజేశారు.

దర్శకులే నా గురువులు..



అజయ్ అరసాడ

పీరియాడిక్ వెబ్ సిరీస్ 'వికటకవి' నవంబర్ 28 నుంచి జీ5లో స్ట్రీమింగ్ అవుతూ ప్రేక్షకులను విశేషంగా అలరిస్తోంది.

ఈ సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్ అజయ్ అరసాడ మీడియాతో మాట్లాడుతూ, 'వైజాగ్‌లో పుట్టి, పెరిగాను. గీతం యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చేసి, టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా 2018 వరకు జాబ్ చేశాను. ఇదే సమయంలో కొన్ని షార్ట్ ఫిల్మ్స్‌కు వర్క్ చేశాను. ప్రదీప్ అద్వైత్ ద్వారా 'జగన్నాటకం' మూవీలో ఛాన్స్ వచ్చింది. తరువాత నా చిన్ననాటి స్నేహితుడు, మ్యూజిక్ డైరెక్టర్ శ్రీచరణ్ పాకాల నన్ను 'గూఢచారి' సినిమాలో కీ బోర్డ్ ప్రోగ్రామింగ్ కోసం వర్క్ చేయమని అడగటంతో వర్క్ చేశాను. అలా 'క్షీర సాగర మథనం, నేడే విడుదల, మిస్సింగ్, శ్రీరంగనీతులు' సినిమాలకు వర్క్ చేశాను. సినిమాలతో పాటు వెబ్ సిరీస్‌లైన 'సేవ్ ది టైగర్స్ సీజన్1, సీజన్2'లకు సంగీతాన్ని అందించాను. సంగీత దర్శకుడిగా 'ఆయ్' మంచి గుర్తింపునిచ్చింది. 'వికటకవి' మ్యూజిక్‌కి కూడా మంచి పేరు రావడం ఆనందంగా ఉంది. ఇలాంటి సిరీస్‌లకు సంగీతం అందించడం ఛాలెంజింగ్‌గా ఉంటుంది. ప్రదీప్ మద్దాలి చాలా క్లారిటీ ఉన్న దర్శకుడు. ఈ సిరీస్‌కోసం కొత్తగా ప్రయత్నం చేశాం. డైరెక్టర్లే నాకు గురువులు అని భావిస్తాను. ప్రస్తుతం 'త్రీరోజెస్' సీజన్ 2తో పాటు ఆహాలో మరో రెండు వెబ్ సిరీస్‌లకు వర్క్ చేస్తున్నాను. కొన్ని సినిమాలకు చర్చలు జరుగుతున్నాయి. వీటి వివరాలను త్వరలోనే తెలియజేస్తాను' అని తెలిపారు.

ఆటలు


పచ్చికతో కూడిన పిచ్. వర్షంతో తొలి రోజు ఆటకు ఆటంకం. మేఘావృత వాతావరణం. సహజంగానే ఈ పరిస్థితుల్లో పేసర్లు వికెట్ల జాతర సాగిస్తారు. కానీ ట్రావిశ్ హెడ్ (152), స్టీవ్ స్మిత్ (101) శతక మోత మోగించారు. ట్రావిశ్ హెడ్ తనదైన శైలిలో భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఈ ఇద్దరు జోరందుకోగా ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు దిశగా సాగుతోంది. భారత పేస్ దళపతి జశ్‌ప్రీత్ బుమ్రా (5/72) ఐదు వికెట్ల ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు.

బౌలర్లు బేజారు

- రోజంతా చెమటోడ్చినా ఏడు వికెట్లే
- ట్రావిశ్ హెడ్, స్మిత్ శతక జోరు
- ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 405/7
- భారత్, ఆసీస్ మూడో టెస్టు రెండో రోజు

నవతెలంగాణ-బ్రిస్బేన్

భారత పేస్ దళపతి జశ్‌ప్రీత్ బుమ్రా (5/72) ఐదు వికెట్ల ప్రదర్శనతో నిప్పులు చెరిగినా.. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ మూడో టెస్టులో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు దిశగా దూసుకెళ్తోంది. విధ్వంసక బ్యాటర్ ట్రావిశ్ హెడ్ (152, 160 బంతుల్లో 18 ఫోర్లు) మరోసారి భారత్‌పై విరుచుకుపడ్డాడు. తాజా సిరీస్‌లో మరో కండ్లుచెదిరే ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. సంప్రదాయ బ్యాటర్ స్టీవ్ స్మిత్ (101, 190 బంతుల్లో 12 ఫోర్లు) పేలవ ఫామ్‌కు చెక్ పెడుతూ సెంచరీతో కదం తొక్కాడు. అలెక్స్ కేరీ (45 నాటౌట్, 47 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) అజేయ ఇన్నింగ్స్‌తో మెరిశాడు. గబ్బా టెస్టులో రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 101 ఓవర్లలో 405/7 పరుగులు చేసింది. మిచెల్ స్టార్క్ (7 నాటౌట్), అలెక్స్ కేరీ అజేయంగా క్రీజులో నిలిచారు. నేడు ఉదయం సెషన్లో వీలైనన్ని ఎక్కువ పరుగులు పిండుకునేందుకు ఆసీస్ ఎదురుచూస్తోంది!. తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరుతో భారత్‌పై ఆతిథ్య ఆస్ట్రేలియా ఒత్తిడి పెంచింది.



హెడ్, స్మిత్ శతక్కొట్టారు

ఓవర్‌నైట్ స్కోరు 28/0తో రెండో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన ఆస్ట్రేలియా ఉదయం సెషన్లో మూడు వికెట్లు కోల్పోయింది. జోరుమీదున్న ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా (21) సహా యువ ఓపెనర్ నాథన్ మెక్‌స్వీనీ (9)లను బుమ్రా సాగనంపాడు. మార్నస్ లబుషేన్ (12)ను తెలుగు తేజం నితీశ్ అవుట్ చేశాడు. ఉదయం సెషన్లో ఆసీస్ టాప్ ఆర్డర్‌పై ఒత్తిడి పెంచిన బౌలర్లు మూడు వికెట్లు వేగంగా పడగొట్టారు.



కానీ స్టీవ్ స్మిత్ (101), ట్రావిశ్ హెడ్ (152) నాల్గో వికెట్‌కు భారీ భాగస్వామ్యం నమోదు చేశారు. ఈ జోడీ నాల్గో వికెట్‌కు 303 బంతుల్లోనే 241 పరుగులు చేశారు. ఓ ఎండ్‌లో హెడ్ ధనాధన్ దంచికొట్టగా.. మరో ఎండ్‌లో స్మిత్ బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. దీంతో రెండో సెషన్లో భారత బౌలర్లకు ఒక్క వికెట్ కూడా దక్కలేదు. ఆడిలైడ్ జోరు కొనసాగించిన ట్రావిశ్ హెడ్ ఆరు ఫోర్లతో 71 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించాడు. 13 ఫోర్లతో 115 బంతుల్లో సెంచరీ బాదాడు. మరో వైపు స్టీవ్ స్మిత్ 128 బంతుల్లో నాలుగు ఫోర్ల సాయంతో అర్థ సెంచరీ అందుకున్నాడు. వరుస మ్యాచుల్లో పేలవ ప్రదర్శనతో ఒత్తిడిలో ఉన్న స్టీవ్ స్మిత్.. బ్రిస్బేన్‌లో ఏకంగా శతకబాదాడు. సెంచరీ తర్వాత హెడ్ మరింత దూకుడు పెంచాడు. 18 ఫోర్లతో 157 బంతుల్లో 150 పరుగుల మార్క్ చేరుకున్నాడు. 75/3 వద్ద మొదలైన హెడ్, స్మిత్ భాగస్వామ్యం.. 316/4 వద్ద ముగిసింది. టీ విరామం అనంతరం ఆసీస్ పరుగుల వేటలో వెనక్కి తగ్గకపోయినా.. భారత బౌలర్లు ఓ నాలుగు వికెట్లు పడగొట్టారు. స్మిత్, మిచెల్ మార్ష్ (5), ట్రావిశ్ హెడ్ సహా పాట్ కమిన్స్ (20) పెవిలియన్‌కు చేరారు. కానీ చివరి సెషన్లో 31 ఓవర్లలో 171 పరుగులు పిండుకున్న ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 405/7 పరుగులు చేసింది. రెండో రోజు ఆటలోనే ఆసీస్ ఏకంగా 405 పరుగులు చేసింది. ఓవర్‌కు నాలుగు పరుగుల చొప్పున పిండుకున్న కంగారూలు గబ్బా టెస్టుపై అప్పుడే పట్టు బిగించారు!. భారత బౌలర్లలో జశ్‌ప్రీత్ బుమ్రా (5/72) ఐదు వికెట్లు పడగొట్టినా..ఇతర బౌలర్లు విఫలమయ్యారు. మహ్మద్ సిరాజ్ (1/97), నితీశ్ కుమార్ రెడ్డి (1/65), ఆకాశ్ దీప్ (0/78), రవీంద్ర జడేజా (0/76) తేలిపోయారు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: ఉస్మాన్ ఖవాజా (సి) పంత్ (బి) బుమ్రా 21, నాథన్ మెక్‌స్వీనీ (సి) కోహ్లి (బి) బుమ్రా 9, మార్నస్ లబుషేన్ (సి) కోహ్లి (బి) నితీశ్ 12, స్టీవ్ స్మిత్ (సి) రోహిత్ (బి) బుమ్రా 101, ట్రావిశ్ హెడ్ (సి) పంత్ (బి) బుమ్రా 152, మిచెల్ మార్ష్ (సి) కోహ్లి (బి) బుమ్రా 5, అలెక్స్ కేరీ నాటౌట్ 45, పాట్ కమిన్స్ (సి) పంత్ (బి) సిరాజ్ 20, మిచెల్ స్టార్క్ నాటౌట్ 7, **ఎక్స్‌ట్రాలు :** 33, **మొత్తం :**(101 ఓవర్లలో 7 వికెట్లకు) 405.

వికెట్ల పతనం : 1-31, 2-38, 3-75, 4-316, 5-326, 6-327, 7-385.

బౌలింగ్ : జశ్‌ప్రీత్ బుమ్రా 25-7-72-5, మహ్మద్ సిరాజ్ 22.2-4-97-1, ఆకాశ్ దీప్ 24.2-5-78-0, నితీశ్ కుమార్ 13-1-65-1, రవీంద్ర జడేజా 16-2-76-0.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.